




www.andhrajyothy.com

విజయవాడ సిటీ

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

వెల (Price) : Rs. 6.50

సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 244

పేజీలు: 12 + 16








గురువారం | 19-12-2019

శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి రా. 9.24 తదుపరి నవమి; నక్షత్రం: ఉత్తర రా. 10.35 తదుపరి హస్త; వర్జ్యం: ఉ. 6.47-8.17, తె. 6.29 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 10.23-11.07, మ. 2.46-3.30; అమృతఘడియలు: మ. 3.48-5.19; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.43; సూర్యాస్తమయం: 5.41

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai




వికేంద్రీకరణంటే..

## రాజధానులు మార్చడమా?

- విశాఖ ఆర్థిక నగరం కాకుండా అడ్డుకున్నారు
- కన్వెన్షన్ సెంటర్ రాకుండా తరిమేశారు
- అది వస్తే లక్షల ఉద్యోగాలు వచ్చేవి
- కియా పరిశ్రమనూ వ్యతిరేకించారు
- ఇన్‌సైడర్ ట్రేడింగ్ అంటూ తప్పుడు ప్రచారం
- చట్టాన్ని వ్యతిరేకించాననుకుంటే మీకు దిక్కున్న చోట చెప్పుకోండి
- తప్పుచేశానని అబద్ధాలాడితే ఖబడ్దార్
- నిజం నిప్పు.. అసత్యాలు శాశ్వతం కావు
- పనికిమాలిన సీఎంకు ఓనమాలు రావు
- మాతో ఆటలా.. వడ్డీతో సహా తీర్చుకుంటాం
- అనంతపురంలో చంద్రబాబు హెచ్చరిక

10

## చిన్నపిల్లలాట కాదు



- తరలింపు సులువు కాదు.. కేంద్రం ఊరుకోదు
- అవగాహన లేకుండా సీఎం ఓ రాయి వేశారు
- రైతులూ.. ఆందోళన చెందొద్దు
- బీజేపీ ఎంపీ సుజనా వ్యాఖ్యలు

2

## రాజధాని.. 3 ప్రాంతాల్లో ఉండొచ్చు.. ఉండకపోవచ్చు!

### సీఎం ఊహించి ప్రకటన చేశారు



- కమిటీ నివేదిక తర్వాతే తుది నిర్ణయం
- ఎన్ని ఉన్నా అమరావతిలోనే అసెంబ్లీ
- ఇక్కడ కట్టాలంటే లక్షల కోట్లు కావాలి
- విశాఖలో అయితే ఖర్చు ఉండదు!
- జగన్ ఏది చెప్పినా సీరియస్‌గానే
- బాబులా పూటకో మాట మాట్లాడరు
- రైతులతో బూతులు తిట్టిస్తున్నారు: మంత్రి పేర్ని నాని

**కర్నూల్లో ఇతర విభాగాలూ పెట్టాలి: టీజీ**

10



## విశాఖ కేంద్రంగా వైసీపీ నేతల ఇన్‌సైడర్ ట్రేడింగ్

- విజయసాయి నేతృత్వంలో భూముల కొనుగోళ్లు
- ఓ స్వామీజీ ఆశ్రమం కేంద్రంగా దందా
- సీబీఐ విచారణ జరపాలి
- అనురాధ డిమాండ్



రాజధాని ప్రాంతంలోని మందడం గ్రామంలో రోడ్డెక్కి నిరసన తెలుపుతున్న మహిళా రైతులు, గ్రామస్థులు

# మూడుపై మంటలు

## ముఖ్యమంత్రి ప్రకటనపై మండిపడ్డ 'అమరావతి' రైతులు

- రోడ్డెక్కి రోజంతా నిరసనల హోరు
- పురుగుమందుడబ్బాలతో దీక్షలు
- వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే తాగేస్తామని సర్కారుకు హెచ్చరిక
- ఎక్కడికక్కడ నిలిచిన వాహనాలు
- నేడు రాజధాని బంద్‌కు పిలుపు
- రేపు సచివాలయాల ఎదుట దీక్ష

గుంటూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'మూడు రాజధానుల' ప్రకటనపై రాజధాని రైతులు రగిలిపోయారు. కళ్ల నిండా నీళ్లు.. చేతుల్లో పురుగుమందు డబ్బాలతో రోడ్డెక్కారు. 'ఆ ప్రకటన రద్దు చేసుకొంటారా లేక ఆత్మహత్య చేసుకోమంటారా' అని సూటిగా సర్కారును నిలదీశారు. అమరావతిలో రోజంతా నిరసనలతో హోరెత్తించారు. రహదారులను దిగ్బంధించడంతో కొన్ని గంటల పాటు విజయవాడ- అమరావతి మార్గంలో వాహనాలు నిలిచిపోయాయి. కర్నూలులో న్యాయ రాజధాని, విశాఖలో పాలనా రాజధాని, అమరావతిలో చట్టసభల రాజధాని ఏర్పాటుపై ఆలోచనలు చేస్తున్నామని మంగళవారం

**మిగతా 10వ పేజీలో...**

### వ్యూహాత్మకంగానే జగన్‌రెడ్డి ప్రకటన

- వైసీపీ నేతల చేతుల్లో ఉత్తరాంధ్ర భూములు
- ఇక పులివెందుల పంచాయితీలే: పవన్

10

### అమరావతినే కొనసాగించాలి

కమిటీ నివేదిక వచ్చేవరకూ ఆగాలి: లెఫ్ట్

## మళ్లీ మళ్లీ మార్చడమా?

### 'రాజధాని'పై ఉద్యోగుల్లో ఆందోళన

- నాడు ఇక్కట్ల మధ్యే అమరావతికి... వెసులుబాట్లు ఇచ్చిన సర్కారు
- కుదురుకుంటున్న కొందరు.. హైదరాబాద్‌లోనే పలు కుటుంబాలు
- వారానికోసారి వెళ్లి వస్తున్న ఉద్యోగులు.. విశాఖకు మార్చితే ఎలా?
- అక్కడికి పోవాల్సిందేనా!.. హైదరాబాద్‌లోని కుటుంబాల మాటేమిటి
- ప్రభుత్వ ఉద్యోగుల ప్రశ్నలు.. నేతలు మౌనం వీడాలని డిమాండ్

11

**అసైన్డ్ 'రిటర్నబుల్ ప్లాట్ల' కేటాయింపులు రద్దు**



## పౌరసత్వ చట్టం అమలుపై స్టే ఇవ్వం

- రాజ్యాంగబద్ధతను పరిశీలిస్తాం
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

11

## జనవరి 17 నుంచి రైతు భరోసా కేంద్రాలు

- రాష్ట్రంలో 11,158 సెంటర్లు
- మూడు విడతలుగా ఏర్పాటు
- అవినీతికి ఆస్కారముండ్దు: సీఎం

## లాటరీపై 28% పన్ను

9

- వచ్చే మార్చి 1 నుంచి అమలు
- తొలిసారిగా ఓటింగ్‌తో జీఎస్టీ మండలి నిర్ణయం








సీఎం జగన్ సమక్షంలో ఒప్పంద పత్రాలతో ప్రభుత్వ, ఎన్ఎండీసీ ప్రతినిధులు

# పోర్టులు చకచకా..!

- నిర్మాణాలకు సత్వర ప్రణాళికలు
- తొలిదశలో మచిలీపట్నం, రామాయపట్నం, భావనపాడు
- కేంద్ర నిధులపైనా దృష్టి
- ట్రాన్స్‌కోకు సొర విద్యుత్
- సమీక్షల్లో సీఎం జగన్ ఆదేశాలు

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పోర్టుల నిర్మాణం, కార్యకలాపాల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ క్రమంలో కీలకమైన దుగరాజపట్నం, రామాయపట్నం, మచిలీపట్నం, నక్కపల్లి, కళింగపట్నం, భావనపాడు పోర్టుల నిర్మాణంపై ప్రణాళికలు రూపొందించాలని సీఎం జగన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తొలిదశలో మచిలీపట్నం, రామాయపట్నం, భావనపాడు పోర్టుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మచిలీపట్నం పోర్టును వీలైనంత వేగంగా కట్టాలన్నారు. ఈ పోర్టుకు ఇప్పటికే భూమి అందుబాటులో ఉందని, మిగిలిన పోర్టులకు కూడా భూసేకరణ చేయాలని అన్నారు. రాష్ట్రంలోని పోర్టుల నిర్మాణంపై సీఎం జగన్ బుధవారం ఉన్నతాధికారులతో

**మిగతా 2వ పేజీలో...**

## ఎన్ఎండీసీతో 'ముడి ఇనుము' ఒప్పందం



- సీఎం జగన్ సమక్షంలో సంతకాలు.. కర్ణాటక, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి సరఫరా
- ప్రైవేటు పెట్టుబడితో కడప ఉక్కు.. ఒప్పందం చరిత్రాత్మకమన్న సీఎం

2

## బండి నారాయణస్వామికి కేంద్ర సాహిత్య పురస్కారం

2

### 'శప్తభూమి' నవలకు అవార్డు



నారాయణస్వామి

- సంస్కృతంలో పెన్నాకు గౌరవం
- ఇద్దరు తెలుగు దిగ్గజాలకు సాహిత్య అకాడమీ పురస్కారాలు
- శశిథరూర్ వ్యాసాలకు అవార్డు



## ఉరిశిక్షే ఖరారు.. అమలు ఆలస్యం

11

- నిర్భయ దోషుల ఉరిపై విచారణ వచ్చేనెల 7వ తేదీకి వాయిదా
- న్యాయం ఇంకెప్పుడు.. నిర్భయ తల్లి రోదన



## పరుగుల సునామీ

- రోహిత్, రాహుల్ శతకాల మోత
- కుల్దీప్ యాదవ్ రికార్డు హ్యాట్రిక్
- విండీస్‌పై భారత్ ఘన విజయం

విశాఖ తీరాన భారత జట్టు పరుగుల సునామీనే సృష్టించింది. చెన్నై వన్డేలో ఓటమికి విండీస్‌పై వెంటనే ప్రతీకారం తీర్చుకుంది. రెండో వన్డేలో రోహిత్ (159), రాహుల్ (102) శతకాలు.. పంత్, శ్రేయాస్ మెరుపులతో భారత్ 5 వికెట్లకు 387 రన్స్ చేసింది. ఛేజింగ్‌లో విండీస్ తేలిపోయింది. కుల్దీప్ హ్యాట్రిక్.. షమి 3 వికెట్లతో చెలరేగడంతో ఆ జట్టు 280 రన్స్‌కే చాపచుట్టేసింది. 107 రన్స్‌తో కోహ్లీసేన గ్రాండ్ విక్టరీ కొట్టింది.

12

## మీ శాంతి వచనాల వల్లే ఇలా..!




చంద్రబాబు సమక్షంలో మాట్లాడుతున్న జేసీ

- జగన్ ఎలాంటివాడో ముందే చెప్పాను
- వైఎస్ లక్షణాలు పది శాతమైనా లేవు
- అప్పుడే జిల్లా పర్యటనకు వస్తారనుకోలేదు
- ఇంకొంత కాలం అబ్జర్వ్ చేయాల్సింది
- అతడు అచ్చం తాత రాజారెడ్డే
- తప్పట్లకు, తాళాలకు లొంగొద్దు..
- మీలో ఇకనైనా మార్పు రావాలి
- చంద్రబాబుకు సూటిగా చెప్పిన జేసీ

అనంతపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సార్.. ఎప్పుడూ శాంతి వచనాలు.. శాంతి వచనాలు.. ఇలా చెప్పి మమ్మల్ని ఇలా చేశారు. తప్పట్లకు తాళాలకు మీరు లొంగొద్దు.. అంటూ చంద్రబాబుకు అనంతపురం మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి సూటిగా చెప్పారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రబాబు అనంతపురంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. 'బాబు గారూ.. మీరు మా జిల్లాకు వచ్చారు. సంతోషం.. మేం పడుతున్న ఈతిబాధలు చూడ్డానికి వచ్చారు. మాకు ఉపశమనంగా నాలుగు మాటలు చెప్పడానికి వచ్చారు.. మాకు ధైర్యం చెప్పడానికి వచ్చారు. ఇంత తొందరగా మీరు జిల్లాలు పర్యటిస్తారని నేననుకోలేదు. నా ఉద్దేశంలో ఇంకొంతకాలం నిశ్శబ్దంగా మీరు అబ్జర్వ్ చేసుంటే బాగుండేది సార్..! జగన్ ఎలాంటి వాడో నేను మీకు మనం అధికారం కోల్పోవడానికి రెండేళ్ల ముందే చెప్పాను. మావాడి సంగతి మీకు తెలీదు.. రాజశేఖర్‌కు నాకున్న సంబంధాలను బట్టి.. చిన్నప్పటి నుంచి చూశాను కాబట్టి చెప్పాను. జగన్‌కు వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలో 10 శాతం మంచి గుణాలు లేవు. ఆయన అచ్చం రాజారెడ్డి గారని చెప్పాను. ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయకముందే డీజీపీ సెల్యూట్ కొట్టడానికి

**మిగతా 11వ పేజీలో...**



పరంజ్యోతి

# ఆరోగ్యం కోసం ఆహారవేదం

*"జైసా భోజన్ ఖాయిమే, తైసేహీ మన్ హోయ్*
*జైసా పానీ పిటియే, తైసేహీ వాణీ హోయ్"*

మనం ఎలాంటి ఆహారం భుజిస్తామో.. అలాంటి మనసే తయారవుతుంది. ఎలాంటి నీటిని తాగుతామో.. అలాంటి మాటలే మాట్లాడుతాం అంటారు కబీరు దాసు. శరీరం మనసు మాట వింటుంది. మనసు శరీరం మాట వింటుంది. ఈ రెండూ మనం తినే ఆహారం మాట వింటాయి. మనం ఏమిటన్నది మనం తినే తిండిమీదే ఆధారపడి ఉంటుంది. సాత్వికాహారం మానసికోల్లాసాన్ని కలిగిస్తుంది. హేతుబద్ధంగా ఆలోచించే శక్తినిస్తుంది. నియమబద్ధంగా తీసుకునే ఆహారం ఔషధంగా పనిచేస్తూ.. మనిషిలో సానుకూల మార్పును తీసుకువస్తుంది. పాలసముద్రం చిలికేప్పుడు అవతరించిన ధన్వంతరి.. ఆయుర్వేదం, ఆరోగ్య శాస్త్రానికి మూల పురుషుడిగా పురాణాలు చెబుతున్నాయి. ఆత్రేయ వంటి పురుషులు, మునులు ధన్వంతరి నుంచి ఆరోగ్య సూత్రాలు విని.. వాటిని నిత్యజీవితంలో ఉపయోగించుకుంటూ అనేక సంవత్సరాలు ఆయురారోగ్యాలతో జీవించగలిగారని 'సుశ్రుత సంహిత'లో విశ్వామిత్రుడి కుమారుడు సుశ్రుతుడు పేర్కొన్నారు. ధన్వతరి చికిత్స విధానాలను సుశ్రుతుడు వ్యాప్తిలోకి తెచ్చి గొప్ప ప్రకృతి వైద్యుడిగా పేరుగాంచాడని.. ప్రకృతిశాస్త్ర వైద్య పరిశోధకులు అంటారు.

తిథులకు అనుగుణంగా నిర్దేశించిన ఆహారం తీసుకునేవారు ఆరోగ్యవంతులుగా జీవిస్తారని 'విష్ణు ధర్మోత్తర పురాణం' చెబుతోంది. 'చరక సంహిత'లో చరకుడు.. 'అష్టాంగహృదయం'లో వాగ్భటాచార్యుడు ఆహార అలవాట్లు, ఆరోగ్యంగా జీవించేందుకు నిత్యకర్మలను గురించి చక్కగా వివరించారు. ఏయే ఆహార పదార్థాలు ఏయే వ్యాధులకు ఔషధాలుగా ఉపయోగపడతాయో పేర్కొన్నారు. వంటింటిని ఔషధాలయంగా వాడుకునేవారు సదా ఆరోగ్యంగానే ఉంటాడంటారు వాగ్భటా చార్యుడు.



శ్రీరామచంద్రుడు తన 14 ఏళ్ల వనవాస కాలంలో కందమూలాలు, ఫలాలు మాత్రమే ఆహారంగా భుజిస్తానంటూ తన తల్లి కౌసల్యకు ప్రమాణపూర్వకంగా చెప్పినట్టు అయోధ్యకాండలో స్పష్టం చేస్తోంది. మహాభారతంలో పాండవులు కూడా సాత్వికాహారం వల్ల విపత్కర పరిస్థితుల్లో కూడా ధైర్యంగా వ్యవహరించారు. కౌరవులు తీసుకున్న రాజస, తామస ఆహారాల కారణంగా వారి వ్యక్తిత్వాలు నిత్యం ప్రతికూల ఆలోచనలతో నిండి వుండేవని.. అసూయ, ద్వేషంతో రగులుతుండేవని చెబుతుంటారు. భాగవతంలోని 17వ అధ్యాయంలో సాత్విక, రాజస, తామస ఆహారబేధాలను కృష్ణుడు స్పష్టంగా వివరించారు. ప్రస్తుతం మనం శుచీశుభ్రత లేని ప్రతికూల ఆహారపు అలవాట్ల కారణంగా ప్రశాంతతను దూరం చేసుకుంటున్నాం. శారీరక, మానసిక వ్యాధులతో సతమతమవుతున్నాం. ఆహార నియమాలను పాటిస్తూ.. సానుకూల దృక్పథంతో జీవించేవారే తమ జీవితకాలాన్ని పెంచుకోగలరని అనుభవజ్ఞులు చెబుతున్నారు.

**- పరికిపండ్ల సారంగపాణి, 9849630290**

## బండి నారాయణస్వామికి
# కేంద్ర సాహిత్య పురస్కారం

- 'శప్తభూమి' నవలకు అవార్డు
- సంస్కృతంలో పెన్నాకు గౌరవం
- ఆంధ్రాలో పుట్టి నాగ్‌పూర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలు
- శశిథరూర్ వ్యాసాలకు అవార్డు



శప్తభూమి నవల

అనంతపురం టౌన్, న్యూఢిల్లీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ తెలుగు రచయిత బండి నారాయణస్వామిని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వరించింది. రాయలసీమ జీవితాలపై రచించిన 'శప్తభూమి' నవల 2019కిగాను ఈ అవార్డుకు ఎంపికైంది. అలాగే, మరో తెలుగు ప్రముఖుడు పెన్నా మధుసూదన్ కావ్యం 'ప్రజ్ఞాచక్షుసం' సంస్కృత విభాగంలో పురస్కారానికి ఎంపికయింది. ఇద్దరు తెలుగువారు ఒకే ఏడాది కేంద్ర సాహిత్య పురస్కారం అందుకోనుండటం విశేషం. కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ సాహిత్యేతర విభాగంలో అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు కేంద్ర సాహిత్య అకాడమీ బుధవారం పేర్కొంది. విజేతలకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 25న ఢిల్లీలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో రూ. లక్ష నగదు, తామ్రపత్రం అందిస్తారు. 1952 జూన్ 3న అనంతపురంలో నారాయణస్వామి జన్మించారు. ఎంఏ తెలుగు చేసిన ఆయన, సింగిల్ టీచర్ స్కూళ్లలోను, ఉన్నత పాఠశాలలో నూ చరిత్ర బోధించారు. 1987 నుంచి రచనలు చేస్తున్నారు. 40 కథలు రచించారు. 'గద్దలాడ తండాయి', 'మీరాజ్యం మీరేలండి', 'రెండుకలల దేశమ్', 'శప్తభూమి' నవలలు రాసారు. రాయలసీమ చరిత్ర నేపథ్యంగా రాసిన నవల శప్తభూమి. రాయల కాలం తర్వాత దాదాపు 18వ శతాబ్దం నాటి అనంతపుర సంస్థానంలో జరిగిన అధికార రాజకీయాలు, అప్పటి సామాజిక జీవితం, సీమనేలలో కక్షలు, కార్పణ్యాలు ఈ నవల లో చిత్రితమయ్యాయి. ఇదే నవలకు 2017 సంవత్సరానికిగాను 'తానా' పురస్కారం లభించింది. కథాకోకిల, అప్పాజోస్యుల విష్ణుభొట్ల, కొలకలూరి, ఎన్టీఆర్ పురస్కారాలు కూడా ఆయన పొందారు. ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి అనంతపురం జిల్లా తరపున కేంద్ర సాహిత్య పురస్కారం తొలిసారి అందుకోగా, బండి నారాయణస్వామి రెండోవారు.

### యోగిపై కావ్యగానం..

సంస్కృత సాహిత్య పరామర్శలో విశేష కృషి చేస్తున్న పెన్నా మధుసూదన్ తెలుగువారే. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో జన్మించారు. శ్రీ వేంకటేశ్వర వేదాంత సంస్కృత కళాశాలలో డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేశారు. రవ్వా శ్రీ హరి, పుల్లెల శ్రీరామచంద్రుడు వద్ద శిష్యరికం చేశారు. అభినవగుప్తుడి గీతాభాష్యంపై ఎంఫిల్, నారాయణతీర్థ యోగాభాష్యంపై పీహెచ్‌డీ చేశారు. మహారాష్ట్రకు చెందిన యోగి సంత్ గులాబ్‌రావు మహారాజ్ జీవితం, తాత్వికతపై పెన్నా 850 సంస్కృత శ్లోకాలతో ప్రజ్ఞాచక్షుసం పేరుతో కావ్యం రాశారు. కేవలం 34 సంవత్సరాలు మాత్రమే జీవించిన ఈ యోగి తత్వశాస్త్రం, ఆయుర్వేదం, భక్తి, సంగీతంపై 134 పుస్తకాలు రచించారు. పెన్నా 2000 సంవత్సరం నుంచి నాగపూర్‌లోని కవికులగురు కాళిదాస్ సంస్కృత వర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. 40 పుస్తకాలు ప్రచురించారు.

### వలస నిశీథిపై శశి చూపు..

కాంగ్రెస్ పార్టీ ఎంపీ శశి థరూర్ రచన 'యాన్ ఎరా ఆఫ్ డార్క్‌నెస్' ఆంగ్ల విభాగంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారానికి ఎంపికైంది. భారతదేశంలో వలసకాలపు అణచివేతను, రాజకీయార్థిక విధానాలను ఈ పుస్తకంలో థరూర్ చర్చించారు. హిందీ కవి నంద్ కిశోర్ ఆచార్య 'చెల్తే హుయే అప్నే కో' సహా 7 భాషలకు చెందిన 7 కవితా సంపుటులకు ఈసారి అవార్డులు లభించాయి. ఇంకా.. నవల, ఆత్మకథ, జీవితచరిత్ర తదితర ప్రక్రియల్లోనూ అవార్డులకు ఎంపికయ్యారు.



# చిన్నపిల్లలాట కాదు

## 3 రాజధానులు హాస్యాస్పదం.. తరలింపు సులువు కాదు

**ఐదుగురు ఉపముఖ్యమంత్రులను పెట్టుకున్నట్లు కాదు: బీజేపీ ఎంపీ సుజనా వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మూడు రాజధానులను ఏర్పాటు చేయడం సాధ్యం కాదని, ఇదేమీ చిన్నపిల్లలాట కాదని కేంద్ర మాజీమంత్రి, బీజేపీ ఎంపీ సుజనాచౌదరి తేల్చిచెప్పారు. రాజధానిని అమరావతి నుంచి తరలించడం అంత సులువు కాదని, కేంద్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకోబోదని స్పష్టంచేశారు. ఆటకాయితనంగా, అవగాహనలేక.. సీఎం జగన్ ఒక రాయి వేశారన్నారు. అసెంబ్లీలో ఆయన ఏం చెప్పారో తనకు అర్థం కాలేదని.. కానీ మూడు రాజధానులనేది హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. ఐదుగురు ఉపముఖ్యమంత్రులను పెట్టుకున్నట్లుగా మూడేసి రాజధానుల ఏర్పాటు సాధ్యం కాదన్నారు. బుధవారం 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' చర్చలో ఢిల్లీ నుంచి ఆయన మాట్లాడారు. అమరావతి నుంచి గ్రోత్ ఇంజన్‌ను తరలించడం.. జగనే కాదు ఆయన తాతగారు వచ్చినా జరగదని తేల్చిచెప్పారు. అమరావతిలో శాసనసభ మాత్రమే ఉంటే దాన్ని రాజధాని అనరని స్పష్టం చేశారు. 'అమరావతి ఇప్పటికే రాజధానిగా ఏర్పడింది. సర్వే ఆఫ్ ఇండియా తన మ్యాప్‌లో రాజధానిగా గుర్తించింది. ఇప్పుడు చిన్నపిల్లలాటలాగా తరలిస్తామంటే కేంద్రం చూస్తూ ఊరుకోదు. అంతవరకు నేను ప్రజలకు భరోసా ఇవ్వగలను. ఇది బీజేపీ ప్రతినిధిగా మాట్లాడడం లేదు' అని తెలిపారు. ఈ గందరగోళానికి సంబంధించి తాను కేంద్రానికి సమాచారమిచ్చానన్నారు. జగన్ ప్రస్తుతం ఊహాజనితంగా చెప్పారని, కానీ అధికారికంగా చేస్తే మాత్రం కేంద్రం తగినరీతిలో స్పందిస్తుందని చెప్పారు.

### కేంద్రం ఇచ్చింది రాజధాని నిర్మాణానికి..

ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన రాజధాని అమరావతి నిర్మాణం కోసమే కేంద్రం రూ.2,500కోట్లు ఇచ్చిందని, కానీ బుర్రాబుద్ధి ఉన్నవాళ్లేవరూ అసెంబ్లీ నిర్మాణానికి అన్ని కోట్లు ఇవ్వరు కదా.. అని సుజనా వ్యాఖ్యానించారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు కేపిటల్ గెయిన్స్ పన్ను నుంచి మినహాయింపు ఇచ్చిందని, వీటికి రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. 'సచివాలయ ఉద్యోగులు అనేక కష్టాలు పడి హైదరాబాద్ నుంచి అమరావతి వచ్చి ఇప్పుడిప్పుడే స్థిరపడుతున్నారు. ఇప్పుడు విశాఖకు వెళ్లాలంటే మరిన్ని కష్టాలు ఎదురవుతాయి. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తే అందుకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించడం ఒక సవాల్' అని చెప్పారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని, కానీ ఇది పద్ధతి కాదన్నారు. వైసీపీ నేతలు ఇంకా ప్రతిపక్షంలోనే ఉన్నట్లు వ్యవహరిస్తున్నారని, రాజకీయ దూషణలు, కక్షసాధింపులకు పాల్పడుతున్నారని దుయ్యబ్టారు. ఇతంతా ప్రజలను ఏడిపించడానికే చేస్తున్నట్లు అనిపిస్తోందన్నారు. జగన్ తీరుతో రాష్ట్రం పదేళ్లు వెనక్కివెళ్లేలా ఉందని, ప్రభుత్వాన్ని నడపడం చేతకావడం లేదని అర్థమవుతోందని చెప్పారు. అధికారులు కూడా గందరగోళంలో పడ్డారని, నిస్సహాయంగా ఉన్నారని తెలిపారు.

### ప్రజాప్రయోజన కోణంలోనే రాజధాని: జీవీఎల్

రాజధాని విషయంలో ప్రాంతాల వారీగా అధ్యయనం చేసి నిర్ణయం తీసుకోవాలని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు సూచించారు. రాజధానిలో ప్రజా ప్రయోజనాల కోణం ఉండాలే కానీ, రాజకీయ కోణం ఉండకూడదన్నారు. అమరావతి కోసం భూములిచ్చిన రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. వారికి న్యాయం చేయాలని కోరారు. సీఎం జగన్ ప్రకటనతో రాజధానిపై కొంత స్పష్టత వచ్చినట్లు కనిపిస్తోందన్నారు. అదే సమయంలో కొన్ని ప్రాంతాలవారికి ఆశలు కలిగిస్తోందన్నారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు గతంలోనే బీజేపీ డిమాండ్ చేసిందని, ఇది అసాధ్యమేమీ కాదన్నారు. మూడు రాజధానులనేది కాస్త కొత్తగా ఉందన్నారు. శివరామకృష్ణ కమిటీ సిఫారసుల్లో కొన్నిటిని జగన్ అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లనిపిస్తోందన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలన్నారు.

## లోకం తీరు




## చలికాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| హైదరాబాద్ | 18.2 | 28.5 |
| కడప | 18.0 | 31.9 |
| కర్నూలు | 19.5 | 32.1 |
| విశాఖపట్నం | 20.6 | 29.8 |
| విజయవాడ | 21.0 | 30.3 |
| చిత్తూరు | 21.4 | 28.9 |
| నెల్లూరు | 23.7 | 29.3 |

### చెదురుమదురు వర్షాలు

విశాఖపట్నం: బంగాళాఖాతం నుంచి తూర్పుగాలులు భూఉపరితలంపైకి వీస్తున్నాయి. దీంతో ఉత్తర కోస్తా నుంచి దక్షిణ కోస్తా వరకు, రాయలసీమలో అనేకచోట్ల మేఘాలు ఆవరించాయి. కోస్తా, రాయలసీమల్లో ఎక్కువచోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. తూర్పుగాలుల ప్రభావం ఉత్తర కోస్తా వరకు విస్తరించడంతో రానున్న ఇరవై నాలుగు గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల చిరుజల్లుల నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా ఒకటి, రెండు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా మేఘాలు ఆవరించడంతో వరి రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది.



### సీఏఏతో అణుయుద్ధం రావచ్చు

భారత్ రూపొందించిన పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) దక్షిణాసియాలో శరణార్థి సంక్షోభం సృష్టించే అవకాశం ఉంది. అంతేకాదు అణ్వాయుధ దేశాలైన పాక్-భారత్ మధ్య అణుయుద్ధానికీ దారి తీయొచ్చు.

**- ఇమ్రాన్‌ఖాన్, పాకిస్థాన్ ప్రధానమంత్రి**



### ఎల్‌వోసీ వెంట పరిస్థితి తీవ్రరూపు దాల్చొచ్చు

సైన్యం సర్వసన్నద్ధంగా ఉండాలి. నియంత్రణ రేఖ వెంట పరిస్థితి ఏ క్షణమైనా తీవ్రరూపు దాల్చొచ్చు. పాకిస్థాన్‌కు చెందిన బార్డర్ యాక్షన్ టీమ్ అదేపనిగా కాల్పులు జరుపుతూ కవ్వింపునకు పాల్పడుతోంది. ఇలా జరిగిన ప్రతిసారీ మనం బలంగా తిప్పికొడుతున్నాం.

**- బిపిన్ రావత్, ఆర్మీ చీఫ్**

### చిన్నారుల రక్త పరీక్షల ఫలితాలు మార్చేసే.. స్థూలకాయం

టొరంటో, డిసెంబరు 18 : చిన్నారుల రక్త పరీక్షల ఫలితాలపై వెంటనే ఓ నిర్ధారణకు రావడం సరికాదని కెనడాలోని టొరంటో వర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. వారు అధ్యయనంలో భాగంగా 1300 మంది ఆరోగ్యవంతులైన చిన్నారులకు 24 రకాల రక్తపరీక్షలు నిర్వహించారు. వారిలో దాదాపు 70 శాతం మందికి చెందిన రక్త పరీక్షల ఫలితాలను స్థూలకాయం సహా ఇతర ఆరోగ్య పరిణామాలు ప్రభావితం చేసినట్లు గుర్తించారు. స్థూలకాయం కలిగిన చిన్నారుల రక్తంలోని లిపిడ్ ప్రోటీన్లు, లిపిడ్‌లు, యూరిక్ యాసిడ్‌లు, కాలేయ ఎంజైమ్‌ల మోతాదుపై వైద్యులు తప్పుడు అంచనాకు వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. చిన్నారుల రక్తపరీక్షల ఫలితాలపై నిర్ధారణకు వచ్చే క్రమంలో ఈ అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

### కృత్రిమ స్వీటెనర్‌లతో మధుమేహం ముప్పు

మెల్‌బోర్న్, డిసెంబరు 18: లో కేలరీ కృత్రిమ చక్కెర(స్వీటెనర్)ను వినియోగించే వారికి చేదు కబురు!! దీన్ని వినియోగించేవారికి టైప్-2 మధుమేహం, అధిక బరువు ముప్పు ఉండొచ్చని దక్షిణ ఆస్ట్రేలియా వర్సిటీ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. అధ్యయనంలో భాగంగా స్వీటెనర్ వాడే 5000 మంది ఆరోగ్య ఫలితాలను కొన్నేళ్ల పాటు సేకరించి విశ్లేషించారు. పలు రకాల స్వీటెనర్ల ప్రభావంతో శరీరంలోని గట్(హానిచేయని) బ్యాక్టీరియా స్వరూప స్వభావాల్లో మార్పులు జరుగుతున్నట్లు గుర్తించారు. ఆ ప్రభావంతో శరీర బరువు పెరుగుతోందని పేర్కొన్నారు. స్వీటెనర్‌కు అలవాటుపడిన వృద్ధులకు జ్ఞాపకశక్తి తగ్గడం, గుండెపోటు వంటి ఆరోగ్య సమస్యలు ఎదురుకావచ్చన్నారు. బేకరీల ఉత్పత్తుల్లోనూ స్వీటెనర్ల వాడకం అధికంగా ఉంటుంది.

### టమోటా కిలో రూపాయి...



పత్తికొండ. డిసెంబరు 18: కర్నూలు జిల్లా పత్తికొండలో టమోటా రైతులు గిట్టుబాటు ధరలేక పంటను మార్కెట్‌లోనే పారబోసి వెళ్లారు. పత్తికొండ మార్కెట్‌యార్డ్‌లో బుధవారం 15కిలోల జతగంపలు రూ.30కి వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్‌కు రవాణా, ఇతర కమీషన్లు పోను చేతికి రూ.7 మాత్రమే అందుతుందని రైతులు వాపోయారు. ఇక పెట్టుబడులు, కూలీల ఖర్చుకు ఎక్కడి నుంచి తేవాలని ప్రశ్నించారు. ఇదే మార్కెట్‌లో రెండునెలల క్రితం వ్యాపారుల మాయజాలాన్ని నిరసిస్తూ రైతులు నిరసన చేపట్టారు. అప్పట్లో సీఎం జగన్ జోక్యం చేసుకుని ధరల స్థిరీకరణ నిధుల ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే మంగళవారం వ్యాపారులు మరోసారి రెచ్చిపోయారు.

# ఎస్సీ వర్గీకరణకు ఓకే

**మద్దతివ్వాలని టీడీపీ నిర్ణయం.. ఎన్నికల్లో ఓటమితో మారిన వైఖరి**

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌కు మద్దతు ఇవ్వాలని టీడీపీ నిర్ణయించింది. ఇటీవలి వరకూ ఈ అంశంలో తటస్థ వైఖరితో ఉన్న ఆ పార్టీ ఎన్నికల్లో పరాజయం తర్వాత వైఖరిని మార్చుకొంది. మారిన వైఖరి తాజాగా ముగిసిన అసెంబ్లీ, మండలి సమావేశాల్లో ప్రస్ఫుటంగా వ్యక్తమైంది. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను విభజించి ఆ రెండు వర్గాలకు విడివిడిగా కమిషన్లు ఏర్పాటు చేసే అంశంపై రెండు బిల్లులు ఈ సమావేశాల్లో చర్చకు వచ్చాయి. తనకు బలాధిక్యం ఉన్న శాసన మండలిలో ఎస్టీ కమిషన్ ఏర్పాటు బిల్లుకు మద్దతు ఇచ్చిన టీడీపీ... ఎస్సీ కమిషన్ బిల్లుకు మాత్రం సవరణలు ప్రతిపాదించింది. రాష్ట్రంలో ఎస్సీలను ఏ,బీ,సీ,డీ గ్రూపులుగా వర్గీకరించే అంశం కూడా ఇందులో చేర్చాలని కోరుతూ ఈ బిల్లుకు సవరణ ప్రతిపాదించింది. దీనికి అధికార పక్షం వైసీపీ ఒప్పుకోలేదు. ఈ సవరణ జోలికి పోకుండా యథాతథంగా బిల్లును ఆమోదించాలని టీడీపీపై గట్టి ఒత్తిడి తెచ్చింది. కానీ టీడీపీ దానికి అంగీకరించలేదు. సవరణ కూడా చేర్చి బిల్లును ఆమోదించింది. దీంతో ఈ బిల్లు మళ్లీ అసెంబ్లీకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### బీసీలకు జగన్ క్షమాపణ చెప్పాలి: లోకేశ్

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలో బీసీలకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదంటూ అసత్య ప్రచారం చేసిన సీఎం జగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ డిమాండ్ చేశారు. 'మీ పత్రికలో రాసేవి అసత్యాలే అని అసెంబ్లీ సాక్షిగా అంగీకరించినందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు. అలాగే జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు బీసీలకు అన్యాయం చేస్తున్నారని, ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆరోపించారు. బీసీలకు స్వయం ఉపాధి కల్పిస్తూ ఏర్పాటు చేసిన ఆదరణ పథకంలో అవినీతి, నాణ్యతలేని వస్తువులు ఇస్తున్నారని ప్రచారం చేశారు. నాడు చేసిన తప్పుడు ప్రచారానికి కూడా బహిరంగ క్షమాపణ చెప్తే బాగుంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో బీసీల కోసం రూ.3వేల కోట్లు కేటాయించిన వైఎస్ఆర్ గొప్పవారో... 13 జిల్లాలున్న ఏపీలో రూ.28.8వేల కోట్లు ఖర్చు చేసిన చంద్రబాబు గొప్ప వ్యక్తో అర్థం చేసుకోవాలని నా మనవి' అని లోకేశ్ పేర్కొన్నారు. కాగా, ప్రభుత్వం అమలు చేయనున్న 10 సంక్షేమ పథకాల అమలుకు లబ్ధిదారులను గుర్తించకుండా ఉన్న లబ్ధిదారులను అనర్హులుగా నమోదుచేస్తున్నారని మాజీ మంత్రి జవహర్ వి మర్శించారు.

### జీవో 2430 ఉపసంహరించుకోవాలి: పీసీఐ

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు విధిస్తూ జగన్ ప్రభుత్వం జారీచేసిన జీవో 2430 వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పీసీఐ) ఛైర్మన్ జస్టిస్ సీకే ప్రసాద్ సూచించారు. ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్(ప్రయాగ్‌రాజ్)లో పీసీఐ బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం జారీ చేసిన జీవో వెనుక జర్నలిస్టులను బెదిరించే ఉద్దేశం కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. ఏపీలో ఆంధ్రజ్యోతి రిపోర్టర్ సత్యనారాయణ హత్య కేసులో పోలీసుల వైఫల్యం ఉందని ఆయన అన్నారు. కాగా.. పీసీఐ సూచనల పట్ల హర్షం ఏపీడబ్ల్యూజే హర్షం వ్యక్తం చేసింది.



సీఎం రక్షణకు ఆక్టోపస్

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ రక్షణ కోసం పోలీసుశాఖ ఆక్టోపస్‌ను నియమించింది. సీఎం హోదాలో ప్రస్తుతం ఆయనకు ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ రక్షణ కల్పిస్తోంది. అయితే సీఎం భద్రతపై సమీక్షించిన పోలీసు ఉన్నతాధికారులు కౌంటర్ టెర్రరిజమ్ ఆపరేషన్లలో సమర్థులైన 8 నుంచి 12 మంది ఆక్టోపస్ గార్డులను నియమించి, సీఎం చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

# పోర్టులు చకచకా

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షించారు. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులకు వచ్చే జూన్ నాటికి ఫైనాన్షియల్ క్లోజర్ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. మే, జూన్ నాటికి రెండు పోర్టులకూ శంకుస్థాపన చేయాలని నిర్ణయించారు. విభజన చట్టం ప్రకారం ఒక పోర్టును కేంద్రం నిర్మించి ఇస్తానని చెప్పిందని, ఆ మేరకు కేంద్రం నుంచి నిధులు తెచ్చుకునేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు.

### సర్కారు ప్రాధాన్యాలు ఇవే!

సమీక్షా సమావేశంలో సీఎం జగన్ ప్రభుత్వ ప్రాధాన్యాలను అధికారులకు వివరించారు. నవరత్నాలు, నాడు-నేడు కార్యక్రమాలకు తొలి ప్రాధాన్యత, ఏటా 6 లక్షల ఇళ్ల నిర్మాణం రెండో ప్రాధాన్యతగా, రాయలసీమ ప్రాజెక్టులకు జలాలు వెళ్తున్న కాల్వల విస్తరణ మూడో ప్రాధాన్యతని, పోలవరం ఎడమ కాల్వ ద్వారా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి బానకచర్లకు గోదావరి జలాలు, ప్రతి జిల్లాకు తాగునీటిని అందించేందుకు వాటర్‌గ్రిడ్‌లు తదుపరి ప్రాధాన్యతలని వివరించారు.

### సబ్సిడీ బదులు.. సౌర విద్యుత్

విద్యుత్ సంస్కరణల అంశంపై సీఎం జగన్ మాట్లాడుతూ, "ఏటా విద్యుత్ సబ్సిడీల రూపంలో సుమారు రూ.10 వేల కోట్లు ట్రాన్స్‌కోకు చెల్లిస్తున్నాం. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వమే 12 వేల మెగావాట్ల సౌర విద్యుత్‌ను ట్రాన్స్‌కోకు ఇస్తే సరిపోతుంది. సుమారు రూ.35-37 వేల కోట్ల ఖర్చుతో 12 వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. అంటే మూడు, నాలుగేళ్లలో 12 వేల మెగావాట్లు అందుబాటులోకి వస్తాయి" అన్నారు.

## ఎన్ఎండీసీతో 'ముడి ఇనుము' ఒప్పందం

**సీఎం జగన్ సమక్షంలో సంతకాలు**

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కడప ఉక్కు కర్మాగారానికి ఇనుప ఖనిజాన్ని సరఫరా చేసేందుకు ఒప్పందం కుదిరింది. రాష్ట్ర ప్రభుత్వం-జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ(ఎన్ఎండీసీ)ల మధ్య బుధవారం ఈ మేరకు ఒప్పందం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏపీ హైగ్రేడ్ స్టీల్ లిమిటెడ్ సీఎండీ పి.మధుసూదన్, ఎన్ఎండీసీ తరపున డైరక్టర్ అలోక్ కుమార్‌లు సీఎం జగన్ సమక్షంలో ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం చారిత్రాత్మకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కడప ఉక్కు కర్మాగారానికి అవసరమైన ఇనుప ఖనిజాన్ని కర్ణాటక, చత్తీస్‌గడ్‌లో ఎక్కడ నుంచైనా సరఫరా చేసేలా ఒప్పదంలో పేర్కొన్నారు. వాస్తవానికి కర్ణాటక నుంచి ఇనుప ఖనిజం సరఫరా చేస్తే రవాణా ఖర్చు తగ్గుతుంది. కడప నుంచి బళ్లారికి తక్కువ దూరం కాబట్టి ఆ మేరకు ఖర్చు ఆదా అవుతుంది. బళ్లారి నుంచే సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కూడా అడిగినట్లు సమాచారం. అయితే, ఎన్ఎండీసీ మాత్రం బళ్లారి నుంచే అన్న షరతు లేకుండా.. కర్ణాటక, లేకుంటే చత్తీస్‌గడ్ నుంచి సరఫరా చేస్తామని పేర్కొంది. ఒప్పందంలో అదే అంశాన్ని పేర్కొన్నారు. మరోవైపు కడప ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు పెట్టుబడితో నిర్మించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. చైనా లేకుంటే ఇతర దేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోందని తెలిసింది. మరీ అవసరమైతే ప్రభుత్వమే పెట్టేందుకు కూడా రూ.250 కోట్లను బడ్జెట్‌లో చూపించారని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. ఏటా మూడు మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేసే సామర్థ్యంతో కడప స్టీల్‌ప్లాంట్‌ను పెట్టాలని నిర్ణయించారు.

### ఇళ్ల స్థలాలకు 1300 కోట్లు

నవరత్నాల్లో భాగంగా 'పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమం అమలు కోసం రూ.1300 కోట్ల విడుదలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాకు సగటున రూ.100 కోట్ల చొప్పున నిధులు విడుదల కానున్నాయి. వచ్చే ఉగాది నాటికే ఇళ్లస్థలాలను సిద్ధం చేయనున్నారు.

# ఎస్పీలకు 'దిశా' నిర్దేశం

- మహిళలపై కేసులు సీరియస్‌గా తీసుకోండి
- సమీక్షలో జిల్లాల ఎస్పీలకు డీజీపీ సవాంగ్ ఆదేశం



అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): 'మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారు ఎట్టి పరిస్థితుల్లో తప్పించుకోరాదు. కొత్త చట్టం 'దిశ'ను ప్రయోగించి వారిని జైలుకు పంపండి' అని డీజీపీ గౌతమ్ సవాంగ్ జిల్లాల ఎస్పీలకు సూచించారు. శాంతి భద్రతల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది జరిగిన నేరాలు, బాధ్యులకు పడిన శిక్షలు, బాధితులకు జరిగిన న్యాయం, పోలీసులకు ఎదురైన సవాళ్లు తదితర అంశాలపై విజయవాడ, విశాఖపట్నం పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో బుధవారం ఆయన సమీక్షించారు. గడిచిన 5 నెలల్లో జరిగిన నేరాలపై చర్చించారు. రాయలసీమ, పల్నాడు ప్రాంతంలో ఎన్నికల తర్వాత గొడవల్ని అదుపు చేసిన వైనం, ఉత్తరాంధ్ర జిల్లాల్లో మావోయిస్టులను కట్టడి చేసిన తీరు, గంజాయి అక్రమ రవాణా, క్రికెట్ బెట్టింగ్‌లపై తీసుకున్న చర్యలు, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకొంటున్న విధానం ఇలా జిల్లాల వారీగా కేసుల తీరుని ఎస్పీలు ఆయనకు వివరించారు. అనంతరం డీజీపీ సవాంగ్ మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రభుత్వం 'దిశ' పేరుతో కొత్త చట్టం తీసుకొచ్చిందని, 354(ఇ), (ఎఫ్), (జీ) సెక్షన్లను వాడుకుని మహిళలకు మరింత రక్షణ కల్పించాలని సూచించారు. సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల్లో శిక్షల శాతం పెరగాల్సి ఉందని, సీరియస్‌గా తీసుకోవాలని ఆదేశించారు. డయల్ 100, 112 ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జీరో ఎఫ్ఐఆర్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ కాదనడానికి వీల్లేదని చెప్పారు.

## బాలికపై అత్యాచారం

ఎమ్మిగనూరు, గుంటూరు, డిసెంబరు 18: ఇంటి ముందు కూర్చుని ఉన్న 11 ఏళ్ల బాలికను నిర్జన ప్రాంతానికి లాక్కెళ్లిన ఓ కామాంధుడు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో మంగళవారం ఈ దారుణం చోటుచేసుకుంది. సీఐ శ్రీధర్ వివరాల మేరకు.. మంగళవారం రాత్రి బాలిక ఇంటి వైపు వచ్చిన పక్కీరప్ప అనే వ్యక్తి.. ఆమె నోరు మూసి సమీపంలోని నిర్జన ప్రాంతానికి లాక్కెళ్లాడు. అక్కడ ఆమెపై అత్యాచారం చేశాడు. బాలిక కేకలు విన్న కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లగా పక్కీరప్ప పారిపోయాడు. బాలిక బంధువుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని బుధవారం అరెస్టు చేశారు.

### బాలికపై వృద్ధుడి లైంగిక దాడి!

ఇంటిముందు ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలికపై వృద్ధుడు లైంగిక దాడికి ప్రయత్నించిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. నగరంలోని లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి బాలిక రోడ్డుపై ఆడుకుంటుండగా పక్కింటికి చెందిన ఆలపాటి సాంబశివరావు (82) ఆమెపై లైంగిక దాడికి ప్రయత్నించాడు. ఇది గమనించిన ఎదురింటి వారు బాలిక తల్లిదండ్రులకు చెప్పారు. వారు స్థానికులతో కలిసి వృద్ధుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. సాంబశివరావుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.





## ఎరుపెక్కిన ఇంద్రకీలాద్రి

### భవానీ దీక్షల విరమణ ప్రారంభం

విజయవాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బెజవాడ కనకదుర్గమ్మ దేవస్థానంలో భవానీ దీక్షల విరమణ ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 22వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ప్రతీఏటా ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల తర్వాత ఆ తరహాలో నిర్వహించే వేడుక భవానీ దీక్షల విరమణ ఉత్సవాలే. అమ్మవారిపై అచంచలమైన భక్తి విశ్వాసాలతో భవానీ మాలను ధరించిన భక్తులు దీక్షను విరమించేందుకు లక్షలాదిగా ఇంద్రకీలాద్రికి తరలివస్తారు. ఈ ఏడాది ఏడు లక్షల మందికిపైగా భవానీ భక్తులు దీక్ష విరమణ కోసం తరలివస్తారని అధికారులు అంచనా వేశారు. ఆ మేరకు కొండపై, దిగున పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. కఠోరమైన నియమ నిబంధనలతో మండల, అర్ధమండల దీక్షలను పూర్తి చేసి జగన్మాత కనకదుర్గమ్మ సన్నిధిలో దీక్షను విరమించేందుకు తొలిరోజు బుధవారం అధికసంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున ఇంద్రకీలాద్రి చుట్టూ గిరి ప్రదక్షణ చేసిన అనంతరం అమ్మవారిని దర్శనం చేసుకుని ఇరుముడులు సమర్పించి దీక్షను విరమించారు. గురువారం నుంచి దీక్ష విరమణకు వచ్చే భవానీ భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతుందని దేవస్థానం అధికారులు భావిస్తున్నారు.



## పింఛన్లు తొలగిస్తే ఆమరణ దీక్ష

- కుష్ఠురోగుల హెచ్చరిక
- ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా

రైల్వేకోడూరు, డిసెంబరు, 18: పింఛన్లు తొలగిస్తామని వలంటీర్లు చెప్పడంతో కడప జిల్లా రైల్వేకోడూరు మండలం జ్యోతికాలనీకి చెందిన కుష్ఠువ్యాధిగ్రస్తులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి పుణ్యాన తమకు పింఛన్లు వచ్చాయని, ఆయన కుమారుడు, ప్రస్తుత సీఎం జగన్ పుణ్యాన ఉన్న పింఛన్లు ఊడుతున్నాయన్నారు. పింఛన్లు తొలగిస్తే అమరావతిలో ఆమరణ దీక్ష చేస్తామని హెచ్చరించారు.


**RITES THE INFRASTRUCTURE PEOPLE**

**రైట్స్ లిమిటెడ్**

రీజనల్ ప్రాజెక్ట్ కార్యాలయం (సౌత్) సికింద్రాబాద్

CIN No. :L74899DL1974GOI007227

**ఇ-టెండర్లు కోరుతూ ప్రకటన**

క్లయింట్ ద.మ. రైల్వే తరపున, జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్), RPO-సికింద్రాబాద్, రైట్స్ లిమిటెడ్ వారు దిగువ పని కొరకు సింగిల్ ప్యాకెట్ విధానంలో ఆన్‌లైన్ పర్సంటేజ్ రేట్ బిడ్లు కోరుతున్నారు: NIT No. RITES/SC/GY-DMM/MFBW/2019-20 తేది 18.12.2019 పని పేరు: **దక్షిణ మధ్య రైల్వేలో గుత్తి-ధర్మవరం (డబ్లింగ్) ప్రాజెక్ట్‌లో వెల్డెడ్ జాయింట్ల USFD పరీక్షించుటతో కలిపి రైల్ కమ్ రోడ్ మొబైల్ ఫ్లాష్ బట్ మొబైల్ వెల్డింగ్ ప్లాంట్ ఉపయోగిస్తూ సైట్ వద్ద 60 Kg/52 Kg రైల్స్ (90 UTS/72 UTS) ఫ్లాష్ బట్ వెల్డింగ్.** అంచనావ్యయం: **రూ.96,60,800.00,** బయానా: **రూ.96,610/-,** పూర్తి చేయాల్సిన కాలం: **09 నెలలు,** బిడ్ దాఖలుకు ఆఖరి తేది మరియు సమయం: **27.12.2019 న 14.30 గం.కు.**

బిడ్ ఫారాలు మరియు ఇతర వివరాలు వెబ్‌సైట్ https://etenders.gov.in/eprocure/app నుండి పొందవచ్చును.

ఏదేని సవరణ/అనుబంధం ఆన్‌లైన్‌లో మాత్రమే తెలియజేయబడుతుంది.







## తిరుమలలో శారదా పీఠాధిపతి



తిరుమల, డిసెంబరు 18: విశాఖ శ్రీ శారదాపీఠం అధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి బుధవారం రాత్రి తిరుమల చేరుకున్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ప్రత్యేక ఆహ్వానితుడు శేఖర్‌రెడ్డి తదితరులు స్వామీజీలను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. స్వామీజీలు ఈ నెల 21 వరకు తిరుమలలోనే బస చేసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

## 'సురుచి'కి ఐఎస్‌వో గుర్తింపు



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న మల్లిబాబు

మండపేట, డిసెంబరు 18: తూర్పు గోదావరి జిల్లా మండపేట మండలం తాపేశ్వరంలోని 'సురుచి' స్వీట్స్ సంస్థ పాటిస్తున్న ఆహార భద్రత ప్రమాణాలను ఐఎస్‌వో పరిశీలించి 22000-2018 ధ్రువీకరణ పత్రాన్ని అందించింది. ఐఎస్‌వో సంస్థ ప్రతినిధి శివయ్య నుంచి బుధవారం సర్టిఫికెట్‌ను అందుకున్నట్టు సురుచి యజమాని మల్లిబాబు తెలిపారు.

### బాధిత కుటుంబానికి

# బెదిరింపులా?

- అధికారులు చర్యలు తీసుకోవాలి: వర్ల



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వర్ల

త్రిపురాంతకం, డిసెంబరు 18: 'మావాడికి శిక్షపడితే మీ కుటుంబం మొత్తాన్ని చంపేస్తాం' అని నిందితుడి కుటుంబసభ్యుల నుంచి బెదిరింపులు వస్తున్నాయని అత్యాచార బాధిత బాలిక తల్లిదండ్రులు టీడీపీ బృందం ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలంలో అత్యాచారానికి గురైన మానసిక వికలాంగురాలి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య గురువారం పరామర్శించారు. అక్కడినుంచే కలెక్టర్ పోలా భాస్కర్‌తో మాట్లాడి బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రభుత్వం ద్వారా అదనంగా సహాయం అందించాలని కోరారు. వైపాలెం సీఐ కె.మారుతీకృష్ణతో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం వర్ల మీడియాతో మాట్లాడుతూ జగన్ సీఎం అయిన తర్వాత రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. దిశ చట్టం అమల్లోకి వచ్చినరోజు నుంచే అఘాయిత్యాలు ఎక్కువయ్యాయన్నారు. ఊరికే చట్టం చేస్తే సరిపోదని, దాన్ని సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేరులోనే రెండక్షరాలు ఉన్నాయని మాకేం కాదని నిందితులు బహిరంగంగానే అంటున్నారని వర్ల ఆందోళన వ్యక్తం చేశారు.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

**రహదారులు & భవనాల శాఖ**

**ఇ-ప్రొక్యూర్‌మెంట టెండరు ప్రకటన**

ఇంజినీర్-ఇన్-చీఫ్ (R&B), NABARD & LWE/26/2019-20, తేది: 16.12.2019 ప్రకారం గుంటూరు జిల్లాలో నాబార్డ్ పథకం క్రింద రూ.325.98 లక్షల వ్యయంగల ఒక పనికి ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదార్లు టెండరు షెడ్యూళ్లను ఇ-మార్కెట్‌ప్లేస్ అనగా www.apeprocurement.gov.in నుండి 20.12.2019న సా. 4.00 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. మొదటి పిలుపు టెండరకు టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది: 04.01.2020న సా. 4.00 గం.వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ అనగా www.tender.apeprocurement.gov.in లో చూడవచ్చును.

సం/- ఇంజినీర్-ఇన్-చీఫ్ (R&B) నాబార్డ్ & LWE

DIPR RO No.1342/CL/ADVT/1/1/2019-20, తేది:18.12.2019


## ముగ్గురు రైతుల ఆత్మహత్య



నర్సిరెడ్డి (ఫైల్)

ఉరవకొండ/కూడేరు/కోగంటివారిపాలెం (అచ్చంపేట), డిసెంబరు 18: అప్పులబాధ తాళలేక రాష్ట్రంలో ముగ్గురు రైతులు మృతిచెందారు. అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం కౌకుంట్ల గ్రామానికి చెందిన మల్లికార్జున(48) తనకున్న 4 ఎకరాలతో పాటు మరో 9 ఎకరాలను కౌలుకు తీసుకొని వేరుశనగ, ఉలవ పంటలు సాగుచేశాడు. సాగు కోసం దాదాపు రూ.10 లక్షలు అప్పుచేశాడు. అప్పు తీర్చే మార్గంలేక మనస్తాపంతో మంగళవారం రాత్రి పొలంలోనే పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్న మల్లికార్జునను కుటుంబసభ్యులు ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కూడేరు మండలం ముద్దలాపురం గ్రామానికి చెందిన దొమ్మర చిన్న ఓబుళపతి(68) సాగు కోసం అప్పులుచేశాడు. తాను అనారోగ్యానికి గురి కావడం, భార్య లక్ష్మీదేవి కిడ్నీ వ్యాధితో బాధపడుతుండడంతో చికిత్సల కోసం చేసిన అప్పుతో కలిపి దాదాపు రూ.7 లక్షలు కావడంతో మానసిక వేదనతో ఈ నెల 12వ తేదీ ఇంట్లోనే పురుగులమందు సేవించడంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. గుంటూరు జిల్లా అచ్చంపేట మండలం కోగంటివారిపాలెం గ్రామానికి చెందిన కొమ్మారెడ్డి నర్సిరెడ్డి తన నాలుగెకరాల పొలంతో పాటు మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవాడు. వరుస నష్టాలతో దాదాపు రూ.11లక్షలు అప్పుచేశాడు. అప్పుతీర్చే మార్గంలేక బుధవారం ఇంట్లోనే నర్సిరెడ్డి పురుగుమందు తాగి మృతిచెందాడు.


**తిరుమల తిరుపతి దేవస్థానములు : తిరుపతి**

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన :: మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్**

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా దిగువ నిత్యావసరాల సేకరణకు ఇ-టెండర్లు కోరబడుచున్నవి.

| క్ర. సం. | ఐటం పేరు | పరిమాణం | బయానా రూ.ల లో | డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది & ముగింపు తేదీలు |
|---|---|---|---|---|
| 1. | అగ్‌మార్క్‌తో గ్రేడ్ 1 నువ్వుల నూనె | 2000 టిన్నులు | 1,31,000/- | 18-12-2019 నుండి 02-01-2020 వరకు |
| 2. | డైమండ్ షేప్ స్పెషల్ గ్రేడ్ "C" పటిక బెల్లం | 1,10,000 కేజీలు | 1,22,000/- | 20-12-2019 నుండి 27-12-2019 వరకు |
| 3. | కర్పూరం గడ్డలు (½ Kg గడ్డలు) | 750 కేజీలు | 18,000/- | 20-12-2019 నుండి 04-01-2020 వరకు |

టెండరు ప్రకటన మరియు టెండరు వివరాల కొరకు వెబ్‌సైట్ http://www.tirumala.org మరియు https://tender.eprocurement.gov.in కు లాగిన్ అవ్వండి. "తిరుమల తిరుపతి దేవస్థానములు-మార్కెటింగ్" ఎంపికొని మరియు "షో" ఎంపికొని మరియు టెండర్స్ AP పై క్లిక్ చేయండి. తదుపరి వివరాలకు సంప్రదించండి: ఫోన్ నం.లు: 0877-2264079, 2264555, ఫ్యాక్స్ నం. 0877-2264554, ఇ మెయిల్: gmpttd@gmail.com.

ROC No. PR4/13913/Adv No.354/PRO/2019, Dt: 18-12-2019 సం/- కార్యనిర్వహణాధికారి







## లాం ఏరువాక కేంద్రానికి ఉత్తమ అవార్డు

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతుల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించిన గుంటూరు(లాం) ఏరువాక కేంద్రానికి 2018-19 సంవత్సరానికి ఉత్తమ అవార్డు లభించింది. సాగు ఖర్చులు తగ్గిస్తూ, నాణ్యమైన ఉత్పత్తిని సాధించేలా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినందుకు 13 ఏరువాక కేంద్రాల్లో లాం ఏరువాక కేంద్రాన్ని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ అవార్డుకు ఎంపిక చేసింది. విశ్వవిద్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఎంపీ బాలశౌరి, వీసీ డాక్టర్ దామోదరనాయుడు నుంచి అవార్డును లాంఫాం ఏడీఆర్ సత్యనారాయణరావు, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ పున్నారావు అందుకున్నారు.

## పోలవరంలో పీపీఏ బృందం

పోలవరం, డిసెంబరు 18: పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పీపీఏ) బృందం బుధవారం ప్రాజెక్టును సందర్శించింది. మంగళవారం రాత్రే పోలవరం ప్రాజెక్టుకు చేరుకున్న బృందం... బుధవారం ఉదయం నుంచి ప్రాజెక్టులో స్పిల్ వే, ఎగువ కాఫర్ డ్యాం, ఈసీఆర్ఎఫ్ డ్యాం, కుడి కాలువకు వెళ్లే జంట గుహలను పరిశీలించింది. అనంతరం పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో అధికారులను సంబంధిత వివరాలు అడిగి తెలుసుకుంది.

## ప్రజారోగ్యం మెరుగు బాధ్యత ప్రభుత్వానిదే: హైకోర్టు

అమరావతి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం మెరుగుపరిచే బాధ్యత ప్రభుత్వానిదేనని, అందుకోసం ప్రభుత్వం తీసుకునే చర్యలను తప్పుబట్టలేమని హైకోర్టు స్పష్టం చేసింది. మద్యపానాన్ని ప్రజలకు దూరం చేయడం ప్రజారోగ్య మెరుగు చర్య కిందకే వస్తుందని పేర్కొంది. రిటైల్ షాపులకన్నా బార్లలో మద్యం ధరలు పెంచుతూ గత నెల 22న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 471ను సవాల్ చేస్తూ 350 మందికి పైగా బార్ల యజమానులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. వేర్వేరుగా దాఖలైన ఈ పిటిషన్లను విచారించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి.. బుధవారం తీర్పు వెలువరించారు. మద్యం ధరల్లో రిటైల్ షాపులు, బార్ల మధ్య ప్రభుత్వం చూపిన వ్యత్యాసం అసమంజసం కాదని పేర్కొంటూ ఆ పిటిషన్లను కొట్టివేశారు.




# నియంతకు దండన

పాకిస్థాన్ మాజీ సైనిక పాలకుడు ముషార్రఫ్‌కు పౌర న్యాయస్థానం ఉరిశిక్ష విధించడం అనేక కారణాల రీత్యా విశేషమైనది. పాకిస్థాన్ అత్యధిక కాలం సైనిక పాలనలోనే కొనసాగి, ఇప్పటికీ సైన్యమే చక్రం తిప్పుతున్న స్థితిలో ఈ తీర్పు సైన్యానికి ఆగ్రహం కలిగించడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఒక మాజీ సైనికాధికారికి, అందునా ముషార్రఫ్‌కు పౌరన్యాయస్థానం శిక్ష వేసినందుకు సైన్యం తాడెత్తున మండిపడుతూ, ఆయన దేశద్రోహి కానేకాదు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ముషార్రఫ్‌ను కాపాడుకొచ్చేందుకు చివరివరకూ ప్రయత్నించి విఫలమైన ఇమ్రాన్‌ఖాన్ ప్రభుత్వంపై సైన్యం ఒత్తిడి ఏ స్థాయిలో ఉన్నదో అర్థమవుతూనే ఉన్నది. అత్యవసరంగా మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఆరునూరైనా ముషార్రఫ్‌ను రక్షించుకుంటానని ఇమ్రాన్ శపథం చేశారు.

పాకిస్థాన్ న్యాయవ్యవస్థ తీరు విచిత్రంగా ఉంటుంది. కొన్ని సార్లు అది తన అస్తిత్వ నిరూపణకు విపరీతమైన దూకుడు ప్రదర్శిస్తుంది. చాలా సందర్భాల్లో ఘర్షణకు దూరంగా ఉంటూ, అప్పుడప్పుడు అధికార మార్పిడుల్లో మధ్యవర్తి పాత్ర కూడా పోషిస్తుంటుంది. పౌరప్రభుత్వం, న్యాయవ్యవస్థ, మిలటరీలు అవకాశం వచ్చినప్పుడల్లా తమ ఆధిక్యతను ప్రదర్శించేందుకు ప్రయత్నించే పాకిస్థాన్‌లో ఈ తీర్పు ప్రధానంగా సైన్యంపై ఏ మేరకు ప్రభావం చూపుతుందో చూడాలి. రాజకీయాల్లో మిలటరీ జోక్యం కూడదనీ, సైనిక కుట్రలద్వారా అధికారాన్ని అందుకొనే రోజులు పోయాయని ఈ తీర్పు హెచ్చరిస్తున్నదని కొందరి అభిప్రాయం. ప్రత్యక్షంగా అధికారంలో లేకున్నా, అస్మదీయ ఇమ్రాన్‌ఖాన్‌కు అధికారాన్ని అప్పచెప్పడంలో పాక్ మిలటరీ సహకారం తెలియనిదేమీ కాదు. ఒక ప్రజాప్రభుత్వాన్ని సైనికకుట్రతో కూల్చి దాదాపు పదేళ్ళు దేశాన్ని ఏలిన నియంతకు ఇప్పటి ప్రభుత్వం వత్తాసు పలుకుతున్న తీరు గమనించిన తరువాత ఈ తీర్పు అక్కడి వాతావరణాన్ని సమూలంగా మార్చేస్తుందన్న భ్రమలేమీ అక్కరలేదు.

పాకిస్థాన్ రాజ్యాంగాన్ని చుట్టచుట్టి చెత్తబుట్టలో పారేయవలసిన ఓ చిత్తుకాగితంతో పోల్చిన ముషార్రఫ్‌కు అధికార వాంఛ తప్ప, వ్యవస్థల మీద కించిత్తు గౌరవం లేదు. ఆయన పాలన తదనుగుణంగానే సాగింది. ప్రజలు ఎన్నుకున్న ప్రధాని విదేశీ పర్యటనలో ఉండగా, సైనిక కుట్రతో పదవిచేపట్టిన ఆయన, తాను తిరిగి అధికారంలోకి వచ్చేందుకు అడ్డుపడుతున్న న్యాయవ్యవస్థమీదా విరుచుకుపడ్డారు. పాతరాజ్యాంగాన్ని రద్దుచేసి, కొత్తదాన్ని తయారుచేసి, అత్యయిక స్థితిద్వారా న్యాయమూర్తులను దారికి తెచ్చుకొనే ప్రయత్నం చేశారు. కొత్తరాజ్యాంగం చెల్లదన్న తీర్పుతో ఆయనకు ఎదురుతిరిగిన అప్పటి ప్రధాన న్యాయమూర్తి ఇఫ్తికార్ చౌదరి సహా పదిమంది న్యాయమూర్తులు గృహనిర్బంధంలోకి పోయారు. బెనజీర్ హత్య సహా పలుకారణాలతో ఎన్నికలు వాయిదా పడటం, ఇంతలోగా ముషార్రఫ్ వివిధ ఒత్తిళ్ళ కారణంగా సైనిక దళాల చీఫ్‌గా తప్పుకొని దేశాధ్యక్ష పదవిని మాత్రమే ఉంచుకోవడం తెలిసిందే. విదేశాల్లో తలదాచుకున్న నవాజ్ షరీఫ్ రాక ఎన్నికల్లో ముషార్రఫ్ ఓటమికి దారితీసింది. రాజ్యాంగాన్ని రద్దుచేసిన ఈ నిర్ణయాన్నే షరీఫ్ ప్రభుత్వం ముషార్రఫ్ మీద ఉచ్చుబిగించేందుకు వాడుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటుతో కొనసాగిన ఈ కేసు నుంచి తప్పించుకోవడానికి ముషార్రఫ్ ఎంతో ప్రయత్నించి భంగపడ్డారు. చివరకు వైద్యచికిత్స పేరిట విదేశాలకు పారిపోయి, తిరిగిరాని ముషార్రఫ్ వాదనతో నిమిత్తం లేకుండానే తీర్పు వెలువరించాల్సిందిగా ట్రిబ్యునల్‌ను సుప్రీంకోర్టు ఆదేశించవలసి వచ్చింది. ఇమ్రాన్ ప్రభుత్వం ముషార్రఫ్‌ను ఎంత కాపాడుకొచ్చినా, సుప్రీంకోర్టు దీనిని జీవిత ఖైదుగా మాత్రమే మార్చవచ్చునని కొందరి నమ్మకం. సుప్రీంకోర్టు ఏ శిక్ష వేసినా, దుబాయ్‌లో తలదాచుకుంటున్న ముషార్రఫ్‌ను ఆ దేశాధినేతలు పాకిస్థాన్‌కు అప్పగించరన్నది వాస్తవం. రెండు దశాబ్దాల అధికార పోరులో నవాజ్‌షరీఫ్, ముషార్రఫ్‌లు ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకుంటూ, అవసరమైనప్పుడు అవగాహనలు, దేశం వదిలిపోయే అవకాశాలు పరస్పరం ఇచ్చుకుంటూ వచ్చారు. ఇప్పుడు అవినీతి కేసులో జైలుశిక్ష అనుభవిస్తూ, అనారోగ్యం వల్ల నెల క్రితం బెయిల్‌మీద బయటకువచ్చి లండన్‌లో చికిత్స పొందుతున్న నవాజ్ షరీఫ్ ఎట్టకేలకు తన పాతకక్ష తీరినందుకూ, చివరకు తనదే పైచేయి అయినందుకు ఎంతో సంతోషించి ఉంటారు.

# ఆ ప్రభంజనం పేరేమిటి?


యోగేంద్ర యాదవ్

యువ భారతీయులు ఆగ్రహ భార్గవులవుతున్నారు. యువజన రాజకీయాలలో ఒక నూతన పరిణామాన్ని మనం చూస్తున్నాము. గత వారం రోజులుగాను, ఆ మాటకొస్తే గత కొద్ది నెలలుగా చోటు చేసుకొంటున్న వివిధ సంఘటనలు ఈ విషయాన్నే సూచిస్తున్నాయి. మరీ ముఖ్యమైన విషయమేమిటంటే ఆ కొత్త పవనం మన జాతీయ రాజకీయాలనే మార్చివేయగల స్థాయిలో ప్రచండంగా వీస్తోంది. ఇందుకు అవసరమైన ప్రభావశీలత ఆ యువజన ఉద్యమంలో ప్రగాఢంగా వున్నది. ఈ తరం భారతీయుల భావనా ప్రపంచాన్ని చైతన్యవంతం చేయగల ధీమంతులైన నాయకుల, భావాల అన్వేషణలో ఆ ఉద్యమం ప్రస్థానిస్తోంది.

జామియా మిలియా ఇస్లామియా నిరసనలలో పోలీసులు వ్యవహరించిన తీరుకు ఈ సువిశాల భారతదేశపు విద్యార్థిలోకం ఎలా ప్రతిస్పందించిందో గమనించారా? ఆ సద్యోజనిత ప్రతిస్పందనలు కేవలం మైనారిటీ వర్గాల విద్యార్థులు అత్యధికంగా వుండే జామియా, అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం, మౌలానాఅజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం (హైదరాబాద్), నాద్వా కాలేజ్ లకు మాత్రమే పరిమితం కాలేదు. ప్రగతిశీల రాజకీయ కార్యాచరణకు సుప్రసిద్ధ నెలవులైన జేఎన్‌యూ(న్యూఢిల్లీ), జాదవ్ పూర్ విశ్వవిద్యాలయం (కోల్‌కతా), టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(ముంబై)లో సహజంగానే ఆ నిరసనలు ఉధృతంగా ప్రతిధ్వనించాయి. విశేషమేమిటంటే తాజా నిరసనలలో ఐఐటీల, ఐఐఎమ్‌ల, ఎఐఐఎమ్ఎస్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ విద్యార్థులు కూడా చురుగ్గా పాల్గొన్నారు. అలాగే ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, పుణే, చండీగఢ్, లక్నో, భోపాల్ నగరాలలోని ప్రైవేట్ విశ్వవిద్యాలయాల విద్యార్థులు కూడా ప్రభుత్వ విశ్వవిద్యాలయాల విద్యార్థులతో కలిసి ఆందోళనల్లో పాల్గొన్నారు. ఇంకా దేశవ్యాప్తంగా వివిధ చిన్న పట్టణాలలోని పలు విద్యాసంస్థల విద్యార్థులు కూడా జామియా విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావం వ్యక్తం చేశారు.





అసాధారణమైన ఆందోళనలివి. విద్యార్థి దశ నుంచీ ఇంతవరకు ఇటువంటి ఆందోళనను నేను చూడలేదు. ఏ విశ్వవిద్యాలయ విద్యార్థుల ఉద్యమానికి ఇంత విస్తృత స్థాయిలో మద్దతు లభించిన సందర్భాలు చాలా అరుదు. అందునా విద్యార్థిలోకానికి మొత్తంగా ఎటువంటి హాని జరగడానికి ఆస్కారం లేని ' పౌరసత్వ సవరణ చట్టం' (సిఏఏ) లాంటి అంశంపై ఆందోళనకు ఇంత విస్తృత స్థాయిలో సంఘీ భావం వెల్లువెత్తడం నిజంగా చెప్పుకోదగ్గ విశేషం. నిరసనలు తెలుపుతున్న అలీగఢ్, జామియా, జేఎన్‌యూ విద్యార్థులతోను, ఇండియా గేట్ వద్ద సంఖ్యానేకంగా గుమిగూడిన విద్యార్థులనుద్దేశించి నేను మాట్లాడాను. ఏ రాజకీయ బృందమూ సమీకరించకుండా సిఏఏ వ్యతిరేక నిరసనల్లో విద్యార్థులు అసంఖ్యాకంగా పాల్గొవడం నాకు ఎంతైనా విస్మయం కల్గించింది. ఆ యువజన చైతన్యం నన్ను విశేషంగా కదిలించింది. ఇండియా గేట్ వద్ద నిరసనలలో పాల్గొన్న విద్యార్థులు, యువజనులలో అత్యధికులు పౌరసత్వ సవరణ చట్టంతో నేరుగా ప్రభావితులయ్యే రెండు వర్గాల ముస్లింలు, ఈశాన్య రాష్ట్రాలకు చెందినవారు కాదు.

ఎన్నడూ లేని విధంగా విద్యార్థినులు చాలా పెద్ద సంఖ్యలో ఈ నిరసనల్లో పాల్గొనడం మరింత ముఖ్యమైన విషయం. తమ సొంత ప్రయోజనాలతో నిమిత్తం లేకుండా స్వతంత్రంగా సమీకృతులైన వ్యక్తులు పెద్ద ఎత్తున పాల్గొవడమనేది ఏ ప్రధాన ఉద్యమానికైనా చాలా అవసరం. పౌరసత్వ సవరణ చట్టం వ్యతిరేక ఉద్యమంలో ఇది ఖచ్చితంగా సంభవించింది. కనుకనే అత్యంత ప్రతికూల పరిస్థితులలోను జామియా విద్యార్థులు తమ ఉద్యమంలో గణనీయమైన ఫలితాన్ని సాధించారు. జామియా మిలియా ఇస్లామియాలో విద్యార్థులు నానా అరాచకాలకు పాల్పడ్డారన్న అధికారిక కథనాలకు మీడియా తొలుత ప్రాధాన్యమిచ్చింది. అయితే ఆ వెన్వెంటనే విద్యార్థులకు వ్యతిరేకంగా పోలీసుల అమానుష చర్యలకు సంబంధించిన వార్తలు వెల్లువెత్తాయి. నిరసనకారులు దాదాపుగా ప్రతి ఒక్కరి వద్ద మొబైల్ కెమెరాలు వుండడం, సామాజిక మాధ్యమాల విస్తృతి, ప్రభావశీలత విద్యార్థులపై దమనకాండ వార్తల వెల్లువకు ఎంతైనా దోహదం చేసింది. అలాగే పలువురు కళాకారులు, నటీనటులు కూడా విద్యార్థుల నిరసనలకు శీఘ్రంగా మద్దతు తెలిపారు. పోలీసులు, నిరసన తెలుపుతున్న జామియా విద్యార్థుల వెంటబడి తరుముతూ లైబ్రరీ, హాస్టళ్ళలోకే గాక నివాస ప్రాంతాలలోకి కూడా అనుమతి లేకుండా చొరబడిన దృశ్యాలను చూపుతున్న వీడియోలను ఎట్టి పరిస్థితులలోను ఉపేక్షించలేము. సాధారణ విద్యార్థులు తమ ఇంగిత జ్ఞానంతో సిఏఏ వ్యతిరేక నిరసనలకు మద్దతునివ్వకపోతే వాటి ప్రభావం ఇంతగా వుండేది కాదని స్పష్టంగా చెప్పవచ్చు.

> పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఇండియా గేట్ వద్ద నిరసనలలో పాల్గొన్న విద్యార్థులు, యువజనులలో అత్యధికులు ఆ శాసనంతో నేరుగా ప్రభావితులయ్యే రెండు వర్గాల ముస్లింలు, ఈశాన్య రాష్ట్రాలకూ చెందినవారు కాదు. ఈ నిరసనలకు అనివార్యంగా ఒక రాజకీయ ప్రాధాన్యమున్నది. నిరసనకారులలో అత్యధికులు ముస్లిమేతరులు. పౌరసత్వ సవరణ చట్టాన్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తున్నవారు. మతాధార పౌరసత్వమనేది రాజ్యాంగ విహితం కాదని విశ్వసించడం వల్లే వారు ఆ నిరసనల్లో పాల్గొన్నారు.

ఈ నిరసనలను మరింత లోతుగా పరిశీలిస్తే, దేశవ్యాప్తంగా వివిధ ఉన్నత విద్యా సంస్థలలో కొంత కాలంగా రాజుకొంటున్న అశాంతిని అవి ప్రతిబింబిస్తున్నాయని విశదమవుతుంది. విశ్వవిద్యాలయాలు క్రమంగా కేంద్రం, రాష్ట్రాలలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలకు దాసోహమంటున్నాయి. ఉన్నత విద్యా సంస్థల అధిపతులు తరుచూ సంకుచితంగా, కక్షపూరితంగా వ్యవహరించే ప్రభుత్వాధికారుల్లా ప్రవర్తిస్తున్నారు. స్ఫూర్తిదాయక మార్గదర్శకత్వాన్ని నెరపడంలో విఫలమవుతున్నారు. ఫలితంగా విద్యార్థుల, అధ్యాపకుల విశ్వాసాన్ని పొందలేకపోవడమే గాక తరచూ వారి అవహేళనలకు గురవుతున్నారు. అటు విద్యార్థులకు, ఇటు అధ్యాపకులకు ఊపిరాడనివ్వని పరిస్థితులు కేంపస్‌లలో పెరిగిపోతున్నాయి. కేంపస్ జీవితం అంతకంతకూ నిరుత్సాహకరంగా మారిపోతోంది. విద్యార్థులపై అంతకంతకూ ఆంక్షలు పెరిగిపోతున్నాయి. విద్యార్థి సంఘాలను నిషేధించకపోయినప్పటికీ వాటి కార్యకలాపాలను నిరుత్సాహపరుస్తున్నారు. ఒక విద్వజ్జుని ప్రసంగాన్ని ఏర్పాటు చేయాలన్నా, ఒక సదస్సును నిర్వహించాలన్నా అనుమతి తీసుకోవడం తప్పనిసరి అయిపోయింది. సామాజిక మాధ్యమాలు నిరంతర పరిశీలనలో వుంటున్నాయి. ఫేస్ బుక్ లో 'ఆక్షేపణీయ' వ్యాఖ్యలు పోస్ట్ చేసిన విద్యార్థులను శిక్షిస్తున్నారు. హాస్టల్ టైమింగ్స్, ఇతర నిబంధనలను ఖచ్చితంగా పాటించి తీరాలని విద్యార్థినులను హాస్యాస్పదంగా కట్టడి చేస్తున్నారు. సహచర విద్యార్థులతో వారి సంబంధాలను నిఘా బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యార్థినీ విద్యార్థులను తీవ్ర భయాందోళనలకు గురి చేస్తున్నాయి. జామియాలో పోలీసుల చర్యలకు వ్యతిరేకంగా వెల్లువెత్తిన నిరసన, కేంపస్‌లలో ఊపిరాడనివ్వని, అణచివేత పరిస్థితులపై నిరసన కూడా. ఈ విద్యార్థులలో అత్యధికులు గ్రామీణ ప్రాంతాల నుంచి, వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన తొలితరం విద్యావంతులు. కన్న ఊళ్ళలోని పరిస్థితులకు భిన్నంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను తొలిసారి ఆస్వాదిస్తున్నవారు. ఈ స్వేచ్ఛను వదులుకోవడానికి వారు సిద్ధంగా లేరు. మరి 'అజాది' నేటి యువతరానికి అత్యంత ఉత్తేజకరమైన పిలుపు కావడంలో ఆశ్చర్యమేముంది? దేశవ్యాప్తంగా విద్యార్థుల నిరసనలు జామియా, అలీగఢ్ విశ్వవిద్యాలయాల విద్యార్థులకు సంఘీభావం వ్యక్తం చేయడానికి మాత్రమే కాదు, పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకించడానికి కూడా అన్న వాస్తవాన్ని ఎవరూ విస్మరించకూడదు. ఈ నిరసనలకు అనివార్యంగా ఒక రాజకీయ ప్రాధాన్యమున్నది. నిరసనలలో పాల్గొనే విద్యార్థులలో అత్యధికులు ముస్లిమేతరులు. పౌరసత్వ సవరణ చట్టాన్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తున్నవారు. మతాధార పౌరసత్వమనేది రాజ్యాంగ విహితం కాదని విశ్వసించడం వల్లే వారు ఆ చట్టాన్ని వ్యతిరేకించారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకించడంలో ముస్లింలు, ఈశాన్య రాష్ట్రాల ప్రజలతో పాటు విద్యార్థులు, యువజనులు తమ నిరసనలతో ప్రధాన భాగస్వాములయ్యారు. ఇక్కడ కూడా సమస్య కేవలం పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్‌సి) మాత్రమే కాదు. దేశ విభజన కాలంలోను లేదా మధ్యయుగాలలో ముస్లిం పాలకులు పాల్పడిన తప్పులను సరిదిద్దడానికి ప్రస్తుత పాలకులు పూనుకున్న వివిధ ప్రాజెక్టులతో వారు విసిగిపోయారు. ఎన్నడో జరిగిన చారిత్రక అఘాయిత్యాలకు ఇప్పుడు ప్రతీకార ధోరణితో వ్యవహరించడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. వర్తమానంలో సంతోషంగా జీవించాలని, భవిష్యత్తులోకి సంపూర్ణ భద్రతతో ప్రయాణించాలని వారు కోరుకుంటున్నారు.

ఇక విద్యా ఉద్యోగరంగాలలో అసమాన అవకాశాల సమస్య ఉండనే ఉన్నది. ఫీజుల పెంపుదలపై కొనసాగుతోన్న జేఎన్‌యూ విద్యార్థుల ఆందోళన వాస్తవానికి ఈ మౌలిక సమస్య మీదే జరుగుతోంది. ఉన్నత విద్య అందుబాటులో లేకపోవడమే కాదు, జీవితోన్నతికి ఉపయుక్తంగా కూడా లేదు. విద్యార్థి సహాయ కార్యక్రమాలు, పథకాలు అనేవి అత్యంత లజ్జాకర విషయాలుగా కొనసాగుతున్నాయి. ఉన్నత విద్యారంగ ప్రమాణాలు ఒక జాతీయ కళంకం కాలేదంటే అందుకు కారణం ఆ రంగాన్ని గురించి సమగ్ర సమాచారాన్ని ఒక క్రమపద్ధతిలో సేకరించడానికి ఎవ్వరూ సరైన శ్రద్ధ చూపక పోవడం వల్లేనని చెప్పవచ్చు.

కొత్తతరం విద్యార్థులు ఉన్నత విద్యారంగంలోకి ప్రవేశించడంతోనే సంతృప్తిచెందడం లేదు. కొత్త ఆకాంక్షలను తీసుకు వస్తున్నారు. అయితే విశ్వవిద్యాలయ విద్య తమకు మంచి ఉద్యోగాన్ని సాధించిపెట్ట లేదన్న వాస్తవాన్ని వారు అర్థం చేసుకున్నారు. మన దేశంలో నిరుద్యోగం చాలా అధికస్థాయిలో ఉన్నది. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాని పరిస్థితి. 19–24 సంవత్సరాల మధ్య వయస్సులో ఉన్న కళాశాల పట్టభద్రులలో నిరుద్యోగం మరీ ఎక్కువగా వున్నది. 24 ఏళ్ళకు పైగా వయస్సున్న ఆ పట్టభద్రులలో నిరుద్యోగ రేటు తగ్గిపోయింది. కోరుకున్న ఉద్యోగం రావడం వల్ల గాక, జీవితంలో స్థిరపడడానికి ఏదో ఒక ఉద్యోగంలో చేరడం వల్లే ఆ పట్టభద్రులలో నిరుద్యోగ రేటు తగ్గిపోవడానికి ప్రధాన కారణమని చెప్పి తీరాలి. ఈ యువజనుల అసంతృప్తి కూడా గత కొద్ది రోజులుగా వెల్లువెత్తుతోన్న నిరసనలకు కారణం కావడంలో ఆశ్చర్యమేముంది?

విద్యార్థుల ఉద్యమం స్వతస్సిద్ధంగా ప్రజ్వరిల్లింది. అది మరింత మమ్మురమవుతుంది. దానికి ఇంకా ఒక సంస్థాగత నిర్మాణం లేదు. ఉద్యమం ప్రగాఢమై ప్రభావశీలమవ్వాలంటే అది ఒక నిర్దిష్ట రూపాన్ని తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వున్నది. యువ నాయకులు పలువురు ప్రభవిస్తున్నారు. అయితే ఉద్యమాన్ని సమైక్యపరిచి, పటిష్ఠం చేయగల దీక్షాదక్షతలు వారిలో కొరవడ్డాయి. స్ఫూర్తిదాయకమైన కొత్త భావాల కోసం కూడా ఉద్యమం ఆరాటపడుతున్నది. జీవితోన్నతికి అవరోధంగా వున్న ఆర్థిక, సామాజిక శృంఖలాలను త్రెంచు కోవాలన్న వారి కోరికను ఉదారవాదంగాను, గౌరవప్రదమైన జీవనాధారాన్ని సముపార్జించుకోవాలన్న వారి ఆకాంక్షను ఒక సామ్యవాద విప్లవాన్ని సాధించగలిగేదిగాను అర్థం చేసువడం పొరపాటు అవుతుంది. అది ఇంకా, ఒక నామధేయం కోసం అన్వేషిస్తోన్న ఉద్యమమే.

*(స్వరాజ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు)*

# కాలం మరువని కాకోరీ వీరుడు

రష్యా విప్లవ ప్రభావంతో మన దేశంలో కూడా గాంధీ నాయకత్వంలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడుతున్న క్రమంలో చౌరీచౌరా ఘటనల వల్ల స్వాతంత్ర్య పోరాటాన్ని ఆపివేసినందున సబ్దత ఆవరించి ఉన్న సమయంలో సాయుధ పోరాటం ద్వారా భారతదేశాన్ని విముక్తి చేయాలని భావించిన కొందరు యువకులు రాం ప్రసాద్ బిస్మిల్ నాయకత్వంలో హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్‌ను స్థాపించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఇది చురుకైన పాత్ర నిర్వహిస్తూ ఉండేది. ఆ సంస్థ సభ్యుడైన అ ఉద్యమకారుడిగా మారి దేశంలో మొట్టమొదటగా ఉరికంబం ఎక్కిన వీరుడు అష్ఫాఖుల్లాఖాన్. నా పోరాటం, త్యాగం వృథా కాదు, ఎందరో త్యాగధనులకు స్ఫూర్తినిస్తుంది. నా మాతృభూమి సంకెళ్ళు తెగిపోతాయని, జన్మభూమి విముక్తి కోసం ఉరికంబాన్ని ఎక్కబోతున్న మొట్టమొదటి అదృష్టవంతుడిగా తోటి ఖైదీలకు గర్వంగా చెప్పుకున్న విప్లవకారుడు అష్ఫాఖుల్లా ఖాన్.

ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌లో 1900 అక్టోబర్ 22న జమీందారు కుటుంబంలో జన్మించాడు. విద్యావంతురాలైన తల్లి ప్రోత్సాహంతో విద్యార్థి దశ నుండి దేశభక్తి, జాతీయతాభావాలు అలవర్చుకొని ఉపాధ్యాయుల ప్రేమాభిమానాలను పొందాడు. మితిమీరి పోతున్న ఆంగ్లేయుల ఆగడాల వల్ల వలస పాలకులపై అష్ఫాఖుల్లాఖాన్ తీవ్ర విముఖత పెంచుకున్నాడు. కుటుంబ నేపథ్యం దృష్ట్యా పై చదువులు చదివి ఉన్నతోద్యోగాలు చేసే అవకాశం ఉన్నప్పటికీ మాతృభూమి సేవనే మిన్నగా భావించి జాతీయోద్యమంలో పాల్గొన్నాడు. పోరాటానికి అడ్డంకి అవుతుందన్న భావనతో వివాహాన్ని కూడా త్యజించాడు. హిందూస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్‌లోని ఆర్య సమాజ సభ్యుడైన రాంప్రసాద్ బిస్మిల్‌కు ప్రాణ స్నేహితుడిగా మారినాడు. ముస్లిం యువకులలో దేశభక్తి బావాలు పెంపొందించడంలో ఎంతగానో కృషి చేశాడు. బ్రిటిష్ వారికి తొత్తులుగా, వారి ఏజెంట్లుగా మారిన కొందరు హిందూ మతతత్వవాదులు బిస్మిల్, అష్ఫాఖుల్లాఖాన్‌ల మధ్య విభేదాలు పెంచాలని కుట్రలు చేసినప్పటికీ అవేవీ ఫలించలేదు. హిందూ ముస్లిం ఐక్యతను కాంక్షించిన అష్ఫాఖుల్లాఖాన్ విదేశీ వస్తు బహిష్కరణకు స్వదేశ వస్తు వాడకానికి పిలుపునిచ్చాడు. నాడు హిందు, ముస్లింల మధ్య జరుగుతున్న మత కలహాలు ఆయన హృదయాన్ని కలిచివేశాయి. ఫైజాబాద్ జైలు నుండి తాను రాసిన లేఖలో 'నా ప్రియమైన దేశ సోదరీ,సోదరులారా! మనమంతా మొదట భారతీయులము, భారత గడ్డమీద జన్మించిన వాళ్ళమంతా మిత్రులం. ఆ తరువాతనే వివిధ మతాల వారం, కులాలవారం. మీరంతా ఏ మతాల, కులాల వారు అయినప్పటికీ పరస్పరం కలహించుకోకండి. మనమంతా ఏకమై ఐక్యమత్యంతో పోరాడి బ్రిటీష్ వాళ్ళను తరిమికొడదాం అని విన్నవించాడు.


అష్ఫాఖుల్లాఖాన్ జీవితాన్ని మలుపు తిప్పి, ఉరిశిక్ష వరకు తీసుకుపోయిన ఘటన 1925 ఆగస్టు 9న జరిగిన కాకోరి ఘటన. అప్పట్లో సాయుధ ఉద్యమానికి నిధుల కొరత ఉండడంతో బ్రిటీష్ ప్రభుత్వ ఖజానాను తరలిస్తున్న రైలును దోపిడీ చేయాలని హిందూస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ సభ్యులు నిర్ణయించారు.

అష్ఫాఖుల్లాఖాన్ జీవితాన్ని మలుపు తిప్పి, ఉరిశిక్ష వరకు తీసుకుపోయిన ఘటన 1925 ఆగస్టు 9న జరిగిన కాకోరి ఘటన. అప్పట్లో సాయుధ ఉద్యమానికి నిధుల కొరత ఉండడంతో బ్రిటీష్ ప్రభుత్వ ఖజానాను తరలిస్తున్న రైలును దోపిడీ చేయాలని హిందూస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ సభ్యులు నిర్ణయించారు. ఈ విషయాన్ని, ఈ ఆలోచనను బిస్మిల్ కేంద్ర కమిటీ ముందుంచి పథకాన్ని వివరించి సభ్యుల అభిప్రాయం కోరగా ఒక అష్ఫాఖుల్లాఖాన్ తప్ప మిగిలిన సభ్యులందరు ఏకగ్రీవంగా సమ్మతించారు. ఒక అష్ఫాఖుల్లాఖాన్ మాత్రం వ్యతిరేకించాడు. మన దళం ఇంకా బలోపేతం కాలేదని ప్రభుత్వంతో ఎదురించే శక్తి సమకూరలేదని ఈ సంఘటన జరిగితే ప్రభుత్వం మనల్ని వేటాడుతుందని, దళం ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశాడు. కానీ, ఇతర సభ్యుల వాదనతో ఏకీభవించాడు. ముందుండి దోపిడీ ఘటనను విజయవంతంగా నడిపించాడు. ఆయనతో పాటు చంద్రశేఖర్ ఆజాద్, రాజేంద్ర లహరి, కేశవ చక్రవర్తి, మన్మథనాథ్ గుప్త, మురారీలాల్, శచేంద్రనాథ్, బక్షి బిస్మిల్‌లు పాల్గొన్నారు. ఈ ఘటనతో బ్రిటీష్ ప్రభుత్వం ఉలిక్కిపడింది. దీనిని వెంటనే ఉక్కుపాదంతో అణచాలని లేకపోతే ఇలాంటి సాయుధ దాడులు మరిన్ని జరిగే ప్రమాదం ఉందని భావించి వీరి కోసం అన్వేషణ మొదలు పెట్టింది. దీంతో అందరూ అజ్ఞాతంలోకి వెళ్లారు. జీవితాంతం రహస్య జీవితం గడిపే అవకాశం వున్నప్పటికి విశ్రాంతి నచ్చని విప్లవ యోధుడిగా రహస్యంగా ఉద్యమంలోనే కొనసాగాడు, వేషభాషలు మార్చి బీహార్‌లోని ఒక ఫ్యాక్టరీలో కూలీగా చేరాడు. అక్కడి నుండి రష్యా వెళ్ళాలనే ఆలోచనతో భోపాల్ మీదుగా ఢిల్లీ చేరుకున్నాడు. ఈ విధంగా స్థలాలను మార్చుతూ, బ్రిటీష్ వారి కంటపడకపోవడంతో ఆయన తలపై భారీ నజరానా ప్రకటించారు. తన బాల్య మిత్రుడు చేసిన కుట్ర వల్ల ఆంగ్లేయులకు దొరికిపోయాడు. కుట్రలో పాల్గొన్న అందరిపై రాజద్రోహం కుట్ర కేసు బనాయించారు. కోర్టులో విచారణ సమయంలో బిస్మిల్ కోరిక మేరకు 'ఘటనకు పూర్తి బాధ్యుడిడి తానేనని మిగతా వారికి ఎలాంటి సంబంధం లేదని' చెబుతూ మొత్తం నేరాన్ని తనమీదే వేసుకుని, మిగతా వారిని తప్పించిన భారత ముద్దుబిడ్డ అష్ఫాఖుల్లాఖాన్. ఈయనను 1927 డిసెంబర్ 19న ఉరి తీశారు. ఉరి శిక్ష ఖరారు అయ్యాక తాను ఉరికంబం మీద ఊగే సుందర స్వప్నాన్ని నిత్యం దర్శించుకున్నానని, అది తనకు లభించిన మహత్తరమైన అవకాశమని ప్రకటించాడు. భారతీయుల గుండెల్లో రేగిన బడబాగ్నులలో బ్రిటీష్ వారు మాడి మసై పోవాలని చివరి కోరికగా కోరినాడు. ఉరి శిక్షకు ముందు తన తల్లికి రాసిన లేఖలో 'అమ్మా నీవు వీర మాతవు, వీర మాతలు దుఃఖించరాదు. మాతృభూమి కోసం మరణించే మహత్తర అవకాశం నీ పుత్రుడికి లభించినందుకు సంతోషించాల'టూ కన్న తల్లిని ఊరడించాడు.

■ పి.బిచ్చారెడ్డి

*(నేడు అష్ఫాఖుల్లా ఖాన్ వర్ధంతి)*

కరపత్రం

## సీఏఏ, ఎన్ఆర్‌సీలకు నిరసనగా పౌర ధర్నా

నేడు స్వాతంత్ర్య సమర యోధులైన అష్ఫాఖుల్లా ఖాన్, రాం ప్రసాద్ బిస్మిల్‌లను ఉరి తీసిన రోజు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా 'పౌరసత్వ సవరణ చట్టం, ఎన్.ఆర్‌సి. వ్యతిరేక నిరసన' జరుగుతోంది. అన్ని మతస్థుల ఉమ్మడి త్యాగాలతో సాధించుకున్న స్వాతంత్ర్యం, అన్ని మతస్థుల ఉమ్మడి వారసత్వంతో పెంపొందిన భారత సంస్కృతిని కాపాడుకోవాలంటే మన దేశంలో సమాన పౌరసత్వాన్ని కాపాడుకోవాలి. దీనికి విరుద్ధంగా ఉన్నది జాతీయ పౌరసత్వ సవరణ బిల్లు, 2019(సీఏఏ), జాతీయ పౌరసత్వ జాబితా (ఎన్ఆర్‌సీ)లకు వ్యతిరేకంగా 'ఎన్.ఆర్.సి., సి.ఎ.బి. వ్యతిరేక పౌర వేదిక' తరఫున సాయంత్రం 4గంటలకు హైదరాబాద్‌లో నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద నిరసన కార్యక్రమం జరుగుతుంది.

– కన్నెగంటి రవి, విస్సా కిరణ్ కుమార్

# భారతీయ సంస్కృతే భవ్య జీవనబాట

ఈ మధ్య జరుగుతున్న నేరాలు, ఘోరాలు పరిశీలిస్తే సమాజం ఎంత పతనావస్థకు చేరుకున్నదో అవగతం అవుతుంది. అత్యంత హేయమైన రీతిలో అవి జరుగుతున్న తీరు బాధాకరం. సభ్య సమాజం తలదించుకునే రీతిలో ముక్కుపచ్చలారని చిన్నారులను సైతం లైంగికంగా హింసించి చంపటం నిత్య కృత్యాలుగా మారాయి. అంతులేని మత మౌఢ్యాన్ని, మతాన్ని ధిక్కరిస్తే నడివీధుల్లో సజీవ దహనం చేసిన మధ్యయుగాల నాటి చరిత్రను మనం చదివాం. మళ్ళీ అంతటి అమానవీయ చరిత్రను ఇప్పుడు చూస్తున్నాం.

అనాదిగా భారతీయ సమాజం, సంస్కృతులు ప్రపంచదేశాలకు ఆదర్శంగా ఉండేవి. క్రీస్తు పుట్టక ముందే ప్రపంచంలో మహోన్నత చరిత్ర, సంస్కృతీ సంప్రదాయాలు, విలువలు, విద్యావిధానం ఉన్న దేశం మనది. ఇప్పుడు ఇక్కడ నుంచే దాడులు మొదలయ్యాయి అవి భౌతిక దాడులైతే ఎదుర్కొనే శక్తి మనదేశానికుంది. కానీ, ఈ దాడులు మానసికమైనవి. క్రీ.పూ. 6వ శతాబ్దంలో బౌద్ధం ఈ దేశంలో పుట్టింది. బుద్ధుడు హిందూ మతంలోని లోటు పాట్లను ప్రశ్నిస్తూ బౌద్ధాన్ని ప్రారంభించాడని బౌద్ధ మత గ్రంథాలు తెలుపుతున్నాయి. అంటే, క్రీ.పూ. 6వ శతాబ్దం కంటే హిందూ మతం ఉందన్నది తెలుస్తోంది కదా! అంతకంటే ముందు ఈ దేశంలో ఏ మతం లేదు. అంతకు ముందున్న భారత చరిత్ర అంతా కూడా హిందూమత చరిత్రే. అప్పటికీ ఉన్న హిందూ సాంప్రదాయాలు పురాణాలు, వేదాలు, వేదాంగాలు, రామాయణం, మహాభారత గ్రంథాలన్నీ ఆనాటి సమకాలీన పరిస్థితులను, రాజకీయ, ఆర్థిక, సామాజిక, శిల్ప కళా రీతులను నేటి తరానికి పరిచయం చేస్తున్నాయి. ఈ గ్రంథాలను ప్రశ్నిస్తూ ఆ గ్రంథాల మనుగడను వాటిలోని సారాన్ని అవహేళన చేస్తూ వాటి శాస్త్రీయతను తప్పు బడుతూ మొదలైన పాశ్చాత్య భావజాల వాదన నేటి సమాజాన్ని తునాతునకలు చేసే స్థాయికి చేరింది. కులాల పేరిట, మతాల పేరిట కుంపట్లు కాచుకుంటున్న విపరీత పరిణామాలు భారతీయ సమాజాన్ని ముక్కలు చెక్కలుగా చేశాయి. ఆ పాశ్చాత్య సంస్కృతి భారతీయ సమాజాన్ని ఒక్కతాటిపైకి నిలిపిన కుటుంబ వ్యవస్థని ధ్వంసం చేసింది. పండు ముసలి దగ్గర్నుంచి మూడు తరాల మనుషులు కలిసి ఉండే మినీ సమాజం కుటుంబంలోనే మనిషికి పరిచయం అయ్యేది. అక్కడే నైతిక విలువలు, అమ్మకు, తోబుట్టువులకూ ఇవ్వాల్సిన గౌరవం, నడవాల్సిన పద్ధతి అర్థం అయ్యేది. అమ్మఒడి, తొలిబడి, దేవుని గుడి అన్నీ ఆ కుటుంబమే అయి నడిపించేది. బామ్మలు, తాతలు రామాయణ, మహాభారతాలను, భగవద్గీతను అమ్మ భాషలో నేర్పేది. రాముని వ్యక్తిత్వం, ధర్మరాజు నీతి, దుర్యోధన, దుశ్శాసన, కీచక, రావణ వధలను వాటి వృత్తాంతాలను విని నాయక, ప్రతినాయకుల మధ్య పోలికలు, ఏది మంచో ఏది చెడో ఇట్టే అర్థం చేసుకునేవాళ్ళు. సీత, సావిత్రి, అనసూయ, సత్యభామల వంటి పురాణ స్త్రీల సాహసాలు, వారి ఓపిక, ధైర్యం, అణకువ లాంటి లక్షణాలు ఆడపిల్లలు అలవరచుకునేవారు.

అనురాగాలు, అప్యాయతలు లేకుండా పొరుగువాడు చచ్చినా ఎలాంటి స్పందనాలేని మనుషులు తయారయ్యారు. సామాజిక స్పృహ కొరవడిన నేటి తరం మానవీయతకు విలువనివ్వటం లేదు. కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమైపోయింది. కార్పొరేట్ జీవితాలు మనుషుల్ని, మనుసుల్ని కలుషితం చేశాయి. రెండు పదుల వయసున్న యువతీయువకులు అయిదు అంకెల జీతం తీసుకుంటూ తాము ఎవరికీ జవాబుదారీ కాదన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా అంతిమంగా తమ పిల్లలు సంపాదన చూసి మురిసిపోతున్నారు. తాత్కాలిక ఆనందాలకు అలవాటు పడి సమాజం శాశ్వత విలువలు కోల్పోయింది. నూనూగు మీసాల వయసులో అందిందల్లా ఆస్వాదించాలన్న తపనలో యువత కొట్టు మిట్టాడుతోంది. తమ నేపథ్యం, పరిసరాలు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. స్వేచ్ఛ పేరిట విశృంఖలత్వాన్ని అందిస్తున్న భావజాలమే దీనికి కారణం. రష్యా, చైనా, క్యూబా, వెనిజులా, లాటిన్ అమెరికా దేశాల్లోని, ఐరోపా దేశాల్లోని పాశ్చాత్య సంస్కృతులను ఇక్కడ నాటే ప్రయత్న ఫలితమే ఈ పర్యవసానాలు. ఓ సినిమాలో వర్ధమాన శాస్త్రవేత్త ఒక సూపర్‌మాన్‌ను తయారు చేయాలని భావించి ఒక గర్భస్థ పిండంలోకి బలశాలి అయిన మనిషి మూలకణాలను ఎక్కించగా ప్రయోగం వికటించి ఓ క్రూరమృగం లాంటి మనిషి పుట్టి సమాజాన్ని నాశనం చేస్తుంటాడు. సరిగ్గా ఇదే విధంగా ఈ దేశ సంస్కృతీ సంప్రదాయాలకు సరిపోని పాశ్చాత్య సంస్కృతిని ఇక్కడ జొప్పించటం వలన ఈనాడు మన సమాజం దుష్పరిణామాలు ఎదుర్కొంటుంది. పురాణాలు, రామాయణ, భారతాలు చదువుతూ సామాజిక విలువల్ని తెలుసుకున్న భారతీయులు అవి ఉన్నాయా? లేవా? అని సందేహించలేదు. కేవలం వాటిలోని మంచి సారాన్ని గ్రహించి పాటించేవారు. అయితే, సీతను రాముడు అడవికెందుకు తీసుకెళ్ళాడు? అని పాశ్చాత్య భావజాల మెదడుతో ప్రశ్నించడం ద్వారా ఆ గ్రంథంపై ఉన్న నమ్మకం కోల్పోయే స్థితి కల్పించారు. భరతమాత అంటే, అమెకు భర్త ఎవరు ప్రశ్నించే వ్యక్తులు, స్వేచ్ఛ పేరుతో స్త్రీ, పురుషులకు తేడాలేదంటూ కిస్ ఆఫ్ లవ్ కార్యక్రమాలు చేపట్టి మనల్ని ప్రేరేపించే భావజాలం గలవారు ఈ సమాజానికి ఏం నేర్పుతారు? సామాజిక కార్యకర్తల ముసుగులో పెళ్ళి కాని యువతీయువకులకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం ఏ విపరిణామాలకు దారితీస్తుంది? పాశ్చాత్య మోజులోపడి మాతృభాషను చంపుతూ పురాతన గ్రంథాలను చదివే అవకాశాలను కాలరాస్తున్నారు. ఇంగ్లీషు భాషలో మనలాంటి నీతి సూత్రాలు, ధర్మ సూక్ష్మాలు పిల్లల్లో ఆలోచన, వివేచననూ రేకెత్తించే బాలమిత్ర కథలు, పంచతంత్ర కథలు లేవు. ఉన్నా అవి మూలంలేని సారం లాంటివే. ఈ భావజాలం ఉన్నవారికి మానవ హక్కులు, సమానత్వం, స్వేచ్ఛలు తమకు అవసరం అయినప్పుడు, తాము సమర్థించే వ్యక్తులు చనిపోయినప్పుడే గుర్తొస్తాయి. తమ సిద్ధాంతాన్ని ఆచరించే వాళ్ళకే ఇవన్నీ వర్తించాలన్నది వారి భావన. దిశ భయానక ఘటన జరిగిన పది రోజుల వరకూ నోరు మెదపని వీరు నలుగురు నిందితుల ఎన్‌కౌంటర్ తర్వాత మానవ హక్కుల కార్యకర్తలమని చెప్పుకుంటూ న్యాయం కోసం కోర్టు మెట్లెక్కుతున్నారు.

> దేశ సంస్కృతీ సంప్రదాయాలకు సరిపోని పాశ్చాత్య సంస్కృతిని ఇక్కడ జొప్పించటం వలన ఈనాడు మన సమాజం దుష్పరిణామాలు ఎదుర్కొంటుంది. పురాణాలు, రామాయణ, భారతాలు చదువుతూ సామాజిక విలువల్ని తెలుసుకున్న భారతీయులు వాటిని సందేహించలేదు, కేవలం వాటిలోని మంచిని గ్రహించి పాటించారు. అయితే, అనంతర కాలంలో పాశ్చాత్య భావజాలం అటువంటి గ్రంథాలపై నమ్మకం కోల్పోయే స్థితిని కల్పించి, సమాజంలో వికృతాలకు కారణమయింది.

ప్రేమికుల రోజులు జరపాలని, ముద్దుల పండుగలు జరపాలనీ, నక్సలైట్ల ఎన్‌కౌంటర్లపై విచారణ జరపాలనీ కోరుతున్న ఈ హక్కుల కార్యకర్తలు అదే నక్సలైట్ల చేతిలో ప్రాణాలొదిలిన పోలీసులపై సానుభూతి చూపరు. దిశ హత్య జరిగిన వెంటనే మానవ హక్కులు హరించారంటూ కోర్టుల్లో, హక్కుల కమిషన్‌కు వెళ్తే సమాజం హర్షించేది. కానీ నలుగురు మృగాళ్ళను ఎన్‌కౌంటర్ చేసిన తర్వాతే వారికి మానవ హక్కులు గుర్తుకొస్తుండటం అత్యంత బాధాకరం. ఇలాంటి ఉద్యమకారులే రావణుడు అపహరించిన సీత ఆయన దగ్గర క్షేమంగానే ఉంది కదా! రావణుడు మంచివాడు సీతను చెరచలేదు కాబట్టి అందరూ రావణున్ని ఆదర్శంగా తీసుకోవాలని బోధిస్తారు. రామున్ని ప్రతి నాయకునిగా చూడాలంటారు. ఇన్ని వేల సంవత్సరాల సంస్కృతిలో భాగం అయిన పురాణ గ్రంథాల్ని వెనక




నుంచి తిప్పి చదవాలంటారు. వేల సంవత్సరాల సంస్కృతిని సంస్కరించాలంటూ విదేశీ భావజాలాన్ని జొప్పిస్తూ ఏకంగా హిందూమతం అంటే మనదేశ మతం కాదంటూ మత మార్పిడులు చేస్తున్నారు. ఇక్కడ మనం గ్రహించాల్సిన విషయం మత మార్పిడుల గురించి కాదు, వేల యేళ్ళ నాటి సంస్కృతిని తారుమారు చేయాలన్న తపనతో విపరీత లక్షణాలు గల వింత మనుషులు తయారై వికృత చేష్టలు చేయటాన్ని మనం గమనించాలి.

భారతీయ విద్యావిధానాన్ని సమూలంగా మార్చాల్సిన అవసరం, తరుణం ఆసన్నం అయింది. పెడదారి పడుతున్న యువతను తయారు చేస్తున్న నేటి విద్యావిధానమే అన్ని సమస్యలకూ ప్రధాన కారణం. విద్యా వ్యవస్థలో కార్పోరేట్‌కు చోటు లేకుండా చేయాలి. ఆంగ్లం అవసరమే కానీ అదే జీవితం కాకూడదు. అభివృద్ధి చెందిన దేశాల్లో మాతృ భాషల్లోనే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పుతున్నారు. బ్రిటిష్ పాలనా కాలంలో క్రైస్తవ మిషనరీలు ఈ దేశంలో ఆంగ్ల విద్యావిధానాన్ని ప్రారంభించిన తొలినాళ్ళలో భారతీయ సనాతన సాంప్రదాయ వాదులు ప్రమాదాన్ని శంకించారు. క్రైస్తవ మిషనరీలు మన సహజత్వాన్ని హరించి వేస్తాయని ముందే ఊహించారు. అనుకున్నట్లుగానే క్రైస్తవ మిషనరీలు ఆంగ్ల విద్య మాటున మత మార్పిడులు చేయడం సాధారణమైపోయింది.

సైబర్ నేరాలు రాజ్యమేలుతున్న ఆధునిక కాలంలో కూడా బ్రిటిష్ కాలంనాటి చట్టాలు అమలు జరుపుతుండటంతో నేరాలకు, శిక్షలకు పొంతన లేకుండా పోతుంది. బ్రిటిష్ కాలం నాటి చట్టాలనే ఇప్పటికీ ఆచరిస్తుండటం న్యాయపరంగా మనం ఎంత వెనుకబడి ఉన్నామో తేటతెల్లం చేస్తుంది. సి.ఆర్.పి.సి., ఐ.పి.సి. లాంటి చట్టాలు కూడా సవరణకు, మార్పులకు నోచుకోలేదంటే పాలకుల చిత్తశుద్ధి ఎంతటిదో అవగతం అవుతుంది. 2014 నుంచి ఇప్పటివరకు దాదాపు 1600 కు పైగా బ్రిటిషు కాలం నాటి కాలంచెల్లిన చట్టాలను తీసివేశారు. కానీ, సమాజంలో శాంతిభద్రతలను, ప్రజా సంక్షేమాన్ని ఉద్దేశించిన సి.ఆర్.పి.సి., ఐ.పి.సి. లాంటి కీలక చట్టాలను సవరించలేకపోవటం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇటీవల సి.ఆర్.పి.సి., ఐ.పి.సి. లలోని కొన్ని సెక్షన్లను సవరించారు. కానీ, సమూలంగా మార్పులు చేయలేదు. కొత్త చట్టాలు, ఆధునిక పరిజ్ఞానం మేళవించాల్సిన నేటి కాలంలో బ్రిటిష్ చట్టాలు, ఆచారాలు కొనసాగించటం దేశానికి మంచిది కాదు. ఇక తెలంగాణ రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరుతో పోలీసులను కోరలు పీకిన పులుల్లా, షోకేస్‌లో బొమ్మల్లాగా చూపిస్తూ రాష్ట్రంలో నేరాలు విపరీతంగా పెరగటానికి కారణమవుతున్నాం. దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌తో పోలీసులకు జనం నీరాజనాలు పలకవచ్చు, పోలీసుల్ని హీరోలుగా చూడవచ్చు, కానీ ఎన్‌కౌంటర్‌కు ముందు పోలీసుల తీరు, వారిపై వచ్చిన విమర్శలు, ఘటన జరిగినప్పుడు వ్యవహరించిన తీరు, ఇవి కూడా సమాజం గుర్తుంచుకోవాలి. భారతమాతకు మరో కడుపుకోత మిగల్చకుండా ఉండేందుకు ప్రజల్లో సామాజిక మార్పు రావాలి. విద్యావిధానాన్ని సమూలంగా సంస్కరించాలి, తల్లిదండ్రులు పిల్లలపట్ల బాధ్యతగా మెలగాలి. మన దేశ సంస్కృతీ సాంప్రదాయాలు, భారతీయ గత వైభవాన్ని పిల్లల ముందుంచి, ఆదర్శమూర్తుల జీవితాలను పరిచయం చేయాలి. చట్టాలు కఠినంగా రాటుదేలేలా చేయాలి. స్త్రీలు పూజింపబడే ఈ పుణ్యదేశంలో మరో అకృత్యానికి తావు లేకుండా చూడాలి.

■ డా. దొంతగాని వీరబాబు
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ

తిరుప్పావై

# వానల్లు కురవాలి... స్నానాలు ఆడాలి!



### నాలుగో పాశురం

ఆళి మళైక్కణ్ణా! ఒన్ఱు నీ కై కరవేల్
ఆళి ఉళ్ పుక్కు ముగందు కొడార్ త్తేఱి
ఊళి ముదల్వన్ ఊరువం పోళ్ మెయ్ కఱుత్తు
పాళియన్ తోళుడై ప్పఱ్బనాబన్ కైయిల్
ఆళిపోల్ మిన్ని, వలమ్బురి పోల్ నిన్ఱదిరుందు
తాళాదే శార్ఙ్గం ముదైత్త శరమళైపోల్
వాళ ఉలగినిల్ పెయ్దిడాయ్ నాంగళుమ్
మార్గళి నీరాడ మగిళున్దు ఏలోర్ ఎమ్బావాయ్

**భావం:** ఈ పాశురంలో గోపికలు వరుణ దేవుణ్ణి ప్రార్థిస్తున్నారు. భగవద్భక్తులకు దేవతలు కూడా సహకారులుగా ఉంటారన్న భావాన్ని గోదాదేవి ఈ పాశురంలో వ్యక్తపరిచింది. "ఫల సమృద్ధి కోసం ఆచరించే వ్రతానికి వరుణదేవుడు తనంతట తానే ముందుకువచ్చి సహకరిస్తాడు. ఓ వరుణదేవా! దయచేసి నువ్వు చేతులు ముడుచుకొని కూర్చోవద్దు. సముద్రంలో నీరంతా తాగు. ఆ తరువాత ఆకాశాన్ని మేఘాల రూపంలో దట్టంగా ఆక్రమించు. పరమాత్మ మేని ఛాయలా ఆకాశం నల్లబడాలి. బలమైన భుజాలు ఉన్న నారాయణుడి చేతిలోని ఆయుధాల్లా ప్రకాశిస్తూ, పాంచజన్యం గర్జించినట్టు ఉరుములతో ధ్వనించాలి. ఆయన చేతిలోని శార్ఙ్గం నుంచి వెలువడే బాణాల పరంపరలా భూమి మీద వర్షధారలు కురవాలి. ఆ ధారల్లో మేమందరం మార్గశిర స్నానాలు చేసి ఆనందించాలి" అని వరుణుణ్ణి గోదాదేవి ఆహ్వానిస్తోంది.

• ఎ.సీతారామారావు

బ్యూటీ



# వీటిని మరవొద్దు...

చర్మాన్ని అందంగా, ఆరోగ్యంగా ఉంచుకునేందుకు జాగ్రత్తలు తీసుకుంటారు. కానీ చెవి వెనుక భాగం, మాడు, నాలుక, పాదాల అడుగుభాగం మీద అంతగా దృష్టి పెట్టరు. 'దీంతో ఆయా భాగాల్లో ఇన్‌ఫెక్షన్లు సోకి సమస్యలు వస్తాయి' అంటున్నారు బ్యూటీ నిపుణులు. అలా జరగకుండా ఉండాలంటే..

**చెవుల వెనుక భాగం:** స్నానం చేసేటప్పుడు, ముఖం కడుక్కునేటప్పుడు కొందరు చెవి వెనుక సరిగా శుభ్రం చేసుకోరు. దాంతో ఈ భాగంలో బ్యాక్టీరియా చేరుతుంది. చెవి లోపలే కాదు చెవి వెనుక కూడా పరిశుభ్రత ముఖ్యం.

**మెడ వెనుక:** పొడవైన కురులు ఉన్న మహిళలు మెడ పరిశుభ్రత మీద అంతగా మనసు పెట్టరు. దాంతో మెడ వెనుక భాగంలో బ్యాక్టీరియా చేరుతుంది. అందుకే లూఫాతో మెడ వెనుక రుద్దుకోవడం మర్చిపోవద్దు.

**పాదాల అడుగు భాగం:** పాదాలకు చెమట ఎక్కువ పట్టినప్పుడు శుభ్రంగా కడుక్కోవాలి. ప్యూమిస్ స్టోన్‌తో పాదాల అడుగు భాగంలో రుద్దుకుంటే మృతకణాలు తొలగి పాదాలు అందంగా, ఆరోగ్యంగా కనిపిస్తాయి.

**మాడు:** వెంట్రుకలు పొడుగ్గా, ఆరోగ్యంగా పెరగాలంటే మాడు శుభ్రంగా ఉండాలి. అలాగనీ మాడును రోజూ శుభ్రం చేసుకోవద్దు. వారంలో ఒకసారైనా మాడుకు నూనెతో మసాజ్ చేస్తే మృతకణాలు తొలగిపోతాయి. దాంతో దురద, పేలు వంటి సమస్యలు తగ్గుతాయి.

**వీపు:** చేతులు సరిగా అందకపోవడం వల్ల స్నానం చేసేటప్పుడు వీపు భాగాన్ని రుద్దుకోవడం సాధ్యపడదు. అలాంటప్పుడు బ్యాక్ స్క్రబ్బర్ లేదా లూఫాతో వీపు రుద్దుకోవాలి. దీంతో ఇన్‌ఫెక్షన్లు చాలావరకూ తగ్గిపోతాయి.

**నాలుక:** దంతాలు, చిగుళ్లతో పాటు నాలుక శుభ్రత కూడా ముఖ్యమే. టంగ్ క్లీనర్ వాడితే నాలుక మీది పాచి పూర్తిగా వదులుతుంది.

శ్రీ శక్తి



**ఆహారం, ఆరోగ్యం వంటి విషయాలపై అందరిలో ఆసక్తితో పాటు అవగాహన బాగా పెరుగుతోంది. అయితే ఎవరికి వారుగా నచ్చిన డైట్ తీసుకోకుండా... ఏ ఫుడ్ అవసరం, ఎంత ఫుడ్ అవసరం వంటి విషయాలను నిపుణులతో చర్చించి తీసుకుంటే ఆరోగ్యానికి ఢోకా ఉండదు. పిల్లలు, మహిళలు, నడి వయస్కులు, వృద్ధులు... ఇలా అందరికీ ఆరోగ్య సలహాలు అందించే 'నరిష్ వెల్' యాప్‌ను రూపొందించారు చందనా మల్లు. ఈ యాప్ ద్వారా ఆరోగ్యవంతమైన ఆహారస్పృహను పెంచడంతోపాటు వెల్‌నెస్‌కు కృషి చేస్తున్నారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...**

# ఆరోగ్యం... 'యాప్' దూరంలో!

"మాది హైదరాబాద్. నాన్న ఆర్టీసీలో ఉద్యోగం చేసి రిటైరయ్యారు. అమ్మ ప్రభుత్వ పాఠశాలలో టీచరుగా పనిచేశారు. కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ చేశా. తర్వాత ముంబయ్ ఐఐటీలో బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సు చేశా. పది సంవత్సరాలు పలు సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగం చేశా. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా ఒక ఏడాది యు.ఎస్‌లో, ఒక ఏడాది యు.కెలో ఉన్నా. అయితే చిన్నతనం నుంచీ సొంతంగా ఏదైనా బిజినెస్ అది కూడా సమాజానికి ఉపయోగపడేది చేయాలనే కోరిక బలంగా ఉండేది.

**వ్యాపార నేపథ్యం లేదు...**

బిజినెస్ చేయాలనే ఆలోచన నాకు ఎలా కలిగిందో తెలియదు. మా ఇంట్లో ఎవరికీ వ్యాపార నేపథ్యం లేదు. నా ఆలోచనకు ఒక రూపు ఇచ్చేముందు 'అందరికీ అత్యంత అవసరమైంది ఏంట'ని ఆలోచించా. సాధారణంగా ఆరోగ్యసమస్యలు అందరినీ వేధిస్తాయి. ఆధునిక జీవనశైలికి సంబంధించిన వ్యాధుల (లైఫ్‌స్టయిల్ డిసీజెస్)పై దృష్టి సారించా. వివిధ కుటుంబ ఆరోగ్య సర్వేల్లో కూడా నూటికి 70 శాతం మంది రక్తపోటు, మధుమేహం, ఊబకాయం, గుండెపోటు వంటి లైఫ్‌స్టయిల్ వ్యాధులతో అర్థాయుష్కులవుతున్నారని వెల్లడైంది. రోజూ వ్యాయామం చేయకపోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోకపోవడం వంటివి ఈ ఆధునిక ఆరోగ్య సమస్యలకు కారణాలు. అయితే ఈ వ్యాధులను నివారించే శక్తి మన చేతుల్లోనే ఉంది. 'దీనికి ఏం చేయగలం?' అనే ఆలోచన నన్ను వెంటాడింది. ఎందుకంటే అంటువ్యాధుల కన్నా జీవనశైలి వల్ల వస్తున్న వ్యాధులు ఇటీవల ఎక్కువయ్యాయి. గాలి, నీరు, వాతావరణం, వేగవంతమైన జీవితం వంటి వాటిని మార్చలేం. ఆహారం ఒక్కటే మన చేతుల్లో ఉంది. 'అదే మనం మార్చుకోగలిగింది' అనిపించింది. ఆహారం ద్వారా జీవనశైలి జబ్బులను ఎలా నియంత్రించవచ్చో ప్రజలకు తెలియజెప్పడంతోపాటు, ఆరోగ్యకరమైన ఆహారంపై అవగాహన పెంపొందించాలనుకున్నా. అలా 2017లో 'నరిష్ వెల్' పేరుతో ఒక యాప్‌కి శ్రీకారం చుట్టా.

**సమస్యను అర్థం చేసుకుని...**

ఈ రోజుల్లో చాలామందిలో ఆరోగ్యకర ఆహార అలవాట్లు లోపిస్తున్నాయి. ఆధునిక జీవనశైలి ఇందుకు కారణం. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ జంక్ ఫుడ్ విపరీతంగా తింటున్నారు. చివరకు పరిస్థితి ఎలా తయారైందంటే... పిల్లలు చదువుకోవాలన్నా, అన్నం తినాలన్నా జంక్ ఫుడ్ కావాల్సిందేనని మారాం చేస్తున్నారు. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగం చేస్తుండటంతో పిల్లలు అడిగిన ఫుడ్ కాదనకుండా కొనిపెడుతున్నారు. మరోవైపు మనదేశంలో పోషకాహారలోపంతో బాధపడుతున్నవారి సంఖ్య 35 శాతం ఉందని సర్వేలు వెల్లడిస్తున్నాయి. పిల్లలు వయసుకు తగ్గ బరువు, పొడుగు ఉండడం లేదు. మహిళల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటోంది. ఈ సమస్యలను ప్రారంభంలోనే పరిష్కరించుకోకుండా తీవ్ర రూపం దాల్చిన తర్వాత వైద్యులను ఆశ్రయిస్తున్నారు.



మనకు వచ్చే చాలా వ్యాధులను ఆహారంలో చిన్న మార్పులు చేస్తూ వాటిని క్రమం తప్పకుండా పాటించడం ద్వారా పరిష్కరించుకోవచ్చు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లలోని ఈ గ్యాప్‌ను గమనించే ఆరోగ్య సేవల రంగంలో దిగాలని నిర్ణయించుకున్నా. అలా 'నరిష్ వెల్' యాప్ మొదలెట్టా.

Nourishwel

**డైట్ ముఖ్యం...**

మేము ఈ 'యాప్'ను రూపొందించే ముందు మార్కెట్‌లో ఆహారపు అలవాట్లు, దాని ప్రభావానికి సంబంధించిన అంశాలపై సర్వే చేశాం. పిల్లల్లో ఊబకాయం సమస్య బాగా ఉంటోంది. అలాగే రోగనిరోధకశక్తి కూడా వారిలో తక్కువగా ఉంటోంది. అనారోగ్య సమస్యలకు వాతావరణ కాలుష్యం వంటివే కాదు మనం తీసుకునే ఆహారం కూడా ఒక ముఖ్య కారణం. ప్రజల్లో ఆరోగ్యస్పృహ పెరిగింది కానీ డైట్ పరంగా శాస్త్రీయ అవగాహన ఉండడం లేదు. ముఖ్యంగా అమ్మాయిలు ఎక్కువగా పీసీఓడీ (పాలీసిస్టిక్ ఒవేరియన్ డిసీజ్) సమస్యతో బాధపడుతున్నారు. హార్మోన్ల అసమతౌల్యతతో బరువు పెరుగుతున్నారు. ఈ సమస్య నివారణకు కేవలం బరువు తగ్గితే సరిపోదు. పీసీఓడీ సమస్యను దాదాపుగా ఫుడ్‌తోనే సరిచేసుకోవచ్చు. డైట్‌తో దీని నివారణ సాధ్యమవుతుంది. అలాగే 25 నుంచి 40 సంవత్సరాల వయసు వారికి థైరాయిడ్ సమస్య వస్తోంది. పురుషుల్లో సైతం థైరాయిడ్ సమస్య ఇటీవల ఎక్కువైంది. వీటితోపాటు బీపీ, డయాబెటిస్, కొలెస్ట్రాల్ సమస్యలు పెరుగుతున్నాయి. ఆధునిక ఆహారపు అలవాట్ల వల్ల చాలామంది ఎదుర్కొంటున్న మరో ప్రధాన సమస్య ఎసిడిటీ. అలాగే సీనియర్ సిటిజన్స్, మధ్యవయస్కులు ఆర్థ్రైటిస్, మోకాళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులు, వెన్నునొప్పి వంటి సమస్యలతో బాధపడుతున్నారు. నిజానికి ఒళ్లు నొప్పులు తగ్గాలంటే యాంటీఇన్‌ఫ్లమేటరీ ఫుడ్, కాల్షియం సప్లిమెంట్స్ తీసుకోవాలి. ఇలాంటి ఎన్నో విస్తృత పరిశోధనల అనంతరం 'నరిష్ వెల్' యాప్ తీసుకొచ్చాం.

> **ఎవరైనా సరే 'యాప్' ద్వారా వారి వారి సమస్యలను బట్టి డైటీషియన్లను ఎంపికచేసుకోవచ్చు. వారిని యాప్ ద్వారా సంప్రదించవచ్చు. వాళ్లు మీ ఆహారపు అలవాట్లు, ఎలాంటి ఫుడ్ తింటే సమస్యలు వస్తున్నాయి వంటివి అడిగి తెలుసుకుంటారు. మీకు డైట్ టైమ్ టేబుల్ ఇస్తారు.**

**'యాప్'తో డైట్ టైమ్ టేబుల్...**

సమర్థులైన, అనుభవజ్ఞులైన డైటీషియన్లు మా దగ్గర 35 మంది ఉన్నారు. ఎవరైనా సరే 'యాప్' ద్వారా వారి వారి సమస్యలను బట్టి డైటీషియన్లను ఎంపికచేసుకోవచ్చు. వారిని యాప్ ద్వారా సంప్రదించవచ్చు. మీరు తీసుకునే ఫుడ్ వివరాలను యాప్‌లో సూచించాలి. మీరు సంప్రదించిన డైటీషియన్ ఏ వేళల్లో అందుబాటులో ఉంటారో గమనించి వాటిల్లో మీకు అనువైన సమయం క్లిక్ చేయాలి. వీడియో కాల్‌తో అపాయింట్‌మెంట్ ఫిక్స్ అవుతుంది. వాళ్లు మీ ఆహారపు అలవాట్లు, మీకు ఆహారం విషయంలో ఉన్న పరిమితులు, ఫుడ్ తినే వేళలు, ఎలాంటి ఫుడ్ తింటే సమస్యలు వస్తున్నాయి వంటివి అడిగి తెలుసుకుంటారు. ఏం తినాలో డైట్ టైమ్ టేబుల్ ఇస్తారు. మా వినియోగదారుల్లో అన్ని వయసుల వాళ్లూ ఉన్నారు. కానీ మగవాళ్లతో పోలిస్తే మహిళల సంఖ్య తక్కువగా ఉంటోంది. పిల్లలకు ఎలాంటి డైట్ పెట్టాలని చాలామంది క్లయింట్లు అడుగుతున్నారు. మధ్యవయస్కులు, టీనేజర్లు ఎక్కువగా డైట్‌ప్లాన్‌పై ఆసక్తి చూపుతున్నారు. అలాగే మధుమేహం ప్రారంభదశలో ఉన్నవాళ్లు మమ్మల్ని ఎక్కువగా సంప్రదిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో సేవలు అందిస్తున్నాం. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా అందరికీ ఆరోగ్యకర ఆహార సేవలను అందించాలనేది మా లక్ష్యం. మా సేవలకు వినియోగదారుల నుంచి మంచి స్పందన వస్తోంది. యాప్ ద్వారా డైటీషియన్‌కు చెల్లించే సొమ్ములోనే మా ఫీజు కూడా ఉంటుంది. ప్రారంభ పెట్టుబడిగా పదిలక్షల రూపాయలు పెట్టాం. రెండేళ్లు అవుతోంది కాబట్టి ప్రస్తుతం లాభాల గురించి ఆలోచించడం లేదు. ఒకసారి యాప్ స్ట్రీమ్‌లైన్ అయితే మంచి భవిష్యత్తు ఉంటుందనే నమ్మకం ఉంది. ఇప్పటికే దుబాయ్, ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి వినియోగదారులు సంప్రదిస్తున్నారు. ఇటీవల కాలంలో మిల్లెట్ డైట్, కీటో డైట్ వంటివి వచ్చాయి. మైండ్‌ఫుల్ ఈటింగ్‌కి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇలా డైట్ విషయంలో వస్తున్న కొత్త కొత్త మార్పులను అవగాహన చేసుకోవడానికి 'నరిష్ వెల్' యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. డైట్ పరంగా చూస్తే శాస్త్రీయంగా ఆలోచించడానికి సంబంధించి మార్కెట్‌లో పెద్ద గ్యాప్ ఉంది. అది పూరించే ప్రయత్నంలో మేమున్నాం."

• నాగసుందరి
ఫొటోలు: అశోకుడు

ఫ్యామిలీ కౌన్సెలింగ్

# బయటకు వెళ్లడం లేదు... భయపడుతోంది!



నా వయసు 40 సంవత్సరాలు. పీజీ చదివినా ఉద్యోగం చేయడం లేదు. నాకు 18 ఏళ్ల అమ్మాయి ఉంది. చిన్నప్పటి నుంచీ నాకు ధైర్యం ఎక్కువని అందరూ అంటూ ఉండేవారు. మా ఇంట్లో కూడా ఆడపిల్ల అనే వివక్ష ఏమీ లేదు. ఎవరు తప్పు చేసినా నిలదీసేదాన్ని. తప్పుగా ప్రవర్తించే అబ్బాయిల చెంప పగలగొట్టేదాన్ని. అమ్మవాళ్లు జాగ్రత్తగా ఉండమనేవారు కానీ ఎప్పుడూ నన్ను నియంత్రించలేదు. మావారు కూడా నా ఆలోచనలకు ఎప్పుడూ మద్దతు ఇచ్చేవారు. అందుకే నేను మా అమ్మాయినీ స్వేచ్ఛగా పెంచాను. అందరితోనూ స్నేహంగా ఉండటాన్ని ప్రోత్సహించాను. మంచీ చెడూ వివరిస్తూ ఉంటాను. ఆటలతో పాటు ఆత్మరక్షణ విద్యలూ నేర్పించాను. అయితే ఈమధ్య మా అమ్మాయి ఎవరితోనూ కలవలేకపోతోంది. దేనికో భయపడుతున్నట్టుగా ఉంటూ, బయటకు వెళ్లడం లేదు. ఆరా తీస్తే ఇటీవలకాలంలో అమ్మాయిలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు కారణమని తెలిసింది. మా అమ్మాయిలో ధైర్యం నింపి, ఇదివరకులా ఉండాలంటే నేనేం చేయాలి?

-గిరిజ

చిన్నపాటి సమస్యకైనా తీవ్రంగా స్పందించే వయసు మీ అమ్మాయిది. అయితే మీలాంటి తల్లి ఉండటం ఆమె అదృష్టం. మిమ్మల్ని మీ తల్లిదండ్రులు, అలాగే మీరు మీ అమ్మాయిని పెంచిన తీరు అభినందనీయం. ఆధునికతకు- అసభ్యతకు, స్వేచ్ఛకు-విశృంఖలత్వానికి తేడా తెలియని రోజులివి. ఒకప్పుడు ధూమపానం, మద్యపానం దురలవాట్లుగా ఉండేవి. ఇప్పుడు అవి ఒక కల్చర్‌గా మారాయి. స్నేహంలో పరిమితులు లేవు. మనం గుర్తుంచుకోవాల్సింది దేనికైనా పరిమితి ఉంటుందని. స్వీయ నియంత్రణ అనేది చిన్ననాటి నుంచే అలవాటు కావాలి. అప్పుడే బాధ్యత, భయం గురించి చెప్పకుండానే తెలిసివస్తాయి. అలాగే సందర్భాన్నిబట్టి ప్రవర్తించడం, నిర్ణయాలు తీసుకోవడం కూడా. ఇలాంటి విషయాల్లో తల్లిదండ్రులే రోల్‌మోడల్స్. పిల్లలు వారిని చూస్తూ పెరుగుతారు కాబట్టి తల్లిదండ్రులు ఈ విషయం గుర్తుంచుకోవాలి. మీ అమ్మాయికి అవసరమైన విద్యలన్నీ మీరు నేర్పారు. సమాజంలో జరిగే నేరాలకు భయపడకుండా ఉండడం ఎలాగో కూడా మీరే చెప్పాలి. అవసరమైతే అమ్మాయి స్నేహితులతో కూర్చుని చర్చించండి. ఏదో జరుగుతుందని భయపడుతూ ఇంట్లో కూర్చోవడం కన్నా ఎదుర్కోవడం ఎలాగో తెలుసుకోవడం మంచిది కదా! మీరు ఆ దశను దాటి వచ్చారు కాబట్టి మీరే బాగా చెప్పగలరు కూడా. మీ అమ్మాయి ఆందోళన తాత్కాలికమే. గాభరా పడకండి.

• కె.శోభ
ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్
shobhas292@gmail.com

అవగాహన

# బ్రేక్‌ఫాస్ట్ బెస్ట్!



చదివినవి ఏవీ జ్ఞాపకం పెట్టుకోవడం లేదని కొంతమంది తల్లిదండ్రులు పిల్లల పట్ల అసహనాన్ని వ్యక్తం చేస్తుంటారు. దానికి అశ్రద్ధ, నిర్లక్ష్యమే కారణం అనుకుంటారు. కానీ కొన్నిసార్లు పిల్లల శరీర పోషణలోని లోపాలు కూడా కారణం అవుతాయి. ప్రత్యేకించి బ్రేక్‌ఫాస్ట్ చేయకపోవడం వల్ల కొంత మంది పిల్లల్లో ఈ పరిస్థితి తలెత్తవచ్చు. పిల్లలు అంతకుముందు రాత్రి ఏడెనిమిది గంటలకు తిని ఉంటే, ఉదయానికి 12 గంటలు గడిచిపోయి ఉంటాయి. అంటే ఏమిటి? రక్తంలోని గ్లూకోజు నిల్వలు అప్పటికే బాగా పడిపోతాయి. మెదడు సరిగా పనిచేయాలంటే, అవసరమైనంత గ్లూకోజ్ అందాలి కదా! ఫలితంగా, టీచర్లు చెప్పినవి గానీ, చదివినవి గానీ వారి మెదడులో ఎంతోసేపు నిలవవు. అందుకే బ్రేక్‌ఫాస్ట్ అనేది లంచ్, డిన్నర్ కన్నా ముఖ్యం. పిల్లల తెలివి తేటలపైనా, వాళ్ల జ్ఞాపకశక్తిపైనా ప్రభావం చూపేది అల్పాహారమే.

## ముత్యాల ముగ్గు



19 x 19 చుక్కలు



మద్దుల పద్మావతి
కొత్తపేట, తెనాలి



23 చుక్కలు
9 వరుసలు
9 వరకు
సరిచుక్కలు



బి. విజయలక్ష్మి
కర్నూలు



15 నుంచి 8
మధ్య చుక్కలు

ఇందు నటరాజన్
వరంగల్



19 చుక్కలు
19 వరుసలు



గోకవరపు సుహాసిని
మచిలీపట్నం

మీ ముత్యాల ముగ్గుతో పాటు మీ ఫొటో, పోస్టల్ అడ్రస్, ఫోన్ నంబర్ కూడా వివరంగా రాయండి.
మా చిరునామా... నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033. Email: navya@andhrajyothy.com




# నాకు చిరంజీవి చాలా క్లోజ్... 'వెంకీమామ' పాతికేళ్లుగా తెలుసు!

**- సల్మాన్ ఖాన్**


రామ్‌చరణ్, సల్మాన్ ఖాన్, వెంకటేశ్

"రామ్‌చరణ్ చిన్నప్పటి నుండి నాకు తెలుసు. చాలా సన్నిహితుడు. చిన్న తమ్ముడిలాంటి వాడు. చిరంజీవిగారు కూడా నాకు చాలా క్లోజ్. 'వెంకీమామ' పాతికేళ్లుగా తెలుసు. మంచి ఫ్రెండ్" అని సల్మాన్ ఖాన్ అన్నారు. ఆయన హీరోగా, సుదీప్ విలన్‌గా ప్రభుదేవా దర్శకత్వంలో రూపొందిన 'దబంగ్ 3' శుక్రవారం తెలుగులోనూ విడుదలవుతోంది. హైదరాబాద్‌లో బుధవారం సాయంత్రం ప్రీరిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. వెంకటేశ్, రామ్‌చరణ్ అతిథులుగా హాజరయ్యారు. "సల్మాన్ భాయ్ 'డ్రస్ వేస్తే పోలీస్... తీసేస్తే గూండా' అని చెప్పే డైలాగ్ మామూలుగా లేదు. తెలుగులో ఈ సినిమా విడుదలవుతుండటం చాలా ఆనందంగా ఉంది. మీరంతా ఆయన్ను ఎంత ప్రేమిస్తారో... సినిమానూ చూసి అంతే సూపర్ డూపర్ హిట్ చేస్తారని నమ్ముతున్నా" అని వెంకటేశ్ అన్నారు. "సల్మాన్ భాయ్‌పై నాకున్న ప్రేమను చెప్పడానికి కొన్ని మాటలు చాలవు. సూపర్‌స్టార్స్ సల్మాన్, వెంకటేశ్, సుదీప్, చిరంజీవి నుండి నేను నేర్చుకున్నది నటనో, డైలాగులు చెప్పడమో కాదు... క్రమశిక్షణ" అని రామ్‌చరణ్ అన్నారు. "హైదరాబాద్ రావడం చాలా సంతోషంగా ఉంది. ఇక్కడ నా హిందీ సినిమాలు విడుదలైనప్పుడు చాలా మంది స్పందన లభిస్తుంటుంది. అందుకని, మీకిష్టమైన 'దబంగ్ 3'ను తెలుగులోనూ విడుదల చేయాలనుకున్నాం. చేస్తున్నాం. ప్రేక్షకులందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నా" అని సల్మాన్ అన్నారు. "తెలుగు సినిమాలా 'దబంగ్ 3' మాసీగా ఉంటుంది" అని ప్రభుదేవా అన్నారు. "సల్మాన్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. 'దబంగ్ 3' తెలుగు చిత్రంలా ఉంటుంది" అని సుదీప్ అన్నారు. "జీవితంలో కండలు పెంచాలన్న కోరిక తీరకపోయినా... కండల వీరుడికి పాట రాసే అవకాశం రావడం అదృష్టం భావిస్తున్నా. కండల వెనకున్న గుండెల్లోంచి పుట్టే ప్రేమ పాటలు రెండు రాశా" అని అనంత శ్రీరామ్ అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రనాయికలు సోనాక్షీ సిన్హా, సయీ మంజ్రేకర్, గేయ రచయిత రామజోగయ్య శాస్త్రి, 'ఏషియన్' సునీల్ నారంగ్, 'సురేశ్ ప్రొడక్షన్స్' జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది పచ్చడి లాంటి చిత్రమిది!

**- సాయి తేజ్**



**"అన్ని రకాల భావోద్వేగాలున్న ఉగాది పచ్చడిలాంటి చిత్రమిది. నిజ జీవితంలో మనకు తారసపడే పాత్రలే చిత్రంలో కనిపిస్తాయి" అని సాయి తేజ్ అన్నారు. మారుతి దర్శకత్వంలో ఆయన హీరోగా నటించిన చిత్రం 'ప్రతిరోజూ పండగే'. 'బన్నీ' వాసు నిర్మాత. శుక్రవారం విడుదలవుతోంది. సాయితేజ్ చెప్పిన సంగతులు...**

- ఇదొక తాత, మనవడి కథ. ఐదు వారాల్లో తాతయ్య మరణిస్తాడని తెలిశాక... ఆయన్ను సంతోషంగా ఉంచడానికి మనవడు ఏం చేశాడన్నదే చిత్రకథ. తాత కోల్పోయినవి మనవడు తీరుస్తాడు. 'శతమానం భవతి'కి, మా చిత్రానికి పోలికలు లేవు. సున్నితమైన కథాంశాన్ని మారుతి సందేశం, వినోదం మేళవించి చెప్పారు. ఏయన్నార్‌గారికి క్యాన్సర్ అని తెలిశాక నాగార్జునగారు ఆయన్ను సంతోషంగా చూసుకున్నారు కదా!
- 'చిత్రలహరి'లో లావుగా ఉన్నా. దాదాపుగా 100 కిలోలు ఉండేవాణ్ణి. ఈ కథ విన్నాక రెండు నెలలు సమయం అడిగి బరువు తగ్గా. ఇప్పుడు 80 కిలోలకు వచ్చేశా. 'హోమం' సన్నివేశ నేపథ్యంలో వచ్చే ఫైట్‌లో సిక్స్‌ప్యాక్‌తో కనిపిస్తా. అందుకోసం, తిండిని కంట్రోల్‌లో పెట్టుకున్నా. గోదావరిలో రాజమండ్రి దగ్గర చిత్రీకరణ చేస్తున్నప్పుడు అభిమానులు పులస తీసుకొచ్చి ఇచ్చేవారు. (నవ్వుతూ) అందరూ తింటుంటే నేను చూస్తుండేవాణ్ణి.
- చిన్నతనంలో ఆదివారాలు, ఇప్పటికీ పండగలకు మా బంధువులంతా చిరంజీవిగారింటికి వెళతాం. 'ప్రతిరోజూ పండగే'లో డైనింగ్ టేబుల్ సీన్ చేసేటప్పుడు ఆ జ్ఞాపకాలు గుర్తొచ్చాయి. సీనియర్ నటీనటులతో పని చేయడంతో ఎంతో నేర్చుకున్నా.
- చిరంజీవిగారు ఈ కథ విన్నారు. ఆయనకు నచ్చింది. 'నాకు చెప్పినట్టు తీశారో? లేదో? నువ్వెలా చేశావో? చూస్తా' అన్నారు. మెగా ఇమేజ్ నాకు మైనస్ అనుకోను. చిరంజీవి ఇంటి నుండి రావడం అదృష్టంగా భావిస్తా. పరాజయాల నుండి పాఠాలు నేర్చుకున్నా. ఇప్పుడు కథ ఎంపికలో జాగ్రత్త వహిస్తున్నా. నేను చెప్పిన మార్పులు చేస్తున్నారో? లేదో? చూసుకుంటున్నా.
- పవన్‌కల్యాణ్ రీఎంట్రీ గురించి మీకెంత తెలుసో... నాకు అంతే తెలుసు. మంచి కథ వస్తే వరుణ్‌తేజ్‌తో, రవితేజగారితో సినిమాలు చేస్తా. మేం కలిసి సినిమా చేసే విషయమై మాట్లాడుకుంటాం. తమ్ముడు వైష్ణవ్‌తేజ్ బాలనటుడిగా మూడు చిత్రాలు చేశాడు. నటనలో నాకంటే సీనియర్. 'ఉప్పెన' విషయంలో నేను వాడికి సలహాలు ఇవ్వడం లేదు.


జీఆర్ కృష్ణ, రాజ్‌తరుణ్, 'దిల్' రాజు

## బరువెక్కిన గుండెతో బయటకొస్తారు!

**- 'దిల్' రాజు**

"మంచి కథ, భావోద్వేగాలతో రూపొందిన చిత్రమిది. సినిమా చూశాక... ప్రేక్షకులు బరువెక్కిన గుండెతో బయటకొస్తారు. వాళ్లకు కొన్ని మాటలు, సన్నివేశాలు గుర్తుంటాయి. పాటలు, నేపథ్య సంగీతాన్ని ఎంజాయ్ చేస్తారు" అని 'దిల్' రాజు అన్నారు. రాజ్ తరుణ్, శాలినీ పాండే జంటగా శిరీష్ నిర్మించిన చిత్రం 'ఇద్దరి లోకం ఒకటే'. జీఆర్ కృష్ణ దర్శకుడు. మిక్కీ జే. మేయర్ స్వరకర్త. ఈ నెల 25న విడుదల కానున్న ఈ సినిమా ట్రైలర్‌ను మంగళవారం విడుదల చేశారు. "అభినందన', 'నీరాజనం' తరహా స్వచ్ఛమైన ప్రేమకథా చిత్రమిది" అని బెక్కం వేణుగోపాల్ అన్నారు. "బడ్జెట్ పరిధిలో 47 రోజుల్లో చిత్రాన్ని పూర్తి చేశాం" అని దర్శకుడు అన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత అబ్బూరి రవి, రాజ్ తరుణ్ పాల్గొన్నారు.

### విజయ్ దేవరకొండతో...

విజయ్ దేవరకొండ హీరోగా 'నిన్ను కోరి', 'మజిలీ' ఫేమ్ శివ నిర్వాణ దర్శకత్వంలో 'దిల్' రాజు ఓ చిత్రాన్ని నిర్మించనున్నారు. బుధవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రకటించారు. "రాజుగారికి పుట్టినరోజు శుభాకాంక్షలు. బ్లాక్‌బస్టర్ గిఫ్ట్ లోడింగ్" అని విజయ్ దేవరకొండ ట్వీట్ చేశారు. వచ్చే ఏడాది ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది.




VIACOM 18 STUDIOS
Parallel Minds
రేపే విడుదల
AKSHAYASRI PRESENTS
HM HARSHITHA MOVIES
KARTHI JYOTIKA SATHYARAJ
దొంగ
A JEETHU JOSEPH FILM
RAVURI. V. SRINIVAS


SKF
రేపే విడుదల
ఆటకైనా వేటకైనా రెడీ
దబంగ్ 3
దర్శకత్వం: ప్రభుదేవా
నిర్మాతలు: సల్మాన్ ఖాన్, అర్బాజ్ ఖాన్, నిఖిల్ ద్వివేది


MSK
Master Preetham Reddy Presents
Rahul Movie Makers
DECEMBER 27th RELEASE
గెలుపు గెస్ట్ లాంటిది.
కాని ఓటమి ఫ్రెండ్ లాంటిది
అలాంటి ఓటమికి
రెస్పెక్ట్ ఇద్దాం ఫ్రెండ్స్ !
స్టూడెంట్ OF THE YEAR
Producer: B.Obul Subba Reddy Director: J.Karuna Kumar


BLOCKBUSTER FAMILY ENTERTAINER
SURESH PRODUCTIONS PVT. LTD.
people MEDIA FACTORY
VENKY మామ
K.S. RAVINDRA (BOBBY)
D.SURESH BABU T.G.VISHWA PRASAD
THAMAN S
VIVEK KUCHIBHOTLA
PRASAD MURELLA
వెంకి మామ
UA


ఉదయం గం|| 8:33 ని||ల ఆటతో
రేపే విడుదల
CK సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ (ప్రై.) లిమిటెడ్ సమర్పించు
హ్యాపీ మూవీస్
NANDAMURI BALAKRISHNA
రూలర్
POLICE
సి. కళ్యాణ్ కె. యస్. రవికుమార్
సి. వెంకటేశ్వరరావు - పత్స నాగరాజా చిరంతన్ భట్
సి. రాంప్రసాద్ పరుచూరి మురళి చిన్నా జాన్ అబ్రహం రామ్-లక్ష్మణ్ అన్‌బరివు వంశీ శేఖర్
ADITYA MUSIC
U/A

ప్రపంచంలోని అతి పెద్ద బొగ్గు ఉత్పాదక సంస్థల్లో కోల్ ఇండియా ఒకటి. మహారత్న హోదా ఉన్న ఈ కంపెనీలో ఇంజనీరింగ్ అభ్యర్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. గేట్ స్కోరు అవసరం లేకుండానే ఈసారి మేనేజ్‌మెంట్ ట్రెయినీ ఖాళీల భర్తీకి కోల్ ఇండియా భారీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది అభ్యర్థులకు కలిసొచ్చే అంశం. సంస్థ నిర్వహించే ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగానే ఎంపిక ఉంటుంది. ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం కోల్ ఇండియాలో 2.85 లక్షలకుపైగా ఉద్యోగులు ఉన్నారు. ఇంత పెద్ద సంస్థలో కెరీర్ ప్రారంభించడానికి చక్కని అవకాశం వచ్చింది. ఆ వివరాలు తెలుసుకుందాం..



**ఖాళీలు:**
**1326**

**బ్రాంచ్‌ల వారీగా ఖాళీలు:**
మైనింగ్ - 288, ఎలక్ట్రికల్ - 218, మెకానికల్ - 258, సివిల్ - 68, కోల్ ఆపరేషన్స్ - 28, సిస్టమ్స్ - 46, మెటీరియల్స్ మేనేజ్‌మెంట్ - 28, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ - 254, పర్సనల్ అండ్ హెచ్ఆర్ - 89, మార్కెటింగ్ అండ్ సేల్స్ - 23, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ - 26.

# కోల్ ఇండియాలో కొలువుల మేళా

ప్రస్తుత నోటిఫికేషన్ ద్వారా కోల్ ఇండియా మొత్తం 1326 మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టులను భర్తీ చేయనుంది. ఇందులో 11 విభాగాలకు చెందిన ఉద్యోగాలు ఉన్నాయి. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కేంద్రం కల్పిస్తోన్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కూడా ఈ పోస్టులకు ఈ కేటగిరీకి 132 పోస్టులను కేటాయించారు.

## అర్హతలు

- **మైనింగ్ / ఎలక్ట్రికల్ / మెకానికల్ / సివిల్ / కోల్ ఆపరేషన్:** ఈ విభాగంలోని పోస్టులకు కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత లేదా అనుబంధ బ్రాంచ్‌లతో బీఈ / బీటెక్ / బీఎస్సీ (ఇంజనీరింగ్)
- **సిస్టమ్స్:** కనీసం 60 శాతం మార్కులతో కంప్యూటర్ సైన్స్ / ఐటీ బ్రాంచ్‌లతో బీఈ / బీటెక్ / బీఎస్సీ (ఇంజనీరింగ్) లేదా 60 శాతం మార్కులతో ఎంసీఏ
- **మెటీరియల్స్ మేనేజ్‌మెంట్:** కనీసం 60 శాతం మార్కులతో ఎలక్ట్రికల్ / మెకానికల్ బ్రాంచ్‌లతో ఇంజనీరింగ్ డిగ్రీతోపాటు 60 శాతం మార్కులతో ఎంబీఏ / పీజీడీఎం
- **ఫైనాన్స్ & అకౌంట్స్:** సీఏ / ఐసీడబ్ల్యూఏ
- **పర్సనల్ అండ్ హెచ్ఆర్:** కనీసం 60 శాతం మార్కులతో పీజీ / పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (హెచ్ఆర్ / ఇండస్ట్రియల్ రిలేషన్స్ / పర్సనల్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌గా) లేదా ఎంబీఏ లేదా ఎంఏ సోషల్ వర్క్ (హెచ్ఆర్ స్పెషలైజేషన్) లేదా మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రీసోర్స్ అండ్ ఆర్గనైజేషనల్ డెవలప్‌మెంట్ (ఎంహెచ్ఆర్ఓడీ)
- **మార్కెటింగ్ అండ్ సేల్స్:** కనీసం 60 శాతం మార్కులతో ఎంబీఏ / పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (మార్కెటింగ్ స్పెషలైజేషన్‌గా)
- **కమ్యూనిటీ డెవలప్‌మెంట్:** కనీసం 60 శాతం మార్కులతో పీజీ / పీజీ డిప్లొమా / పీజీ - సోషల్ వర్క్ (కమ్యూనిటీ డెవలప్‌మెంట్ / రూరల్ డెవలప్‌మెంట్ / కమ్యూనిటీ ఆర్గనైజేషన్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాక్టీస్ / అర్బన్ అండ్ రూరల్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ / రూరల్ అండ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ / డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ / రూరల్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌గా)
- **వయసు:** 30 ఏళ్లు (ఏప్రిల్ 1, 2020 నాటికి). నిబంధనల మేరకు రిజర్వ్‌డ్ అభ్యర్థులకు గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

## ఎంపిక ఇలా

ఎంపిక ప్రక్రియలో రాత పరీక్ష, ఇంటర్వ్యూ అనే రెండు దశలు ఉంటాయి. రాత పరీక్షలో అర్హత సాధించిన వారిని మాత్రమే ఇంటర్వ్యూకు పిలుస్తారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలలో చూపిన ప్రతిభ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది.



## విభాగాల వారీగా సన్నద్ధత

ఈ పరీక్షకు ఇంకా 2 నెలల వ్యవధి ఉన్నందున రోజుకు 6 నుంచి 8 గంటల సాధన అవసరం. పేపర్ 1, పేపర్ 2లకు సమాన ప్రాధాన్యం ఉన్నందున సమయాన్ని రెండు పేపర్లకూ సమానంగా కేటాయించుకోవటం మేలు.

- **జనరల్ అవేర్‌నెస్ / నాలెడ్జ్:** ప్రపంచవ్యాప్తంగా సామాజికంగా, రాజకీయంగా, శాస్త్ర - సాంకేతిక తదితర రంగాల్లో చోటు చేసుకుంటున్న పరిమాణాలపై అభ్యర్థుల అవగాహనను ఈ విభాగంలో పరీక్షిస్తారు. ఇందు కోసం ఇతర దేశాలతో భారత్ చేసుకుంటున్న ఒప్పందాలు, ప్రధాని పర్యటనలు, అవార్డులు, క్రీడలు, శాస్త్ర - సాంకేతిక పరిశోధనలు, ఎన్నికలు, ప్రభుత్వ విధానాల్లో మార్పులు, చట్టాలు, వార్తల్లో వ్యక్తులు, నియామకాలు, స్టాండర్డ్ జీకే అంశాలను సమగ్రంగా ఫాలో కావాలి. పరీక్ష తేదీకి ముందు 6 నుంచి 8 నెలల కాలంలో చోటు చేసుకున్న పరిణామాలు, బొగ్గు, మైనింగ్, విద్యుత్, ఇంధన రంగాల్లో ప్రభుత్వ విధానాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.

### రాత పరీక్షలో రెండు పేపర్లు

రాత పరీక్షను ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఆన్‌లైన్‌లో (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) రాయాల్సి ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు.. పేపర్-1, పేపర్-2 ఉంటాయి. ఈ రెండు పేపర్లను కూడా ఒకే రోజు ఒకటే సిట్టింగ్‌లో నిర్వహిస్తారు. వీటికి సమాధానాలను ఇవ్వడానికి మూడు గంటల (180 నిమిషాలు) సమయం ఇస్తారు. ప్రశ్నపత్రాన్ని ఇంగ్లీష్ / హిందీ భాషల్లో మాత్రమే రూపొందిస్తారు. ఎటువంటి నెగిటివ్ మార్కులు లేవు.

- **పేపర్-1:** ఈ పేపర్ అందరికీ ఉమ్మడిగా ఉంటుంది. ఏ విభాగంలోని పోస్టును ఎంచుకున్నప్పటికీ కూడా ఈ పేపర్‌ను రాయాల్సిందే. ఇందులో జనరల్ నాలెడ్జ్, జనరల్ అవేర్‌నెస్, జనరల్ ఇంగ్లీష్, న్యూమరికల్ ఎబిలిటీ, రీజనింగ్ అంశాల నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 100 మార్కులు కేటాయించారు.
- **పేపర్-2:** ఎంచుకున్న పోస్టు ఆధారంగా సంబంధిత విభాగంలో అభ్యర్థి పరిజ్ఞానాన్ని పరీక్షించడానికి ఈ పేపర్‌ను ఉద్దేశించారు. ఇందులో అభ్యర్థి సబ్జెక్ట్ ఆధారంగా 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 100 మార్కులు కేటాయించారు.
- రాత పరీక్షలో కనీస అర్హత మార్కులను నిర్దేశించారు. జనరల్ / ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 40 మార్కులు, ఓబీసీ (నాన్ క్రీమీలేయర్) 35 మార్కులు, ఎస్సీ / ఎస్టీ / దివ్యాంగులు 30 మార్కులను ప్రతి పేపర్‌లో సాధించాల్సి ఉంటుంది.

- **జనరల్ ఇంగ్లీష్:** ఈ విభాగం కోసం వొకాబ్యులరీ, సెంటెన్స్ కరెక్షన్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్స్, సెంటెన్స్ రీఎరేంజ్‌మెంట్, ఇడియమ్స్, కాంప్రెహెన్షన్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి. యాంటనిమ్స్, సినానిమ్స్ పదాల వినియోగం, వ్యాకరణంపై పట్టు పెంచుకుంటే అధిక మార్కులు పొందవచ్చు. వీలైనన్ని ఇంగ్లీష్ పదాల అర్థాలు, సందర్భోచిత ఉపయోగం తెలియాలి.
- **రీజనింగ్:** ఇది అభ్యర్థుల తార్కిక సామర్థ్యాన్ని పరీక్షించే విభాగం. ఇందులో వెర్బల్, నాన్ వెర్బల్, క్రిటికల్ థింకింగ్, సోషల్ ఇంటెలిజెన్స్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ సంబంధిత అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అనాలజీ, ప్రాబ్లమ్ సాల్వింగ్, బ్లడ్ రిలేషన్స్, రీజనింగ్, అర్థమెటిక్, నెంబర్ సిరీస్, కోడింగ్ - డీకోడింగ్, డేటా సఫిషియెన్సీ, డైరెక్షన్ సెన్స్, ర్యాంకింగ్స్, సీట్ అరేంజ్‌మెంట్స్, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రామ్స్, స్పేస్ విజువలైజేషన్, మ్యాచింగ్ వంటి టాపిక్స్‌పై దృష్టి సారించాలి. ఈ విభాగం కోసం బేసిక్ మ్యాథమెటిక్స్, అల్ఫాబెట్ టెస్ట్ అంశాలను బాగా ప్రాక్టీస్ చేయాలి.
- **న్యూమరికల్ ఎబిలిటీ:** ఈ విభాగాన్ని అభ్యర్థులు క్లిష్టమైందిగా భావిస్తారు. ఇందులో అర్థమెటిక్, మ్యాథమేటిక్స్, డేటా అనాలిసిస్ / డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇందులో భిన్నాలు, దశాంశాలు, శాతాలు, లాభ-నష్టాలు, నిష్పత్తి, డిస్కౌంట్, పార్ట్‌నర్‌షిప్, వ్యాపార గణితం (వడ్డీ), కాలం - దూరం, కాలం - పని, గ్రాఫ్స్, త్రిభుజాలు, సర్కిల్స్, స్తూపాలు, చతురస్రం, దీర్ఘచతురస్రం, పిరమిడ్, ఎత్తు-దూరం, కోణాలు, బార్-చార్ట్ డయాగ్రామ్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఈ విభాగంలో ఎక్కువ స్కోర్ చేయాలంటే టేబుల్స్, స్క్వేర్స్, క్యూబ్స్, స్క్వేర్ రూట్స్‌పై అవగాహన పెంచుకోవాలి. తద్వారా కాలిక్యులేషన్స్ సులభంగా చేయవచ్చు. ఫార్ములాలను గుర్తుంచుకోవాలి. ప్రాబ్లమ్ సాల్వింగ్‌కు షార్ట్‌కట్ మెథడ్స్‌ను ఉపయోగించడం నేర్చుకోవాలి. దీనివల్ల వేగం, కచ్చితత్వం అలవడతాయి. మాక్ టెస్ట్‌లు, పాత పేపర్ల ప్రాక్టీస్ తప్పనిసరి.
- **పేపర్-2:** ఇందులో ఆయా సబ్జెక్ట్‌లోని ప్రాథమిక భావనలను పరీక్షించే విధంగా ప్రశ్నల స్వరూపం ఉంటుంది. ఈ పేపర్‌లో మెరుగైన మార్కులు సాధించడానికి ప్రయత్నించాలి. ఏ అంశానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారో గుర్తించి తదనుగుణంగా సిద్ధం కావాలి. దీనికి గత సంవత్సర ప్రశ్నపత్రాలు, గేట్, ఐఈఎస్‌లలో అడిగిన సంబంధిత ప్రశ్నలు సాధన చేయడం ఎంతో మేలు.

### 1:3 నిష్పత్తిలో ఇంటర్వ్యూ

రాత పరీక్షలో నిర్దేశించిన విధంగా అర్హత సాధించినవారు రెండో దశలో ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉంటుంది. ఖాళీలు, రిజర్వేషన్ నిబంధనలను అనుసరించి 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఇంటర్వ్యూ తేదీ, ప్రదేశం సంబంధిత వివరాలను అభ్యర్థుల రిజిష్టర్డ్ మెయిల్‌కు పంపిస్తారు. ఇంటర్వ్యూకు 10 మార్కులు కేటాయించారు. ఇందులో అభ్యర్థి గుణగణాలను పరీక్షించడానికి ప్రాధాన్యం ఇస్తారు. ఇందుకోసం సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలు, క్లిష్ట సమయాల్లో ఎలా వ్యవహరిస్తారు, మేథో శక్తి తదితర అంశాలు అభ్యర్థిలో ఉన్నాయో లేవో పరిశీలిస్తారు. అంతేకాకుండా కోల్ ఇండియా, బొగ్గు రంగం ప్రాధాన్యం, మైనింగ్ రంగంలో ప్రభుత్వ విధానాలు, సామాజిక అభివృద్ధి తదితర అంశాలపై కూడా ప్రశ్నలు అడుగుతారు.

### పోస్టింగ్

చివరగా రాత పరీక్ష, ఇంటర్వ్యూ దశల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపిక జాబితాను రూపొందిస్తారు. ఎంపికయిన వారికి ఈ-2 గ్రేడ్ రూ. 50,000 - రూ.1,60,000 పేస్కేల్ కేటాయిస్తారు. మొదట్లో శిక్షణ కాలంలో నెలకు రూ. 50 వేలు చెల్లిస్తారు. శిక్షణ ఏడాదిపాటు సాగుతుంది. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్నవారికి ఈ-3 గ్రేడ్ హోదా ఇస్తారు. ఈ సమయంలో ఏడాదిపాటు ప్రొబేషన్ కాలం ఉంటుంది. ఈ సమయంలో రూ. 60,000 - రూ.1,80,000 పేస్కేల్ వర్తిస్తుంది. ప్రొబేషన్ మొదట్లో నెలకు రూ. 60,000 వేతనం అందుతుంది. వేతనానికి అదనంగా ఇతర అలవెన్సులు కూడా లభిస్తాయి. ఉద్యోగంలో చేరిన తేదీ నుంచి ఐదేళ్లపాటు (60 నెలలు) కోల్ ఇండియాలో పని చేస్తామని రూ. 3 లక్షల సర్వీస్ బాండ్‌ను సమర్పించాలి. ఎంపికయిన వారికి దేశవ్యాప్తంగా ఉన్న కార్యాలయాల్లో ఎక్కడైనా పోస్టింగ్ ఇస్తారు.

## ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తు ఫీజు: రూ. 1000 (ఎస్సీ / ఎస్టీ / దివ్యాంగులు / కోల్ ఇండియా, దాని అనుబంధ సంస్థల ఉద్యోగులకు ఫీజు మినహాయింపు ఇచ్చారు)
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 19, 2020.
- పరీక్ష తేదీలు: 2020, ఫిబ్రవరి 27, 28
- వెబ్‌సైట్: https://www.coalindia.in/

# జాబ్ కార్నర్

## మేనేజర్

సెంట్రల్ మెడికల్ సర్వీసెస్ సొసైటీ-న్యూఢిల్లీ, పలు పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

- మొత్తం ఖాళీలు: **13**
- పోస్టుల వారీగా ఖాళీలు: మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్) - 4, మేనేజర్ (క్వాలిటీ అస్యూరెన్స్) - 2, మేనేజర్ (లాజిస్టిక్స్ అండ్ సప్లయి చైన్) - 3, మేనేజర్ (ఫైనాన్స్) - 2, మేనేజర్ (అడ్మినిస్ట్రేషన్) - 1, మేనేజర్ (ఐటీ) - 1.
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 10, 2020
- వెబ్‌సైట్: www.cmss.gov.in

## అప్రెంటీస్

ఈస్ట్ కోస్ట్ రైల్వే - భువనేశ్వర్ (ఒడిషా), అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **1216**
- భర్తీ చేసే ట్రేడులు: ఫిట్టర్, వెల్డర్, మెషీనిస్ట్, మెకానిక్, ఎలక్ట్రీషియన్, టర్నర్, వైర్‌మెన్, ప్లంబర్, తదితరాలు.
- అర్హత: పదో తరగతి / తత్సమానం, సంబంధిత ట్రేడులో ఎన్‌సీవీటీ / ఎస్‌సీవీటీ సర్టిఫికెట్.
- ఎంపిక: అకడమిక్ ప్రతిభ ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 6, 2020.
- వెబ్‌సైట్: rrceastcoastrailway.in/

## జూనియర్ రీసెర్చ్ ఫెలో

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ), జూనియర్ రీసెర్చ్ ఫెలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- మొత్తం ఖాళీలు: **12**
- విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్, ఏరోనాటికల్ ఇంజనీరింగ్.
- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ / బీటెక్ / ఎంఈ / ఎంటెక్, గేట్ స్కోర్.
- ఎంపిక : కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ / రాతపరీక్ష ఆధారంగా.
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 5, 2020.
- వెబ్‌సైట్: https://www.drdo.gov.in/

## డేటా ఎంట్రీ ఆపరేటర్

బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) - న్యూఢిల్లీ, ఒప్పంద ప్రాతిపదికన డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు...

- మొత్తం ఖాళీలు: **50**
- అర్హత: ఇంటర్మీడియట్, గ్రాడ్యుయేషన్.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 7, 2020.
- వెబ్‌సైట్: https://www.becil.com/

### ఇలా చేయండి!

## భలే గాలి తుపాకీ!



**కావలసినవి**

- 15 సెం.మీ పొడవు గాజు లేదా లోహపు గొట్టం,
- బంగాళదుంప,
- పెన్సిల్.

బంగాళదుంపను 4 లేదా 5 మిల్లీ మీటర్ల మందంగా ముక్కలుగా కోయండి. ఇప్పుడు లోహపు గొట్టం తీసుకొని దానికి ఒకవైపు బంగాళదుంప ముక్కతో గట్టిగా నొక్కండి. దాంతో ఆ చివర మూసుకుపోతుంది. ఇదే విధంగా రెండో చివర కూడా బంగాళదుంప ముక్కతో గట్టిగా నొక్కి మూసేయండి. ఇప్పుడు పెన్సిల్‌తో ఒకవైపు ఉన్న బంగాళదుంప ముక్కను బలంగా గొట్టం మర చివర కింది వరకూ నెట్టండి. ఇప్పుడు లక్ష్యానికి గురిపెట్టండి. పెన్సిల్‌ను ట్రిగ్గరుగా ఉపయోగించి గొట్టంలోకి నెట్టండి. అవతలి పక్క ఉన్న బంగాళదుంప తముక్క, తుపాకీ గుండు లాగా గురికి తగిలి పాప్ అంటూ శబ్దం చేస్తుంది. ఈ గాలితుపాకీ భలే ఉంది కదూ!

## పదాలు పూరించండి?







## బొమ్మల పేర్లను పట్టికలో కనిపెట్టండి?




## చుక్కలు కలిపి రంగులు వేయండి



## డైలీ సుడోకు - 228

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | 4 | | | 7 |
| | | | | 7 | 5 | | 2 | |
| | 4 | | 3 | | | 6 | | |
| 5 | | | | | 3 | | | 1 |
| | | | | 8 | | | | |
| 3 | | | 7 | | | | | 8 |
| | | 7 | | | 1 | | 9 | |
| | 3 | | 4 | 6 | | | | |
| 4 | | | 2 | | | 8 | | 6 |

### సుడోకు- 227 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | 2 | 7 | 3 | 8 | 5 | 6 | 9 | 1 |
| 9 | 1 | 8 | 2 | 6 | 7 | 5 | 4 | 3 |
| 5 | 3 | 6 | 9 | 1 | 4 | 8 | 2 | 7 |
| 7 | 6 | 1 | 5 | 9 | 8 | 4 | 3 | 2 |
| 2 | 5 | 4 | 6 | 3 | 1 | 7 | 8 | 9 |
| 8 | 9 | 3 | 4 | 7 | 2 | 1 | 5 | 6 |
| 1 | 8 | 2 | 7 | 4 | 9 | 3 | 6 | 5 |
| 3 | 7 | 5 | 8 | 2 | 6 | 9 | 1 | 4 |
| 6 | 4 | 9 | 1 | 5 | 3 | 2 | 7 | 8 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 206.40 ↑ | 56.65 ↑ | | 75 ↓ | 1 పైసలు ↑ | ↓ |
| 41,558.57 | 12,221.65 | 38,112 ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత) | 44,200 | 70.97 | 65.96 |

# టాటా సన్స్‌కు షాక్

## సైరస్ మిస్త్రీ తొలగింపు చెల్లదన్న ఎన్‌సీఎల్‌ఏటీ

**నెల రోజుల్లో చైర్మన్‌గా మిస్త్రీని పునర్ నియమించాలని ఉత్తర్వులు**

**పబ్లిక్ లిమిటెడ్ కంపెనీని ప్రైవేట్ కంపెనీగా మార్చటం చెల్లుబాటు కాదు**

## చంద్రశేఖరన్ నియామకం అక్రమమే



న్యూఢిల్లీ: టాటా సన్స్ మాజీ చైర్మన్ సైరస్ మిస్త్రీకి జాతీయ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ)లో భారీ విజయం లభించింది. మిస్త్రీ వ్యవహారంలో టాటా గ్రూప్‌నకు దీంతో భారీ ఎదురుదెబ్బ తగిలినట్లయింది. సాల్ట్ నుంచి సాఫ్ట్‌వేర్ రంగం వరకు విస్తరించిన 11,000 కోట్ల డాలర్ల టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ 'టాటా సన్స్' ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పదవి నుంచి సైరస్ మిస్త్రీని అర్థాంతరంగా తొలగించటం చెల్లదని ఎన్‌సీఎల్‌ఏటీ ఆదేశాలు జారీ చేసింది. దీంతో టాటా సన్స్ మాజీ చైర్మన్, ప్రస్తుత చైర్మన్ ఎమిరెటస్ రతన్ టాటా.. సైరస్ మిస్త్రీ మధ్య నువ్వా? నేనా? అన్నట్టు రెండేళ్లపాటు సాగిన న్యాయ పోరాటానికి తెరపడింది. ఈ పోరాటంలో చివరకు మిస్త్రీనే నెగ్గారు. నెల రోజుల్లోగా సైరస్ మిస్త్రీని ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పదవిలో పునర్నియమించాలని కంపెనీ బోర్డును ఎన్‌సీఎల్‌ఏటీ ఆదేశించింది. కాగా మిస్త్రీని అర్థాంతరంగా తొలగించిన తర్వాత చైర్మన్‌గా ఎన్ చంద్రశేఖరన్‌ను నియమించడం కూడా అక్రమమని ట్రిబ్యునల్ ప్రకటించింది. మరోవైపు పబ్లిక్ కంపెనీగా ఉన్న టాటా సన్స్‌ను ప్రైవేట్ కంపెనీగా మారుస్తూ బోర్డు తీసుకున్న నిర్ణయం కూడా తప్పని ఎన్‌సీఎల్‌ఏటీ తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. టాటా సన్స్ ఈక్విటీలో మైనారిటీ వాటాదారైన షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌ను సంప్రదించాకే చైర్మన్, డైరెక్టర్లను నియమించాలని జస్టిస్ ఎస్‌జే ముఖోపాధ్యాయ నేతృత్వంలోని ఇద్దరు సభ్యుల ఎన్‌సీఎల్‌ఏటీ ధర్మాసనం స్పష్టం చేసింది. టాటా సన్స్‌లో 18 శాతం వాటా కలిగిన సైరస్ మిస్త్రీ, ఆయన కుటుంబానికి వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు తీసుకోవటానికి వీల్లేదని ధర్మాసనం ఆదేశించింది. షాపూర్జీ పల్లోంజీ కుటుంబ వారసుడు అయిన సైరస్ మిస్త్రీ.. 2012 డిసెంబరులో రతన్ టాటా వారసుడిగా టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. మిస్త్రీ బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో సజావుగా సాగి న కంపెనీ వ్యవహారాలు అనంతరకాలంలో గాడి తప్పాయని టాటా సన్స్ బోర్డు ఆయన్ను తప్పిస్తూ నిర్ణయం తీసుకుంది. తాత్కాలిక చైర్మన్‌గా రతన్ టాటాను నియమించింది.

### మైనారిటీ వాటాదారుల విజయమిది: మిస్త్రీ

ఎన్‌సీఎల్‌ఏటీ తీర్పును సైరస్ మిస్త్రీ స్వాగతించారు. 'ఇది నా వ్యక్తిగత విజయం కాదు. మైనారిటీ వాటాదారుల హక్కులు, మంచి నిర్వహణకు సంబంధించిన విలువల విజయం. గతాన్ని మరిచి టాటా గ్రూప్ సుస్థిర వృద్ధి, అభివృద్ధి కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దాం' అన్నారు. సరైన కారణంగానీ, హెచ్చరికగానీ లేకుండానే అప్పటి టాటా సన్స్ బోర్డు తనను తొలగించిందన్నారు. ఎన్‌సీఎల్‌ఏటీ తాజా తీర్పుతో ఆ విషయం నిజమైందన్నారు. కంపెనీ సుస్థిర వృద్ధి, అభివృద్ధితో పాటు దీర్ఘకాలంలో వాటాదారుల పెట్టుబడుల విలువ పెంపు లక్ష్యంతోనే తాను పని చేసినట్టు మిస్త్రీ చెప్పారు.

### సముచిత చర్యలు తీసుకుంటాం : టాటా

టాటా సన్స్ మాత్రం ఎన్‌సీఎల్‌ఏటీ తీర్పుపై ఆచితూచి స్పందించింది. ఈ తీర్పుపై అవసరమైన న్యాయ చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. అయితే తీర్పుపై సుప్రీం కోర్టుకు అప్పీల్‌కు వెళతారా? లేదా? అనే విషయం మాత్రం స్పష్టం చేయలేదు. నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసిన వాటాదారుల సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను ఎన్‌సీఎల్‌ఏటీ ఎలా కాదందో స్పష్టం కాలేదని పేర్కొంది.

### ముందు నుంచీ ఎదురుదెబ్బలే..

టాటా సన్స్ బోర్డు నిర్ణయాలు మైనారిటీ వాటాదారుల ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపిస్తూ మిస్త్రీ కుటుంబానికి చెందిన రెండు పెట్టుబడి సంస్థలు ముంబైలోని జాతీయ కంపెనీల లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) బెంచ్‌ను ఆశ్రయించాయి. కంపెనీ నిర్వహణ కూడా సరిగా లేదని, మిస్త్రీ తొలగింపు చెల్లదని పేర్కొన్నాయి. అయితే ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్ ఈ పిటిషన్లను తోసిపుచ్చింది. తర్వాత ఎన్‌సీఎల్‌టీ ఢిల్లీ బెంచ్‌లోనూ ఇదే పరిస్థితి ఎదురైంది. దాంతో మిస్త్రీ ఢిల్లీలోని ఎన్‌సీఎల్‌ఏటీని ఆశ్రయించారు. ఈ ఏడాది జూలైలో విచారణ పూర్తయిన ఈ కేసు తీర్పును ఎన్‌సీఎల్‌ఏటీ బుధవారం ప్రకటించింది.

### సైరస్ మిస్త్రీ ప్రస్థానం

| | |
|---|---|
| 2006 సెప్టెంబరు 1 | టాటా సన్స్ బోర్డులో చేరిక |
| 2012 | టాటా సన్స్ చైర్మన్‌గా నియామకం |
| 2016 అక్టోబరు 24 | చైర్మన్ పదవి నుంచి తొలగింపు, తాత్కాలిక చైర్మన్‌గా రతన్ టాటా నియామకం |
| అక్టోబరు 25 | టాటా ట్రస్టులు పరోక్షంగా పెత్తనం చేస్తున్నాయని ఆరోపిస్తూ టాటా సన్స్ బోర్డుకు మిస్త్రీ లేఖ |
| 2016 డిసెంబరు 19 | టాటా గ్రూప్‌లోని అన్ని కంపెనీల డైరెక్టర్ల పదవులకు మిస్త్రీ రాజీనామా |
| డిసెంబరు 20 | కంపెనీ నిర్వహణ సరిగా లేదని ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్‌లో పిటిషన్ |
| 2017 జనవరి 12 | టాటా సన్స్ చైర్మన్‌గా ఎన్ చంద్రశేఖరన్ నియామకం. మిస్త్రీ తొలగింపును సవాల్ చేసిన కుటుంబ సంస్థలు |
| 2017 ఫిబ్రవరి 6 | టాటా సన్స్ డైరెక్టర్ పదవి నుంచి మిస్త్రీ తొలగింపు |
| ఏప్రిల్ 17 | మిస్త్రీ కుటుంబ సంస్థల విజ్ఞప్తిని తోసిపుచ్చిన ముంబై బెంచ్ |
| ఏప్రిల్ 27 | ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్ తమ విజ్ఞప్తిని కొట్టివేయడంపై ఎన్‌సీఎల్‌ఏటీలో అప్పీల్ |
| సెప్టెంబరు 21 | ప్రైవేట్ కంపెనీగా మారేందుకు తీర్మానాన్ని ఆమోదించిన టాటా సన్స్ బోర్డు. |
| 2018 జూలై 9 | మిస్త్రీ పిటిషన్లను కొట్టివేసిన ఎన్‌సీఎల్‌టీ ఢిల్లీ బెంచ్ |
| 2019 డిసెంబరు 18 | మిస్త్రీ తొలగింపు చెల్లదన్న ఎన్‌సీఎల్‌ఏటీ |

### మిస్త్రీ మళ్లీ రాక పోవచ్చు !

ఎన్‌సీఎల్‌ఏటీ అనుకూలంగా తీర్పు ఇచ్చినా సైరస్ మిస్త్రీ మళ్లీ టాటా గ్రూప్‌నకు రాకపోవచ్చని భావిస్తున్నారు. ఎన్‌సీఎల్‌ఏటీ తీర్పు తర్వాత మిస్త్రీ చేసిన ప్రకటన కూడా ఇందుకు బలం చేకూరుస్తోంది. చట్టపరంగానేకాకుండా నైతికంగానూ రతన్ టాటాపై విజయం సాధించినందున ఇక ఈ విషయాన్ని ఇంతటితో వదిలిపెట్టాలని మిస్త్రీ భావిస్తున్నట్టు సమాచారం.

# ఐసీయూలోకి ఆర్థిక రంగం

**» మాజీ సీఈఏ అర్వింద్ సుబ్రమణియన్**

న్యూఢిల్లీ: భారత ఆర్థిక రంగం పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉన్నదని, ఐసీయూలో చేరే దిశగా పయనిస్తున్నదని మోదీ ప్రభుత్వ మొదటి ముఖ్య ఆర్థిక సలహాదారు అర్వింద్ సుబ్రమణియన్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం దేశంలతో "మహా మాంద్యం" వంటి పరిస్థితి నెలకొందని ఆయన ఐఎంఎఫ్‌లో భారత విభాగం మాజీ హెడ్ జోష్ ఫెల్మన్‌తో కలిసి రూపొందించిన ఒక పత్రంలో హెచ్చరించారు. ప్రస్తుతం భారత్ బ్యాంకులు, రియల్ ఎస్టేట్, మౌలిక వసతుల కంపెనీలు, ఎన్‌బీఎఫ్‌సీల కారణంగా నాలుగు బ్యాలెన్స్ షీట్ల సంక్షోభం ఎదుర్కొంటున్నదని పేర్కొన్నారు. ఇది సాధారణమైన మాంద్యం మాత్రంకాదని తేల్చి చెప్పారు. ఉక్కు, విద్యుత్, ఇన్‌ఫ్రా కంపెనీలకు ఇచ్చిన రుణాలు మొండి బకాయిలుగా మారడం టీబీఎస్-1 అయితే డీమానిటైజేషన్ అనంతరం ఎన్‌బీఎఫ్‌సీల్లో ఏర్పడిన సంక్షోభం టీబీఎస్-2 అని ఆయన విశ్లేషించారు. అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం కారణంగా భారత దీర్ఘకాలిక వృద్ధి మందగించిందని, పెట్టుబడులు, ఎగుమతులు మందగించడం ఇందుకు కారణమని ఆ పత్రంలో పేర్కొన్నారు. ఇప్పుడు మరో చోదక శక్తి వినియోగం కూడా మందగించడం వల్ల ఇటీవల సంవత్సరాల్లో వృద్ధిరేటు గణనీయంగా ప్రభావితం అయిందని తెలిపారు. ఆర్థిక రంగం క్షీణత బాట పట్టిందనేందుకు ఇది సంకేతమని పేర్కొన్నారు.

## బీఎస్-4 వాహనాలపై 'సుప్రీం'కు ఫాడా

న్యూఢిల్లీ: భారత్ స్టేజ్ (బీఎస్) 4 వాహనాలకు సంబంధించి ఆటోమొబైల్ డీలర్ల సంఘం ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఫాడా) సుప్రీం కోర్టును ఆశ్రయించింది. 2020 ఏప్రిల్ ఒకటో తేదీ తర్వాత కూడా బీఎస్-4 వాహనాల అమ్మకాలతోపాటు రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఇవ్వాలని కోరింది. మార్చి 1తేదీకన్నా ముందు కొనుగోలు చేసి ఆ నెలాఖరు వరకు అమ్ముడుపోకుండా ఉన్న వాహనాలను విక్రయించుకునేందుకు అనుమతివ్వాలని అభ్యర్థించింది. 2020 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి బీఎస్-4 వాహనాలను దేశీయ మార్కెట్లో విక్రయించరాదని గత ఏడాదిలో సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏప్రిల్ ఒకటో తేదీ తర్వాత బీఎస్-4 వాహనాల రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో ఈ ఆదేశాల్లో మార్పును కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించినట్టు ఫాడా వెల్లడించింది.

## సంక్షిప్తంగా...

**మారుతి సుజుకీ :** టాప్ 10 కార్ల విక్రయాల్లో కీలకంగా ఉన్న మారుతి సుజుకీ వ్యాగన్‌ఆర్ మార్కెట్లోకి అడుగుపెట్టి 20 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. 1999లో భారత మార్కెట్లోకి విడుదలైన నాటి నుంచి వినియోగదారుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. మొత్తం వినియోగదారుల్లో 25 శాతం మంది వ్యాగన్‌ఆర్‌ను తిరిగి కొనుగోలు చేసిన వారని మారుతి సుజుకీ తెలిపింది. 2017లో వ్యాగన్ ఆర్ విక్రయాలు 20 లక్షల మైలురాయిని అందుకుంది. ఈ ఏడాది సరికొత్త బిగ్ న్యూ వ్యాగన్‌ఆర్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చింది.

**మార్వెల్ ఇండియా :** బెంగళూరులో కొత్త ఆర్ అండ్ డి సెంటర్‌ను ప్రారంభించింది. సంస్థకు దేశంలో రెండో అతిపెద్ద సెంటర్ ఇది. సర్వర్ ప్రాసెసర్స్, సెక్యూరిటీ, సర్వర్ కనెక్టివిటీ, డిజిటల్, అనలాగ్, హార్డ్‌వేర్ విభాగాల్లో టెక్నాలజీల అభివృద్ధి, సొల్యూషన్లను అంతర్జాతీయ మార్కెట్లకు సంస్థ అందిస్తోంది.

**డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్స్ :** యూకే ప్రభుత్వ ఆధీనంలోని ఆర్థిక సంస్థ సీడీసీ గ్రూప్ నుంచి రూ.215 కోట్లు సమీకరించింది. భారత్ సహా ఆఫ్రికా, దక్షిణాసియా దేశాల్లో కార్యకలాపాలను విస్తరించేందుకు ఈ మొత్తాలను వినియోగించనుంది. అలాగే సూపర్ స్పెషాలిటీ ఐ కేర్‌లో కొత్త టెక్నాలజీలను వినియోగించేందుకు కూడా ఈ నిధులను ఉపయోగించనుంది.

**మిచెలిన్ :** ఆటోమొబైల్ టెక్నాలజీల్లో భాగస్వామ్యం కోసం పుణెకు చెందిన ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్‌ఏఐ) జట్టు కట్టింది. టైర్ టెక్నాలజీలు, వాహన పరిస్థితులకు సంబంధించి శిక్షణనిచ్చేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పాటునందించనుందని తెలిపింది.

**రెనో ఇండియా :** విక్రయానంతర సేవల్లో భాగంగా వినియోగదారులకు ఇంజన్ ఆయిల్ లూబ్రికెంట్స్‌ను అందించేందుకు కాస్ట్రాల్ ఇండియాతో ఒప్పందం కుదుర్చుకుంది. జనవరి 1 నుంచి ఇది అందుబాటులోకి రానుంది.

**ఎల్ అండ్ టీ ఫైనాన్స్ :** ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ప్రాతిపదికన నాన్ కన్వర్టబుల్ ప్రిఫరెన్షియల్ షేర్ల జారీ ద్వారా రూ.300 కోట్లను సమీకరించనుంది. ఒక్కో షేరును రూ.300 చొప్పున మొత్తం 3 కోట్ల షేర్లను జారీ చేయనుంది.

# లాటరీపై 28% పన్ను

## వచ్చే మార్చి 1 నుంచి అమలు

**» తొలిసారిగా ఓటింగ్‌తో జీఎస్‌టీ మండలి నిర్ణయం**



న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన బుధవారం సమావేశమైన జీఎస్‌టీ మండలి కీలక నిర్ణయం తీసుకుంది. లాటరీలపై ఏకరీతి పన్ను విధానాన్ని అమలు చేయనుంది. 2020 మార్చి 1 నుంచి రాష్ట్ర, ప్రైవేట్ లాటరీలపై 28 శాతం జీఎస్‌టీ వసూలు చేయనుంది. 38వ జీఎస్‌టీ మండలి సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న లాటరీలపై 12 శాతం జీఎస్‌టీ వసూలు చేస్తుండగా.. ఏదైనా రాష్ట్రం ఆమోదంతో ఆ రాష్ట్రం వెలుపల విక్రయిస్తున్న లాటరీలపై 28 శాతం పన్ను విధిస్తున్నారు. లాటరీలపై ఒకే పన్ను రేటు విధించాలన్న ప్రతిపాదనపై ఓటింగ్ నిర్వహించారు. 21 రాష్ట్రాలు ఇందుకు అనుకూలంగా ఓటేశాయి. జీఎస్‌టీ మండలి సమావేశంలో ఓటింగ్ ద్వారా నిర్ణయం తీసుకోవడం ఇదే తొలిసారి.

### సమావేశంలో తీసుకున్న మరిన్ని నిర్ణయాలు

- ఇకపై నేత, నేయని సంచులు ఒకే జీఎస్‌టీ శ్లాబ్ (18 శాతం)లోకి.
- పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ప్రోత్సాహకరంగా ఇండస్ట్రియల్ ప్లాట్ల దీర్ఘకాలిక లీజుపై పన్ను మినహాయింపు. 2020, జనవరి 1 నుంచి అమలులోకి.
- 2017 జూలై నుంచి జీఎస్‌టీఆర్-1 రిటర్ను దాఖలు చేయని వారికి పెనాల్టీ నుంచి ఊరట. అయితే ఇప్పటివరకు సమర్పించాల్సిన రిటర్నులను 2020 జనవరి 10లోగా ఫైల్ చేయాలి. లేదంటే వారికి ఈ-వే బిల్లుల జారీ నిలిచిపోనుంది.
- 2017-18 ఆర్థిక సంవత్సరానికి జీఎస్‌టీఆర్-9, 9సీ రిటర్నుల సమర్పణకు గడువు తేదీ ఈ డిసెంబరు 31 నుంచి వచ్చే ఏడాది జనవరి 31 వరకు పొడిగింపు.
- ఇన్వాయిస్‌లు అప్‌లోడ్ చేయని పక్షంలో ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ 20 శాతం నుంచి 10 శాతానికి కుదింపు.

### పరిహారంపై రాష్ట్రాలకు లభించని హామీ

జీఎస్‌టీ పరిహారం చెల్లింపుల్లో కేంద్ర ప్రభుత్వం డిఫాల్ట్ అంచున ఉందని బీజేపీయేతర రాష్ట్రాలు అంటున్నాయి. సకాలంలో పరిహారం చెల్లింపులపై కేంద్రం ఎలాంటి హామీ ఇవ్వలేకపోయిందని ఆ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు పేర్కొన్నారు. అయితే రాష్ట్రాలకు పరిహారం చెల్లింపులపై కేంద్రం కట్టుబడి ఉందని నిర్మలా సీతారామన్ పునరుద్ఘాటించారు.

### రేట్ల పెంపుపై చర్చించలేదు: నిర్మల

ఈ సమావేశంలో జీఎస్‌టీ రేట్ల పెంపు లేదా తగ్గింపు గురించి ఎలాంటి ప్రతిపాదన రాలేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఇందుకు సంబంధించి అధికారుల కమిటీ కూడా ఎలాంటి సూచనలు చేయలేదన్నారు. అయితే జీఎస్‌టీ రేట్ల పెంపు ప్రతిపాదనలను రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకించినట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి.

# పనికి అత్యుత్తమం 'ఎస్‌ఏపీ'

బెంగళూరు: ఈ ఏడాదికి దేశంలోని టాప్ రేటెడ్ టెక్నాలజీ పని ప్రదేశాల జాబితాలో బిజినెస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్లు అందిస్తున్న ఎస్‌ఏపీ ఇండియా అగ్రస్థానంలో నిలిచింది. జాబ్ సైట్ ఇండీడ్‌లో అందుబాటులో ఉన్న ఉద్యోగుల రేటింగ్స్, రివ్యూల ఆధారంగా ఈ జాబితా రూపొందించారు. ఎస్‌ఏపీ తర్వాతి స్థానాల్లో అడోబ్ (2), వీఎంవేర్ (3), మైక్రోసాఫ్ట్ (4) నిలిచాయి. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఐదో స్థానాన్ని సంపాదించుకుంది. గత ఏడాది ఈ సంస్థ పదో స్థానంలో ఉంది. ఇక ఈ-కామర్స్ కంపెనీలైన మింత్రా, పేటీఎం, ఫ్లిప్‌కార్ట్‌లతోపాటు ఐటీ సర్వీసుల కంపెనీలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఎంఫసిస్ వంటి కంపెనీలు కూడా జాబితాలో స్థానం పొందాయి. సిస్కో, ఐబీఎం, యాపిల్, యామ్‌డాక్, జెన్‌పాక్ట్‌లు కూడా టాప్ 15 కంపెనీల్లో ఉన్నాయి.

## 'రిటర్నబుల్ ప్లాట్ల' కేటాయింపులు రద్దు

**» అసలైన అసైన్డ్ రైతులకే ఇవ్వాలని ఆదేశాలు**

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి 29 గ్రామాల పరిధిలోని అసైన్డ్ భూములను పూలింగ్ కింద ఇచ్చి, బదులుగా పొందిన రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపును ప్రభుత్వం రద్దుచేసింది. భూమిలేని నిరుపేదలు సాగు చేసుకుని, జీవనం సాగించేందుకు వీలుగా ప్రభుత్వం వారికి అసైన్డ్ భూములు కేటాయించింది. వీటిని ఇతరులు కొనడం నిషిద్ధమైనప్పటికీ రాజధానిగా అమరావతి ప్రకటన అనంతరం అసైన్డ్ రైతుల నుంచి పలువురు కొనుగోలు చేశారు. ఆ తర్వాత వాటిని పూలింగ్ కింద ఏపీసీఆర్డీయేకు ఇచ్చి, బదులుగా రిటర్నబుల్ ప్లాట్లు (జరీబు భూములకైతే ఎకరాకు 500 చదరపు గజాల రెసిడెన్షియల్, 100 చ.గ. కమర్షియల్; మెట్ట భూములకు ఎకరాకు 500 చ.గ. నివాస, 50 చ.గ. వాణిజ్య) పొందారు. దీనిపై పలు ఫిర్యాదులు అందడంతో అమరావతిలోని అసైన్డ్ భూముల అనధికార క్రయవిక్రయాలపై ప్రభుత్వం విచారణ జరిపించింది. ఇందులో ఇప్పటివరకు సుమారు 300ఎకరాల అసైన్డ్ భూములను అనర్హులైన పలువురు సాగుదారుల నుంచికొని, సీఆర్డీయేకు పూలింగ్‌లో ఇచ్చి, రిటర్నబుల్ ప్లాట్లు పొందినట్లు తేలింది. వీరందరూ పొందిన రిటర్నబుల్ ప్లాట్లన్నింటి విస్తీర్ణం దాదాపు 34ఎకరాలు ఉన్నట్లు తెలిసింది. ఆ ప్లాట్ల కేటాయింపులను రద్దుచేస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలిచ్చింది. గతంలో వాటిని సాగుచేసిన అసలైన అసైన్డ్ రైతులకు గానీ వారి వారసులకు గానీ నిబంధనల మేరకు కేటాయించాలని పురపాలకశాఖ కార్యదర్శి జె.శ్యామలరావు ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.



## పియాజియో ఎలక్ట్రిక్ ఆటో

న్యూఢిల్లీ: ఇటలీకి చెందిన ఆటో దిగ్గజం పియాజియో మార్కెట్లోకి ఎలక్ట్రిక్ 3 వీలర్‌ను బుధవారం నాడు విడుదల చేసింది. అపే ఈ-సిటీ పేరుతో తెచ్చిన ఈ ఆటో ధర రూ.1.97 లక్షలు (ఎక్స్‌షోరూమ్). దీని విడుదల కార్యక్రమంలో కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పియాజియో వెహికిల్స్ ఎండీ, సీఈఓ డీగో గ్రాఫి పాల్గొన్నారు. ఈ ఆటోలో లిథియం అయాన్ బ్యాటరీని వినియోగించారు. దీన్ని మార్చుకునే వెసులుబాటు ఉంది. బ్యాటరీ, చార్జింగ్ మౌలిక సదుపాయాల కోసం చేతన్ మైనీ సారథ్యంలోని సన్ మొబిలిటీతో కంపెనీ చేతులు కలిపింది. "ఎలక్ట్రిక్ టెక్నాలజీ అభివృద్ధిలో పియాజియో గ్రూప్‌నకు పదిహేనేళ్ల చరిత్ర ఉంది. దీని ద్వారా భారత మార్కెట్ కోసం ఉత్పత్తులు తెచ్చాం" అని డీగో గ్రాఫి అన్నారు.

## ప్రధాన నిరోధం 12300

**టెక్ వ్యూ**

నిఫ్టీ పాజిటివ్‌గా ప్రారంభమై 12200 వరకు వెళ్లి సుదీర్ఘ కన్సాలిడేషన్ సాధించిన అనంతరం చివరి సెషన్‌లో మరింత రికవరీతో 56 పాయింట్లు లాభపడిడే గరిష్ఠ స్థాయిలో ముగిసింది. ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 12150కన్నా పైన నిలదొక్కుకోవడం ట్రెండ్‌లో సానుకూలత సంకేతం. అయితే గత ఆరు సెషన్లుగా 11850 స్థాయి నుంచి నిరంతర ర్యాలీ సాధించినందు వల్ల ప్రస్తుత గరిష్ఠ స్థాయిల్లో ట్రేడర్లు అప్రమత్తంగా ఉండాలి.

**గురువారం స్థాయిలివే...**

**నిరోధం : 12240 మద్దతు : 12170**

- మరింత అప్‌ట్రెండ్ కోసం 12240కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 12300.
- మైనర్ మద్దతు స్థాయి 12170 కన్నా దిగజారితే మైనర్ ఇంట్రాడే బలహీనతలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 12100. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది.

■ వి.సుందర్ రాజా

# చిన్న సంస్థలే సైబర్ నేరగాళ్ల లక్ష్యం

**ఏడాదిలో భారత్‌పై సైబర్ దాడులు 100% పెరిగాయ్**

**బీఓఐ నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పద్మనాభన్ వెల్లడి**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సైబర్ సెక్యూరిటీపై ఎక్కువ ఖర్చు చేయలేని చిన్న కంపెనీలు, సంస్థలపైనే ఎక్కువగా సైబరు దాడులు జరుగుతున్నాయి. ఇటీవల పంజాబ్ అండ్ మహారాష్ట్ర కో-ఆపరేటివ్ (పీఎంసీ) బ్యాంకులో సెక్యూరిటీ ప్యాచ్‌లను అప్‌డేట్ చేసి ఉంటే.. డేటా అవకతవకలు జరిగి ఉండేవికాదని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, ఆర్‌బీఐ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జీ పద్మనాభన్ అన్నారు. 80 శాతం సైబర్ దాడులకు సెక్యూరిటీ ప్యాచ్‌లను అప్‌డేట్ చేసుకోకపోవడమే కారణం. నెట్‌వర్క్‌లోకి సైబర్ నేరగాళ్లు ప్రవేశించిన తర్వాత సగటున 220 రోజులకు కానీ దాన్ని గుర్తించడం లేదని పద్మనాభన్ వివరించారు. ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ (ఐడీఆర్‌బీటీ)లో జరుగుతున్న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ సెక్యూరిటీ (ఐసీఐఎస్ఎస్)లో పద్మనాభన్ మాట్లాడారు. అంతక్రితం ఏడాదితో పోలిస్తే భారత్‌పై 2018లో సైబర్ దాడులు 100 శాతం పెరిగాయి. అమెరికా తర్వాత సైబర్ నేరగాళ్లు భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారు. సైబర్ సెక్యూరిటీ రెడీనెస్‌లో భారత ర్యాంకింగ్ చాలా నిరుత్సాహకర స్థాయిలో ఉందని తెలిపారు. ఫైనాన్షియల్ రంగంలో ఏ ఒక్క విభాగంపై సైబర్ దాడులు జరిగినా దాని ప్రభావం బ్యాంకులు, ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్లు, పేమెంట్ వ్యవస్థలు, స్టాక్ ఎక్స్ఛేంజీలువంటి అన్ని విభాగాలపై ఉంటుంది. సైబర్ దాడులు చేయడానికి హ్యాకర్లు ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీలపై అవగాహన పెంచుకుంటున్నారు. అందరూ కలిసికట్టుగా పని చేస్తున్నారు. ఐటీ వ్యవస్థలకు, కంపెనీలు, సంస్థలకు ఇది పెద్ద సవాలని పద్మనాభన్ వ్యాఖ్యానించారు. వీటిని అధిగమించడానికి నిరంతర పరిశోధన, దాడులను తిప్పికొట్టే చర్యలు అవసరమని, ఈ పరిశోధనకు ఫైనాన్షియల్ రంగం ఆర్థిక సాయం అందించాలన్నారు.

### బ్యాంకులు ఎందుకు బాధ్యత వహించాలి

ఖాతాదారుల నిర్లక్ష్యం వల్ల జరిగే ఆర్థిక నష్టాలకు బ్యాంకులు ఎందుకు బాధ్యత వహించాలని పద్మనాభన్ అన్నారు. భద్రతలేని ఫోన్, కంప్యూటర్‌ను వినియోగించడం, యాప్‌ను అప్‌డేట్ చేసుకోకపోవడం, బ్యాంకు సైట్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోకపోవడంవంటి పొరపాట్లను ఖాతాదారులు చేస్తున్నారు. కీలకమైన సమాచారాన్ని సామాజిక మీడియాల్లో ఉంచుతున్నారు. ఇటువంటి నిర్లక్ష్యాల వల్ల జరిగే నష్టాలకు బ్యాంకులు ఎందుకు బాధ్యత వహించాలని ప్రశ్నించారు.

### కొత్త టెక్నాలజీలతో మెరుగు

కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, బ్లాక్ చెయిన్ వంటి ఆధునిక టెక్నాలజీలతో సైబర్ సెక్యూరిటీ మరింత మెరుగుపరచవచ్చు. అదే సమయంలో వాటి వల్ల సైబర్‌దాడులు అధికమయ్యే అవకాశాలు ఉన్నాయి. సామర్థ్యాలను పెంచుకోవడానికి సైబర్ నేరగాళ్లు ఈ టెక్నాలజీలను వాడుకోగలరని పద్మనాభన్ చెప్పారు. సెక్యూరిటీ పరమైన చర్యలు తీసుకున్నప్పటికీ.. ఇంకా రిస్క్‌ను తగ్గించుకోవడానికి సైబర్ ఇన్సూరెన్స్ ఉత్తమ మార్గమని, అయితే భారత్‌లో ఇదింకా ఊపందుకోలేదన్నారు.




పద్మనాభన్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఐడీఆర్‌బీటీ డైరెక్టర్ ఏఎస్ రామశాస్త్రి

### అదే పెద్ద సవాలు

బ్యాంకుల విలీనం చాలా సంక్లిష్టమైన వ్యవహారం. సంస్కృతి వంటి అనేక కీలక అంశాలు ఉంటాయి. ముఖ్యంగా టెక్నాలజీ ఇంటిగ్రేషన్ పెద్ద సవాలు. అందుకే ఒకే రకమైన కోర్ బ్యాంకింగ్ వ్యవస్థలున్న బ్యాంకులను విలీనం చేస్తున్నారు. ఒకే రకమైన కోర్ బ్యాంకింగ్ వ్యవస్థలను వినియోగిస్తున్నప్పటికీ.. వాటి వెర్షన్లు వేరు. సెక్యూరిటీ సొల్యూషన్లు, నియంత్రణ వ్యవస్థలు భిన్నంగా ఉన్నాయి. అందువల్ల ఇటువంటి వ్యవస్థలను రెండు, మూడుళ్లలో ఏకీకరించి అవసరమైన భద్రత సొల్యూషన్లను అందించడం చాలా కష్టం.

## ఉదయం సాధారణంగా మెరుగు

**ఆస్ట్రో వ్యూ**

**తిథి:** మార్గశిర బహుళ అష్టమి; నక్షత్రం: ఉత్తర

**అప్రమత్తం:** ఆర్ద్ర, స్వాతి, శతభిషం నక్షత్ర జాతకులు, తుల, కుంభ రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 11.15**

**ధోరణి:** నిఫ్టీ ఫ్యూచర్స్ నిస్తేజంగా ప్రారంభమై 11.15 వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 1.30 వరకు మెరుగ్గాను, తదుపరి చివరి వరకు మరోసారి నిస్తేజంగాను ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం:** నిఫ్టీ ఫ్యూచర్స్ 10.15 సమయానికి ఎటిపి కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 1.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.45 తర్వాత ఎటిపి కన్నా దిగువన ఉంటే షార్ట్ పొజిషన్లు తీసుకున్నా తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవలసి ఉంటుంది.

**నిరోధం : 12240, 12275**

**మద్దతు స్థాయిలు : 12180, 12135**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక:** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్100 గుడ్లు)

| | | | |
|---|---|---|---|
| 18వ తేదీకి.. హైదరాబాద్ | 433 | విజయవాడ | 452 |
| 19వ తేదీకి.. చిత్తూరు | 458 | విశాఖపట్నం | 470 |
| గోదావరి | 452 | వరంగల్ | 436 |
| | | డజను గుడ్లు రూ. | 66 |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 90 | విజయవాడ | 96 |
| వరంగల్ | 92 | గుంటూరు | 96 |
| మహబూబ్‌నగర్ | 90 | ఒంగోలు | 98 |
| కరీంనగర్ | 90 | చిత్తూరు | 83 |
| కర్నూలు | 90 | నెల్లూరు | 83 |
| విశాఖపట్నం | 100 | అనంతపురం | 84 |
| గోదావరి | 95 | | |

### బులియన్

| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 38,140 | 38,800 | 39,230 | 38,800 | 38,150 |
| క్రితం ముగింపు | 38,030 | 38,800 | 39,270 | 38,800 | 38,080 |
| 22 క్యారెట్లు | 36,260 | 36,600 | 36,090 | 35,970 | 36,340 |
| క్రితం ముగింపు | 36,200 | 35,900 | 36,120 | 35,970 | 36,270 |
| వెండి (కిలో) | 44,600 | 45,600 | 45,400 | 45,500 | 47,700 |
| క్రితం ముగింపు | 44,500 | 46,600 | 45,500 | 45,500 | 47,700 |



జై విశాఖ అని నినదిస్తున్న రామారావు




## వ్యూహాత్మకంగానే జగన్‌రెడ్డి ప్రకటన

▸▸ వైసీపీ చేతుల్లో ఉత్తరాంధ్ర భూములు: పవన్



అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ప్రకటనపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ ట్విటర్‌లో స్పందించారు. రాజధాని ప్రాంతంలో రైతులకు భరోసా ఇవ్వడానికి జనసేన నేత నాదెండ్ల మనోహర్ నేతృత్వంలో బృందాన్ని పంపిస్తున్నట్లు తెలిపారు. నిపుణుల కమిటీ నివేదిక వచ్చే వరకూ ఆగాలని వైసీపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ నివేదిక వచ్చిన తరువాతే జనసేన పూర్తి స్థాయిలో స్పందిస్తుందన్నారు. "జగన్ రెడ్డి గారు అసెంబ్లీలో ప్రకటన ఒక వ్యూహం ప్రకారమే చేశారు. ఉత్తరాంధ్ర భూములు చాలావరకూ వైసీపీ నాయకుల చేతుల్లోకి వెళ్లిపోయాయని స్థానికులు చెప్పారు. విశాఖ ప్రాంతంలో భూములపై కఠినంగా ఉన్న జేసీ శివశంకర్ లోతేటిని ఆఘమేఘాలపై తప్పించారు. ఇక అక్కడ పులివెందుల పంచాయితీలు మొదలవుతాయి" అని పవన్ ట్వీట్ చేశారు.

## మూడు ప్రాంతాలూ అభివృద్ధి చెందాలి: టీజీ



కర్నూలు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): "రాజధాని అమరావతికే పరిమితం కాకుండా 3 ప్రాంతాలకు విస్తరించాలన్న ప్రభుత్వ ఆలోచనను స్వాగతిస్తున్నాం. అయితే ఒక్కో విభాగానికే ఆ ప్రాంతాలు పరిమితం కాకుండా చూడాల్సిన బాధ్యత సీఎం జగన్మోహన్‌రెడ్డిపై ఉంది" అని బీజేపీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ స్పష్టం చేశారు. కర్నూలులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అమరావతిలో మినీ సెక్రటేరియట్‌తోపాటు హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో మినీ అసెంబ్లీ హాల్, హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి. కర్నూలులో జ్యుడీషియల్ క్యాపిటల్ మాత్రమే కాకుండా మినీ అసెంబ్లీ హాల్, సెక్రటేరియట్ నిర్మాణాలను చేపట్టాలి. రాష్ట్ర విభజన సమయంలో సమ్మర్, వింటర్ రాజధానులు ఏర్పాటు చేయాలని రాయలసీమ హక్కుల ఐక్య వేదిక తరఫున డిమాండ్ చేశామని గుర్తు చేశారు. హైకోర్టు కోసం విశాఖపట్టణం నుంచి కర్నూలు వరకు రావడం కుదరని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా అమరావతి అభివృద్ధి కోసం ఎంతగా కృషి చేశారో తమకు తెలుసునని, ఈ క్రమంలో అమరావతిని కదిలించడం సరికాదని తెలిపారు.

## అమరావతినే కొనసాగించాలి: సీపీఐ



అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): "ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతినే కొనసాగించాలి. రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై నియమించిన కమిటీ అందచేసిన నివేదికను సీఎం వెల్లడించాలి. అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి" అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడలో ఆయన మాట్లాడారు. సాక్షాత్తు శాసనసభలో ఆనాటి సీఎం చంద్రబాబు రాజధానిగా అమరావతిని ప్రకటించారని, ప్రతిపక్షనేతగా ఉన్న జగన్ వివాదానికి తావివ్వకుండా సీఎం ప్రతిపాదనను అంగీకరిస్తున్నట్లు ప్రకటించారని గుర్తు చేశారు. రాష్ట్రానికి మధ్యలో అమరావతి ఉన్నందున ప్రజలందరూ కూడా హర్షించారన్నారు. అమరావతి రాజధానిపై ఈ నెల 28న తుళ్లూరులో వామపక్షపార్టీల ఆధ్వర్యంలో అక్కడున్న రైతులు, చేతి వృత్తిదారులు, వ్యవసాయ కూలీలతో సదస్సు నిర్వహిస్తామని చెప్పారు.

## కమిటీ నివేదిక వచ్చే వరకూ చూడాలి: సీపీఎం



రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా రాజధానిపై నిపుణుల కమిటీ నివేదిక వెలువడిన అనంతరం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏకాభిప్రాయం సాధించడం కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. నిపుణుల కమిటీ నివేదిక ఇవ్వకముందే రాజధాని అంశంపై అసెంబ్లీ ముఖ్యమంత్రి ప్రతిపాదనలు చేయడం గందరగోళం సృష్టించడం తప్ప ప్రయోజనం ఏమీలేదని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. దీని వెనుక రియల్ ఎస్టేట్ ప్రయోజనాలు దాగి ఉన్నాయన్న అనుమానాలకు ఆస్కారం ఏర్పడుతోందని అన్నారు. రాజధాని అంశం వివాదాస్పదంగా మారరాదని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. చంద్రబాబు అనుసరించిన పద్ధతినే జగన్ కూడా కొనసాగించడం దురదృష్టకరమని అన్నారు.

## అమరావతిని కొనసాగించాలి: తులసిరెడ్డి

వేంపల్లె, విజయవాడ, డిసెంబరు 18: "రాష్ట్రానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. రాహువు, కేతువుల్లా మారారు" అని పీసీసీ ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి ధ్వజమెత్తారు. వేంపల్లెలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. 'హైకోర్టును రాయలసీమలో ఏర్పాటుచేస్తామని చెప్పడం శుభపరిణామం, రాజధానిని అమరావతిలోనే కొనసాగించాలి. విశాఖలో అసెంబ్లీ సమావేశాలు జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటే సరిపోతుంది.' అన్నారు.

## అభివృద్ధి వికేంద్రీకరణంటే.. రాజధానులు మార్చడమా?

▸▸ ఇన్‌సైడర్ ట్రేడింగ్ అంటూ తప్పుడు ప్రచారం

▸▸ నిజం నిప్పు.. అసత్యాలు శాశ్వతం కావు

▸▸ పనికిమాలిన సీఎంకు ఓనమాలు రావు

▸▸ మాతో ఆడుకుంటున్నారు.. వడ్డీతో తీర్చుకుంటాం..: చంద్రబాబు



అనంతపురంలో టీడీపీ కార్యకర్తలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు

అనంతపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి వికేంద్రీకరణకు తాము వ్యతిరేకం కాదని, ఆ పేరుతో రాజధానులు మార్చడం సరికాదని మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం అనంతపురంలో ఆయన టీడీపీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని, కానీ జగన్ చెప్పిన విధంగా కాదన్నారు. 'రాష్ట్ర విభజన తర్వాత అమరావతిని రాజధానిని చేసి విశాఖను ఆర్థిక కేంద్రంగా తయారు చేసే ప్రణాళిక రచించాను. అక్కడ డేటా సెంటర్ ఏర్పాటు చేయడానికి కొందరు ముందుకొచ్చారు. అదే వచ్చి ఉంటే హైదరాబాద్ కంటే మించిపోయేది. లక్షల్లో ఉద్యోగాలొచ్చేవి. దానిని వైసీపీ వాళ్లు తరిమేశారు. అనంతపురం జిల్లాకు తీసుకొచ్చిన కియా పరిశ్రమను కూడా నాడు వ్యతిరేకించారు. అయినా నేను చొరవ చూపి కొరియా వారు కోరినట్లు ఆరు నెలల్లో గొల్లపల్లి రిజర్వాయరును పూర్తిచేసి నీరివ్వడంతో ఇక్కడకు పరిశ్రమ వచ్చింది. లేకుంటే మహారాష్ట్రకు వెళ్లేది' అని చెప్పారు. ఆనాడు హైదరాబాద్‌లో అన్నీ ఒకేచోట ఉంచి అభివృద్ధి చేశామన్నారు. ఐటీ రంగం, సైబరాబాద్, హైటెక్ సిటీ, ఔటర్ రింగ్‌రోడ్ వంటివి వచ్చాక గణనీయంగా అభివృద్ధి జరిగిందని తెలిపారు.

### 4 వేల ఎకరాలెక్కడ?

అమరావతిలో తాను ఇన్‌సైడర్ ట్రేడింగ్ చేశానని తప్పుడు ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. తాను చట్టాన్ని వ్యతిరేకించాననుకుంటే దిక్కున్న చోట చెప్పుకోవాలన్నారు. తప్పుచేశానని అబద్ధాలు చెబితే ఖబడ్దార్ అని హెచ్చరించారు. వారు అన్నట్లు నాలుగు వేల ఎకరాల భూమి ఎక్కడో చెప్పాలన్నారు.



తుళ్లూరులో రైతుల నిరసన

ఎమ్మెల్యే బాలకృష్ణ వియ్యంకుడు పరిశ్రమల కోసం కాంగ్రెస్ హయాంలో 500 ఎకరాలు కొన్నారని.. వాటి అవసరం లేకపోవడంతో వెనక్కి ఇచ్చేశారని తెలిపారు. నిజం నిప్పులాంటిదని, అసత్యాలు శాశ్వతం కాదని చెప్పారు.

### జగన్ ఎక్కడ చదివారు..?

జగన్ పనికిమాలిన ముఖ్యమంత్రి అని, ఆయనకు ఓనమాలు కూడా రావని చంద్రబాబు విమర్శించారు. తనకు ఇంగ్లీషు రాదని ఆయన అసెంబ్లీలో అన్నారని.. తాను ఎస్వీ యూనివర్సిటీలో చదివానని గుర్తు చేశారు. జగన్ ఎక్కడ చదివాడో ఎవరికి తెలుసని ప్రశ్నించారు. అమరావతిలో రూ.7 కోట్లతో నిర్మించిన ప్రజావేదికను కూల్చేశారని, ఆ హక్కు వారికెవరిచ్చారని ప్రశ్నించారు. మనుషుల్ని తినే మనుషులుగా వైసీపీ నేతలను అభివర్ణించారు.

### ఆనాడు నేనూ అలా చేసి ఉంటే..

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, టీడీపీ శ్రేణులపై వైసీపీ నేతలు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని చంద్రబాబు ధ్వజమెత్తారు. ఆనాడు తాను కూడా అలాగే ఉండి ఉంటే ఈరోజు పరిస్థితి వేరుగా ఉండేదని మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి చెప్పారని అన్నారు. ఎమ్మెల్యేలు పురమాయించారని పోలీసులు టీడీపీ శ్రేణులపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని, వాటన్నిటికీ వడ్డీతో బదులు తీర్చుకుంటామని హెచ్చరించారు. రిటైరైనా అధికారులను వదలనని హెచ్చరించారు. తాను మూడుసార్లు సీఎంగా పనిచేసిన వ్యక్తినని కూడా చూడకుండా మార్షల్స్ చేత అసెంబ్లీ బయట ఆపేయడం సిగ్గుచేటన్నారు. జగన్ పనికిమాలిన ముఖ్యమంత్రి అని వ్యాఖ్యానించారు. జేసీ దివాకర్‌రెడ్డి చెప్పినట్లు ఆయనకు తాత రాజారెడ్డి గుణాలే వచ్చాయన్నారు.

## రాజధాని సెగలు!

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రాజకీయాలకు అతీతంగా రాజధాని రైతులు, రైతు కూలీ సంఘ నేతలు నిరసన తెలిపారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన మందడం, వెంకటపాలెం, తుళ్లూరు, రాయపూడి తదితర గ్రామాల్లోని రైతులు పురుగుమందు డబ్బాలు చేతపట్టుకొని నిరసనల్లో పాల్గొన్నారు. రాజధాని గ్రామాల పరిధిలోని పలుచోట్ల రైతులు దీక్షకు దిగారు. వెలగపూడి, రాయపూడి, కృష్ణాయపాలెం, మందడం రైతులు ధర్నా చేశారు. మందడంలో రోడ్డుపై రైతులు, రాజధాని రైతు కూలీ సంఘ నేతలు బైఠాయించారు. దీంతో ముందు జాగ్రత్తగా చర్యగా పోలీసులు అక్కడ భారీగా మోహరించారు. వెంకటపాలెంలో రాజధాని రైతులు నిరాహారదీక్షకు దిగారు. వెలగపూడి ప్రధాన కూడలిలో ఆందోళన చేపట్టారు. 'ముఖ్యమంత్రులు మారితే రాజధానిని మారుస్తారా? ఎన్నికల ముందు రాజధాని మార్పు, మూడు రాజధానుల సంగతి ఎందుకు చెప్పలేదు' అని జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అమరావతికి భూములు ఇచ్చిన మా పరిస్థితి ఏంటని నిలదీశారు. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఏటా తుఫానులతో విశాఖ ఎంతో నష్టపోతోందన్న విషయం తెలియదా అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అమరావతి నిర్మాణార్థం తమ భూములు దాదాపు 33,000 ఎకరాలకుపైగా పూలింగ్ కింద ఇచ్చిన తమ త్యాగం వృథా కారాదని నినదించారు. వీరి ఆందోళనలతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సచివాలయం ఉద్యోగులు దాదాపు రెండు కిలోమీటర్ల అవతల నుంచి నడిచి కార్యాలయానికి చేరుకోవాల్సి వచ్చింది. కాగా, ఉద్యమ ఉధృతిని మరింత పెంచుతూ గురువారం రాజధాని గ్రామాల్లో బంద్ నిర్వహించాలని రైతులు నిర్ణయించారు. శుక్రవారం నుంచి రాజధాని గ్రామాల సచివాలయాల వద్ద రిలే నిరాహార దీక్షలు సైతం ప్రారంభించాలని తీర్మానించారు.

### 'జై విశాఖ'పై ఆగ్రహం..

మందడంలో ఆందోళన చేస్తున్న రైతులకు అనుమానాస్పద వ్యక్తి ఒకరు వచ్చి 'జై విశాఖ అభివృద్ధి' అనే పోస్టర్‌ను చూపించడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన రైతులు.. దాడి చేశారు. పోలీసులు అతడిని తప్పించి చెక్‌పోస్టులోకి తీసుకెళ్లారు. ఆ వ్యక్తిని ఉత్తరాంధ్ర జేఏసీ నేత జోళ్ల తారక రామారావుగా పోలీసులు ధ్రువీకరించారు. అతడిపై సెక్షన్ 151 సీఆర్‌పీసీ కింద కేసు నమోదు చేశారు.

'అమరావతిలో పూర్తిస్థాయి అభివృద్ధి జరగదని సీఎం చెప్పటంతో, మా భవిష్యత్తు అంధకారంలోకి పోయినట్లయింది. జగన్ తన నిర్ణయం మార్చుకోవాలి.

**- బీ సుధాకర్, ఎస్సీ రైతు కూలి**

"దక్షిణాఫ్రికాకు మూడు రాజధానులు వద్దని నెల్సన్ మండేలా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన కన్నా వీరు మేధావులా? ప్రతిపక్ష హోదాలో జగన్ అమరావతిని సమర్థించారు. ఆ నమ్మకంతోనే భూములిచ్చాం. మాట మార్చి మా బతుకులతో ఆడుకోవద్దు"

**- రాధికా రాణి, మందడం**

మేం నిరసన తెలుపుతున్నట్లు విశాఖలో ఉన్న జేఏసీ వారికి ఎలా తెలుసు? ఉదయంకల్లా ఇక్కడికి ఎలా వచ్చారు. ఇదంతా రాజకీయ కుట్రలో భాగమే.

**- సీతారామయ్య, వెలగపూడి**

## 3 రాజధానులు.. ఉండొచ్చు.. ఉండకపోవచ్చు!

**సీఎం ఊహించి ప్రకటన చేశారు.. కమిటీ నివేదిక తర్వాతే నిర్ణయం**



▸▸ అమరావతిలో కట్టాలంటే లక్షల కోట్లు కావాలి

▸▸ విశాఖలో అయితే ఖర్చు ఉండదు!

▸▸ రైతులతో సీఎంను బూతులు తిట్టిస్తున్నారు

▸▸ మంత్రి పేర్ని నాని ఆగ్రహం

అమరావతి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు మూడు ప్రాంతాల్లో మూడు రాజధానులు ఉండొచ్చన్న ప్రకటన సీఎం జగన్ ఊహించి చేశారని సమాచార, పౌరసంబంధాలు, రవాణా శాఖల మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. కమిటీ నివేదికలో ఈ మూడు రాజధానుల కాన్సెప్ట్ ఉండొచ్చు.. ఉండకపోవచ్చని వ్యాఖ్యానించారు. అదే సమయంలో సీఎం ఏది చెప్పినా సీరియస్‌గానే చెబుతారని.. చంద్రబాబులా పూటకో మాట మాట్లాడరని చెప్పారు. బుధవారం సచివాలయంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. విశాఖ, కర్నూలు, అమరావతి ప్రాంతాల్లో 3 రాజధానులు ఉండొచ్చని మాత్రమే జగన్ అన్నారని.. ఉండొచ్చు అనే మాటకు.. ఉంటుంది అనే మాటకు తేడా ఉందని తెలిపారు. ఆయన ప్రకటనను ఆధారం చేసుకుని విమర్శలు గుప్పిస్తున్న వారందరూ ఆయనపై ఎంత ద్వేషం పెంచుకుంటున్నారో అర్థమవుతోందని చెప్పారు. ఆయన ఎక్కడ దొరుకుతాడా, పీక పిసుకుదామా అన్న ధోరణిలో కాచుకుని కూర్చున్నారని ఆరోపించారు. 'జగన్ ఏమన్నారు.. కమిటీ వేశాం.. అధ్యయనం జరుగుతోంది.. ప్రజల ఆకాంక్షలు, అభివృద్ధికి అవకాశాలను కమిటీ అధ్యయనం చేస్తుంది. అందులో 3 రాజధానులు ఉండొచ్చు అని అన్నారు. కానీ పెడతున్నామని అని చెప్పలేదు కదా! ఆ రిపోర్టులో అది ఉండకపోనూ వచ్చు కదా' అని మంత్రి చెప్పారు. మూడు రాజధానులు ఉన్నా అమరావతిలో అసెంబ్లీ ఉంటుందన్నారు. మూడు రాజధానుల నిర్ణయాన్ని విమర్శిస్తున్న వారి దృష్టిలో అసెంబ్లీ పనికిరాదా అని ప్రశ్నించారు. శివరామకృష్ణన్ కమిటీ నివేదిక ఏమైంది.. ఆయన అంత చేతకాని వారా అని అడిగారు. 'మాజీ మంత్రి నారాయణ కంటే తీసేసినోడా? నారాయణకేం తెలుసు.. కాలేజీ, హాస్టల్ కట్టడం తప్ప. నిపుణుల కమిటీ రిపోర్టు అసెంబ్లీలో పెడతాం. చర్చిస్తాం. అందరి అభిప్రాయాలూ తీసుకుంటాం' అని చెప్పారు. ఒకవేళ జగన్ ఊహించినట్లుగానే కమిటీ నివేదిక ఇస్తే.. చంద్రబాబును నమ్మి మోసపోయిన రైతులు జగన్‌ను కలిస్తే న్యాయం జరుగుతుందన్నారు. రియల్ ఎస్టేట్ బ్రోచర్‌కు, అమరావతి గ్రాఫిక్స్‌కు తేడా లేదని విమర్శించారు.

### 90 శాతం రాష్ట్రాల్లో వేర్వేరుగా..

ఆంధ్ర, తెలంగాణలో తప్ప దేశంలో 90 శాతం రాష్ట్రాల్లో సచివాలయం ఒక చోట, హైకోర్టు మరో చోట ఉన్నాయని మంత్రి చెప్పారు. 'మేమేమైనా లక్ష కోట్లతో, రెండు లక్షల కోట్లతో రాజధాని నిర్మాణం చేస్తామని చెప్పామా? అసెంబ్లీలో బడ్జెట్, శీతాకాల, వర్షాకాల సమావేశాలు కలిపి 60 రోజులు తప్పితే ఇతర రోజుల్లో నడిచే వ్యవస్థ ఇంకేముంది ఇక్కడ. జగన్ ఊహించినట్టుగా 3 ప్రాంతాల్లో రాజధాని ఉంటే ఏమవుతుంది? అమరావతిలో రోడ్లకే లక్ష కోట్లు ఖర్చయితే మిగిలిన సౌకర్యాలకు ఎంత కావాలి? అదే విశాఖలో పెడితే పెద్దగా ఖర్చుండదు. అక్కడ అన్ని మౌలిక వసతులూ ఉన్నాయి. అమరావతిలో జరుగుతున్న నిరసనలు విద్వేషపూరితంగా, కుట్రపూరితంగా చేస్తున్నవే. కొంతవరకు ఎమోషన్ కూడా ఉండొచ్చు. భూములిచ్చిన రైతుల సంఖ్య ఎంత? రోడ్డెక్కిన రైతుల సంఖ్య ఎంత? ఉదయం నుంచి రైతులతో సంస్కారం లేకుండా సీఎంను బూతులు తిట్టిస్తున్నారు. ఆ మాటలు మీడియా ప్రసారం చేస్తోంది. అది సమంజసం కాదు. లైవ్ ప్రసారమైతే తక్షణమే మైకు లాగేయాలి' అని మీడియాకు సూచించారు. ఐదేళ్లలో చంద్రబాబు 900 మందికి మాత్రమే ప్లాట్లు ఇచ్చారని.. వీళ్లెవరూ రైతులు కాదని.. రైతుల దగ్గర అసైన్డ్ భూములు కొన్నవారేనని ఆరోపించారు. 'మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ఉత్సవ విగ్రహం. కదలడు మెదలడు. మాట్లాడడు. బొమ్మలాగా ఉంటాడు. పైన ఒక బుష్ కోట్ వేస్తాడు. మండలి నడిపేదంతా లోకేశే. అసెంబ్లీలో తండ్రి ఆమోదించిన ఆంగ్ల మాధ్యమం, ఎస్సీ, ఎస్టీ కమిషన్ల విభజన బిల్లును మండలిలో కుమారుడు వ్యతిరేకించడం దొంగ నాటకం కాదా' అని ప్రశ్నించారు.

### ఐదేళ్లలో 5 సార్లు బాదారు

టీడీపీ హయాంలో ఐదేళ్లలో ఐదు సార్లు ఆర్టీసీ చార్జీలు పెంచారని మంత్రి ఆరోపించారు. ఇప్పుడు తాము పెంచినా సామాన్యులకు ఇబ్బంది లేదని చెప్పారు. '22 కిలోమీటర్ల వరకు రూపాయి పెరగలేదు. 3 స్టేజీల వరకు ఐదురూపాయలే తీసుకుంటారు. ఆటోలు, టెంపోలు ఎక్కితే రూ.10 తీసుకుంటున్నారు' అని తెలిపారు. 2430 జీవోతో ప్రజలకు, విలేకరులకు ఎవరికీ ఇబ్బంది లేదని.. అయినా దానిని పెద్ద సమస్యగా చిత్రీకరించి చంద్రబాబు సభ ముందుకు తీసుకొచ్చారన్నారు.

## ప్రాంతాల మధ్య చిచ్చుకే!

**ముగ్గురూ కొట్టుకు చావాలనేనా: యనమల**



అమరావతి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మూడు ప్రాంతాల ప్రజల మధ్య చిచ్చు పెట్టి ఒకరినొకరు కొట్టుకు చచ్చేలా చేయడానికే మూడు రాజధానుల అంశాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ముందుకు తెచ్చారని శాసనటీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు విమర్శించారు. ఇప్పుడు ఎవరిని కాదన్నా వారికి కోపం వస్తుందని, ఒకరితో ఒకరు దెబ్బలాడుకోవడానికే ఈ నిర్ణయం తీసుకొన్నారని వ్యాఖ్యానించారు. బుధవారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'కావాలని కక్షపూరితంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. అందరూ కలిసిమెలిసి ఉండాలి. ఒకరి సౌకర్యం మరొకరికి అసౌకర్యం కాకూడదు. దూరాభారం చూసుకోవాలి. అమరావతి భౌగోళికంగా అందరికీ సమదూరంలో ఉంది. ఇది వద్దనుకుంటే ఒకటి చెప్పండి. అంతేగాని మూడు రాజధానులు కాదు. భావోద్వేగాలను సంతృప్తి పర్చాలని వెళ్తే రాష్ట్రం నాశనమవుతుంది. మూడు చోట్ల రాజధానులు పెడితే ఖర్చు పెరగడం తప్ప ప్రయోజనం లేదు. ఇప్పటికే ఖజానా ఖాళీ అయింది. అభివృద్ధి ఆగిపోయింది. నవరత్నాలకే డబ్బులు లేవు. కర్నూలు ప్రాంతం వారు అమరావతికి రావడానికే ఇబ్బంది పడుతున్నారు.. విశాఖ వెళ్తారా? శ్రీకాకుళం వారు కోర్టు పనులకు కర్నూలు వెళ్లాలంటే ఎంత ఖర్చు? ఏ ఆలోచన లేకుండా ప్రకటనలు చేయడం చిచ్చు పెట్టడానికే' అని మండిపడ్డారు. జగన్‌కు, ఆయన వెంట ఉన్న వారికి హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున భూములు ఉన్నాయి. వాటి విలువలు పెంచుకోవడానికే ఇక్కడ సరైన రాజధాని ఒకటి లేకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇక్కడ ఒక నగరం అభివృద్ధి అయితే అక్కడ విలువలు తగ్గుతాయని.. అందుకే ఈ పనులు చేస్తున్నట్లు అనిపిస్తోందన్నారు. వికేంద్రీకరణ అంటే అభివృద్ధిలో జరగాలి తప్ప కార్యాలయాల్లో కాదని, అభివృద్ధి చేసే మార్గాలు వెతకలేక కార్యాలయాల గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. హైకోర్టు కావాలన్న కోరిక కర్నూలులో ఉంది. దానికి ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ పరిపాలన, శాసన వ్యవస్థను వేరు చేసి తలా ఒకచోట పెట్టాలనడం సరైన ఆలోచన కాదు' అని స్పష్టం చేశారు.

### జగన్ ప్రకటనతో ప్రాంతాల మధ్య చిచ్చు: బుద్దా

"సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇంతకాలం కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టారు. తాజాగా మూడు రాజధానులంటూ అసెంబ్లీలో ప్రకటన చేసి ప్రాంతీయ విభేదాలకు తెరతీశారు" అని ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మండిపడ్డారు. ఒక కులాన్ని లక్ష్యంగా చేసుకుని రాష్ట్ర ప్రజలందరినీ ఇబ్బందులకు గురిచేస్తున్నారని దుయ్యబట్టారు. విజయవాడలో మీడియాతో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రాజధానిపై చేసిన ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరారు. ఆఫ్రికాని ఆదర్శంగా తీసుకొని మూడు రాజధానులు ఏర్పాటు చేస్తామని ప్రకటించినపుడే సీఎం జగన్ అజ్ఞాని అని అర్థమైపోయింద వెంకన్న ట్వీట్ చేశారు. ఓ రొట్టె ప్యాకెట్ కోసం కొట్టుకొనే దేశంలా ఆంధ్రప్రదేశ్ కావాలని సీఎం కోరుకోవడం... దానికి ఆహా ఏమి చెప్పారంటూ ప్రపంచ అజ్ఞాని అయిన విజయసాయిరెడ్డి భజన చేయడం హాస్యాస్పదంగా ఉందని ఆ ట్వీట్‌లో ఎద్దేవా చేశారు.



కేవలం చంద్రబాబు తలపెట్టిన కార్యక్రమం కాబట్టే అమరావతిని రాజధాని చేయలేకపోతున్నారా? లేదంటే అమరావతి ఓ గొప్ప కార్యక్రమం కాబట్టే మేము చేయలేమంటున్నారా?. ప్రజలు కోరుకుంటున్నది రాజధాని మార్పు కాదని, అభివృద్ధి వికేంద్రీకరణ

**- ఎంపీ రామ్మోహన్‌రావు**



రాష్ట్రంలో మూడు రాజధానులను ఏర్పాటు చేయడం ప్రాక్టికల్‌గా సాధ్యం కాదు. ఐదు కోట్ల జనాభా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు మూడు రాజధానులు అవసరమైతే.. ఇరవై కోట్ల జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్‌కు పన్నెండు రాజధానులు కావాలా?

**- ఎంపీ కేశినేని నాని**



మూడు రాజధానులపై ముందే నిర్ణయం తీసుకున్నారా? ప్రధాని శంకుస్థాపన చేసిన రాజధానిపై రాష్ట్ర ప్రభుత్వం ఎలా కమిటీ వేసింది? ఆ కమిటీ నివేదిక రాకముందే రాజధానిపై సీఎం ఎలా ప్రకటన చేస్తారు?'

**- ఎంపీ గల్లా జయదేవ్**




## అభివృద్ధి వికేంద్రీకరణను స్వాగతిస్తాం: చలసాని శ్రీనివాస్



విజయవాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'రాజధాని ఎక్కడున్నా మాకు సమ్మతమే. అన్ని ప్రాంతాలు సమాంతరంగా అభివృద్ధి చెందాలి. అభివృద్ధి వికేంద్రీకరణను స్వాగతిస్తున్నా' అని హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికార కేంద్రాల వికేంద్రీకరణ జరుగుతోంది.. ఈ వికేంద్రీకరణలో రైతుల సమస్య ఎవరు పరిష్కరిస్తారు అని ప్రశ్నించారు. దక్షిణాఫ్రికాకు, ఏపీకి పోలికేమిటని అడిగారు.

## విశాఖ కేంద్రంగా వైసీపీ నేతల ఇన్‌సైడర్ ట్రేడింగ్: పంచుమర్తి



(ఆంధ్ర జ్యోతి న్యూస్ నెట్‌వర్క్): "గత ఆరు నెలల కాలంలో విశాఖ కేంద్రంగా వైసీపీ నేతలు ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విశాఖలో పెద్ద ఎత్తున భూ కుంభకోణాలు జరిగాయి. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలి" అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పంచుమర్తి అనురాధ డిమాండ్ చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె బుధవారం మాట్లాడారు. వైసీపీ నేత విజయసాయిరెడ్డి కొద్ది నెలలపాటు విశాఖలోనే మకాం చేసి పెద్ద ఎత్తున భూముల కొనుగోళ్లు జరిపించారని ఆరోపించారు. ఓ స్వామీజీ ఆశ్రమం కేంద్రంగా ఈ దందా సాగిందన్నారు. ప్రభుత్వాధినేతగా వుంటూ వైజాగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పెట్టాలన్న నిర్ణయానికి జగన్ ఎందుకొచ్చారో సమాధానం చెప్పాలని అనురాధ డిమాండ్ చేశారు. రాజధానిపై జగన్మోహన్‌రెడ్డివి మొదటి నుంచీ కుప్పిగంతులేనని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. జగన్ సూచనల మేరకు విశాఖ చుట్టపక్కల విజయసాయిరెడ్డి తదితరులు 6 వేల ఎకరాలు కొనుగోలు చేశారని ఆరోపించారు. సీబీఐతో విచారణ చేయిస్తే అసలైన ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఏమిటో బట్టబయలు అవుతుందని అన్నారు. గత 6 నెలలుగా వైసీపీ నేతలు విశాఖలో చేస్తున్న ఇన్‌సైడర్ ట్రేడింగ్‌ను అడ్డుకున్నందుకే జేసీ శివశంకర్‌ను బదిలీ చేశారని నక్కా ఆనంద్ బాబు ఆరోపించారు.

## మీ శాంతి వచనాల వల్లే ఇలా..!

(మొదటి పేజీ తరువాయి)

వస్తాడు.. ఎట్లాగైనా బాబును జైల్లో పెడితేనే మీ సెల్యూట్ రిసీవ్ చేసుకుంటానని చెబుతాడని మీకు చెప్పాను. అలా చేయకపోతే నీవు అన్‌ఫిట్ అంటాడని చెప్పాను. కారణం లేకుండా ఎలా లోపల వేసేదని డీజీపీ అంటే.. ఏమీ లేకపోయినా లోపలకు తొయ్యరా నీ..' అంటాడని చెప్పాను. సరిగ్గా అలాగే కాకపోయినా మా ఊర్లో ఇస్పేటాకులు ఆడుతున్న ఒక రిటైర్డ్ ఎస్పీపై గంజాయి కేసు పెట్టించారు' అని అన్నారు. చంద్రబాబులో కూడా మార్పు రావాలని తానీ మాటలు చెబుతున్నానని జేసీ అన్నారు. 'అధికారంలో ఉన్నపుడు శాంతి వచనాలు.. శాంతి వచనాలు.. అంటూ మమ్మల్ని సంకనాకించావు' అని వ్యాఖ్యానించారు. 'కానిస్టేబుళ్లు మా వాళ్ల దగ్గరకు వచ్చి.. కొడకా అక్కడ చేరకుండా నిన్ను గుడ్డలూడదీసి కొడతా.. అంటూ బెదిరించి పార్టీలు మార్పిస్తున్నారు సార్. ఎస్పీ కాకుండా మిగతా పోలీసులందరూ వంగివంగి నమస్కారాలు పెడుతూ ఉన్నారు.. నాకూ అవకాశమొస్తే బూట్లు నాకే పోలీసోళ్లను తెచ్చుకుని అదే గంజాయో.. చీప్ లిక్కరో జేబులో పెట్టి కేసు పెట్టిస్తా. ప్రభుత్వం అంటే ఏందో నాకు తెలుసు. నేనూ 15 ఏళ్లు మంత్రిగా ఉన్నా. వాస్తవంగా మన ఎమ్మెల్యేలను మార్చాలని గతంలో చెప్పా. కానీ మీరు కొన్ని కారణాల వల్ల మార్చలేదు. సరే.. ఇప్పుడు చెబుతున్నా.. మన ఎమ్మెల్యేలు వైసీపీ ఎమ్మెల్యేలకన్నా వేల రెట్లు మేలు. రెండున్నరేళ్లలో ఎన్నికలొస్తాయి. మిమ్మల్ని అందరూ మోసం చేశారు. ఏనాడైనా మీరు మమ్మల్ని గానీ, అధికారులను గానీ ఒక్క మాటైనా అన్నారా..? ఒక్కసారైనా గట్టిగా మాట్లాడలేదు. మిమ్మల్ని అందరూ పొగుడుతారు. తప్పట్లకు తాళాలకు దయచేసి లొంగొద్దు సార్..' అని చంద్రబాబుకు జేసీ సూచించారు.

## అనుచిత వ్యాఖ్యలు సరికాదు

- జేసీ వ్యాఖ్యలకు పోలీసు అధికారుల సంఘం ఖండన

అనంతపురం క్రైం, డిసెంబరు 18: పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డికి తగదని అనంతపురం జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు అన్నారు. తాము అధికారంలోకి వస్తే బూట్లు నాకే పోలీసులను పెట్టుకుంటామని పోలీసు వ్యవస్థనే కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడంపై వారు మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో జేసీ దివాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను స్థానిక పోలీసు అధికారుల సంఘం కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి వారు ఖండించారు. పోలీసులు ప్రజాశ్రేయస్సు, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని, అలాంటివారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. గతంలోనూ పోలీసువ్యవస్థపై ఇలాగే వ్యాఖ్యలు చేసి ఏ స్థాయికి చేరుకున్నారో గుర్తుంచుకోవాలన్నారు. బూట్లు నాకే పరిస్థితి పోలీసులకు ఎన్నటికీ రాదని, ఆయన మాటలు కలగానే మిగిలిపోతాయన్నారు. ఏదైనా ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలే గానీ.. పోలీసులను బాధ్యులను చేయడం, అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని వారు హితవు పలికారు. జేసీపై ఫిర్యాదు చేసేందుకు పోలీసు ఉన్నతాధికారుల అనుమతి కోరామన్నారు. విలేకరుల సమావేశంలో సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, జాఫర్, తేజ్‌పాల్, హరినాథ్, శివప్రసాద్ పాల్గొన్నారు.

### భారత ముస్లింలకు వ్యతిరేకం కాదు



నిరసనలు శాంతియుతంగా జరపాలి. మన భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలి. నిజానికి పౌరసత్వ చట్టం భారత్‌లో ఉన్న ముస్లింలకు వ్యతిరేకం కాదు. అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ నుంచి వచ్చే ముస్లింలకు మాత్రం భారత పౌరసత్వం లభించదు.

- అహ్మద్ బుఖారి, ఢిల్లీ షాహీ ఇమామ్

### అమిత్‌షా.. డయ్యర్ కంటే దారుణం



అమిత్ షా బ్రిటిష్ జనరల్ డయ్యర్ కంటే దారుణంగా ప్రవర్తిస్తున్నారు. జలియన్ వాలా బాగ్‌లో నిరాయుధులపై జనరల్ డయ్యర్ కాల్పులు జరిపినట్లే, అమిత్ షా సీఏఏతో భారత పౌరులపై విరుచుకుపడ్డారు. అన్ని ప్రాంతాల్లో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

- నవాబ్ మాలిక్, ఎన్సీపీ నేత



సీఏఏకు వ్యతిరేకంగా భోపాల్‌లో భారీ ప్రదర్శన

# స్టే ఇవ్వం

## రాజ్యాంగబద్ధత పరిశీలిస్తాం.. పౌరసత్వ చట్టంపై సుప్రీం

- కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు
- విచారణ జనవరి 22కు వాయిదా



**36 ఏళ్ల తరువాత మళ్లీ లాయర్‌గా గొగోయ్!**

అసోం మాజీ సీఎం తరుణ్ గొగోయ్ 36 ఏళ్ల తర్వాత మళ్లీ లాయర్ గౌను ధరించారు. న్యాయవాది అయిన గొగోయ్ 1983లో చివరిసారి కోర్టుకు వచ్చారు. ఆయన కాంగ్రెస్ తరఫున మూడుసార్లు ముఖ్యమంత్రిగా పని చేశారు. ఇప్పుడు సీఏఏకు వ్యతిరేకంగా మళ్లీ వాదిస్తున్నారు.



పద్మశ్రీ అవార్డును వెనక్కి ఇచ్చిన ఉర్దూ రచయిత ముజ్తాబా హుస్సేన్

న్యూఢిల్లీ, డిసెంబరు 18: పౌరసత్వ చట్టంపై ఆందోళనలు మిన్నంటిన వేళ సుప్రీంకోర్టులో కేంద్రానికి కాస్త ఊరట లభించింది. చట్ట అమలుపై స్టే ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది.చట్టంలో ఏముందో పూర్తిగా తెలియదని, నాలుగైదు అంశాలను చూసి స్టే ఇవ్వడం కుదరదని, చట్టాన్ని ప్రచురించాక దీన్ని కోరవచ్చని తెలిపింది. అయితే ఈ చట్టం రాజ్యాంగబద్ధతను పరిశీలిస్తామని తేల్చిచెప్పింది. ఈ మేరకు కేంద్రానికి నోటీసులిచ్చి జనవరి రెండోవారంలోగా బదులివ్వాలని కోరింది. కేసు తదుపరి విచారణను జనవరి 22కు వాయిదావేస్తున్నట్లు సీజేఐ జస్టిస్ శరద్ బోబ్డే, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఏఆర్ గవాయ్‌ల ధర్మాసనం ప్రకటించింది. పౌరసత్వ చట్టం రాజ్యాంగవిరుద్ధమంటూ అసోంకు చెందిన అనేక గ్రూపులు, కాంగ్రెస్, టీఎంసీ, మజ్లిస్ సహా వివిధ పక్షాలు దాఖలు చేసిన 60 పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం విచారణ మొదలెట్టింది. "అల్లర్లతో ఈశాన్యం అట్టుడుకుతోంది. ఐదుగురు విద్యార్థులు మరణించారు. అసోం మండిపోతోంది. దేశ రాజధానికి, మరికొన్ని ప్రాంతాలకూ పాకింది. ఈ చట్టం సమాజంలో విభజన రేపుతోంది. దీని అమలు ఆపాలి" అని ఏజీపీ, కాంగ్రెస్ సహా పలువురు పిటిషనర్ల తరఫు న్యాయవాదులు గట్టిగా కోరారు. అటార్నీ జనరల్ కల్పించుకొని "చట్టం నోటీపై కాకుండా స్టే ఇవ్వరాదని గతం లో 4 తీర్పుల్లో పేర్కొన్నారని" కోర్టు దృష్టికి తెచ్చారు. గెజిట్ నోటిఫికేషన్ జరిగినా ఇంకా ప్రజా పరిశీలనకు పెట్టలేదన్నారు.

### పాక్ కోర్టును ప్రస్తావించిన ఏజీ





సీఏఏకు వ్యతిరేకంగా అనేక పిటిషన్లు రావడంతో సీజే ఉన్న కోర్టు నెంబర్-1 హాలు లాయర్లతో కిక్కిరిసిపోయింది. ఎవరికి వారు మాట్లాడుతుండడంతో ఏం జరుగుతోందో తెలియని పరిస్థితి నెలకొంది. దీనిపై సీజే బోబ్డే అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఒకరి తరువాత మరొకరు వాదనలు వినిపించాలని, కొత్త పాయింట్లే చెప్పాలని కోరారు. 'బ్రిటన్‌లో ఒక లాయర్ వాదించిన తర్వాత మరో లాయర్ వాదిస్తారు. అలాగే మీరూ వ్యవహరించాలి' అని సీజే కోరారు. అటార్నీ జనరల్ లేచి 'పాకిస్థాన్ సుప్రీంకోర్టులో క్రమశిక్షణ ఉంటుంది. అక్కడ పోడియంలో ఒకే లాయర్ వాదనలు వినిపిస్తారు. సహాయకుడు కొంత దూరంలో దస్త్రాలతో ఉంటాడు. ఇక్కడా అలానే ఉండాలి" అనడంతో లాయర్లంతా నవ్వారు. బెంచ్ కూడా ఆశ్చర్యంతో ఏజీవైపు చూసింది.

## భారత్‌లో ఇంటర్నెట్ బంద్‌ను ప్రశంసించిన చైనా

బీజింగ్, డిసెంబరు 18: పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పెల్లుబికుతున్న ఆందోళనలు వ్యాప్తి చెందకుండా, తప్పుడు వార్తలు ప్రజల్లో చక్కర్లు కొట్టకుండా భారత్ తీసుకున్న 'ఇంటర్నెట్ బంద్' నిర్ణయాన్ని చైనా స్వాగతించింది. దీన్ని ప్రశంసిస్తూ చైనా కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలోని పీపుల్స్ డైలీ తన మంగళవారంనాటి ఆన్‌లైన్ సంచికలో ఓ వ్యాసాన్ని ప్రచురించింది. "జాతీయ ప్రయోజనాల రీత్యా ఇలాంటి నియంత్రణ అవసరం. ఇది సహేతుకం.. ముఖ్యంగా దేశ భద్రతకు ముప్పుందని భావించినపుడు దీన్ని తప్పక చేయాల్సిందే" అని అందులో పేర్కొంది. తొమ్మిదేళ్ల కిందట జాతుల ఘర్షణతో అట్టుడికిన జిన్‌జియాంగ్ రాష్ట్రంలో తామూ ఇలాంటి చర్య తీసుకున్నామని గుర్తు చేసింది.

## న్యాయంలో జాప్యంతో అశాంతి: సీజేఐ



న్యూఢిల్లీ, డిసెంబరు 18: న్యాయంలో జాప్యం వల్ల సమాజంలో అశాంతి చెలరేగుతోందని సుప్రీం కోర్టు సీజేఐ జస్టిస్ ఎస్ఏ బోబ్డే హెచ్చరించారు. ప్రజల నుంచి ఆందోళనలు, తిరుగుబాటు కూడా ఎదురవుతాయన్నారు. దేశంలో అత్యాచార కేసులు పెరిగిపోతుండటాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. సుమోటోగా అత్యాచారాలపై రిట్‌ను బుధవారం సీజేఐ నమోదు చేశారు. అత్యాచార బాధితులకు వేగవంతంగా న్యాయం అందించేందుకు ప్రస్తుత న్యాయవ్యవస్థ చట్రం, పోలీసు చర్యలను పటిష్ఠం చేయడంతోపాటు జవాబుదారీతనం తీసుకురావాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేశారు. అత్యాచార కేసుల్లో లీగల్ చర్యలకు ప్రస్తుతం ఉన్న మార్గాలపై స్టేటస్ నివేదిక సమర్పించాలని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధానకార్యదర్శులు, డీజీపీలను ఆదేశించారు.

## జైపూర్ పేలుళ్ల కేసు... నలుగురి దోష నిర్ధారణ

జైపూర్, డిసెంబరు 18: జైపూర్ నగరంలో పదకొండేళ్ల క్రితం 71 మందిని బలిగొన్న వరుస బాంబు పేలుళ్ల కేసులో నలుగురు ఉగ్రవాదులను ప్రత్యేక న్యాయస్థానం దోషులుగా నిర్ధారించింది. వారి నేరానికి ఎంత శిక్ష వేయాలన్న దానిపై గురువారం విచారణ జరగనుంది. ఒకరిపై ఆరోపణలు రుజువు కాకపోవడంతో నిర్దోషిగా విడుదల చేసింది. 2008 మే 13 రాత్రి ఏడు గంటలకు జైపూర్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో వరుసగా తొమ్మిది బాంబులు పేలగా 71 మంది మరణించారు. 185 మంది గాయపడ్డారు. మంగళవారం రోజు రద్దీగా ఉండే హనుమాన్ ఆలయం వద్ద మారణ హోమం సృష్టించడం ఈ దాడి ఉద్దేశం.

## హంతకుడిని పట్టించిన చొక్కా గుండీ

ఔరంగాబాద్, డిసెంబరు 18: ఒక మద్యం దుకాణంలో పనిచేసే వ్యక్తిని దుండగులు పొడిచి చంపేశారు. అతని వద్ద ఉన్న నగదు దోచుకుపోయారు. ఈ ఏడాది మే 12న మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఈ హత్య జరిగింది. ఘటనా స్థలంలో అంగీ (చొక్కా) గుండీ తప్ప పక్కా ఆధారాలేవీ పోలీసులకు దొరకలేదు. ఆ బొత్తంతోనే దర్యాప్తు మొదలుపెట్టారు. 'రోప్ లాస్ట్ స్టిచ్'... ఇదీ ఆ బొత్తంపై రాసి ఉన్న పేరు. ఆ కంపెనీ చొక్కాలు అమ్మే ఆన్‌లైన్ వ్యాపారులను సంప్రదించారు. దాదాపు 10 వేల మంది ఆ కంపెనీ అంగీలు కొన్నట్లు తేలింది. ఆ జాబితాలో నేర చరిత్ర ఉన్న 246 మందిని గుర్తించారు. వీరిని విచారించి అజయ్ గులాబ్‌రావు రగడే (30) అనే వ్యక్తి రెండు కత్తులు కొన్నట్లు కనుగొన్నారు. అతన్ని పట్టుకునే సరికి మిగతా ఇద్దరు నిందితులు చేతన్ అశోక్ గైక్వాడ్, సందీప్ ఆశారాం గైక్వాడ్ కూడా దొరికారు.

# మరింత ఆలస్యం!

- నిర్భయ దోషుల ఉరిపై విచారణ వాయిదా

న్యూఢిల్లీ, డిసెంబరు 18: 'ఉరి తీయాల్సిందే! పాత తీర్పుపై సమీక్ష అక్కర్లేదు'... నిర్భయ కేసులో ఉదయం సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశం! దీంతో బాధితులలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఇక... ఆ దుర్మార్గులకు ఉరి ఉత్తర్వులు వెలువడటమే తరువాయి అనే వార్తలు వెలువడ్డాయి. కానీ... మధ్యాహ్నానికే వారి ఆశలన్నీ అడియాశలయ్యాయి. నలుగురు దోషుల ఉరితీతకు ఉత్తర్వులు (డెత్ వారెంట్) ఇవ్వాలని ఢిల్లీ ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై పాటియాలా కోర్టు విచారణను వచ్చే నెల 7కు వాయిదా వేసింది. దీంతో... 'ఇంకెన్ని వాయిదాలు? న్యాయం కోసం ఇంకెంతకాలం ఎదురుచూపులు' అంటూ నిర్భయ తల్లితోపాటు మహిళా సంఘాలు మండిపడ్డాయి. నిర్భయ కేసులో ఉరిశిక్ష పడిన నలుగురు దోషుల్లో ఒకడైన అక్షయ్ కుమార్ సింగ్ (33) దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం తోసిపుచ్చింది. నలుగురు దోషులకు మరణ శిక్ష విధిస్తూ 2017లో చెప్పిన తీర్పును మార్చాల్సిన అవసరమేదీ కనిపించలేదని జస్టిస్ ఆర్.భానుమతి నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తెలిపింది. "నిర్భయ మరణ వాంగ్మూలంపైనే సందేహాలున్నాయి. ఆమె స్వచ్ఛందంగా ఈ వాంగ్మూలం ఇవ్వలేదు. ఆమెతో పోలీసులు అలా చెప్పించారు. ఏకైక సాక్షి, నిర్భయ స్నేహితుడు అవనీంద్ర పాండే చెప్పిన సాక్ష్యం ఏమాత్రం నమ్మశక్యంగా లేదు" అని ఏపీ సింగ్ వాదించారు. 'కలియుగంలో మనుషులంతా బతికున్న శవాలుగానే ఉన్నారు. వాయు కాలుష్యంతో ఢిల్లీలో అందరి ఆయుష్షు తగ్గుతోంది. ప్రత్యేకంగా మరణ శిక్ష ఎందుకు?" అని వింత వాదన చేశారు. తీవ్రమైన కేసును 'కాలుష్యం'తో పోల్చడం దురదృష్టకరమని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇక... అక్షయ్ తరఫు న్యాయవాది వాదనలను సొలిసిటర్ జనరల్ తిప్పికొట్టారు. "ఈ వాదనలన్నీ పాతవే. దోషిపై ఎలాంటి జాలి, దయ చూపించాల్సిన అవసరం లేదు. ఇలాంటి మృగాన్ని సృష్టించినందుకు దేవుడు కూడా సిగ్గుపడి ఉంటాడు" అని తెలిపారు. ఆ తర్వాత అక్షయ్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు తీర్పు చెప్పింది.

### వాయిదాలు ఇంకెన్నాళ్లు: నిర్భయ తల్లి



డెత్ వారెంట్‌పై విచారణ వాయిదా వేయగానే నిర్భయ తల్లి ఆశా దేవి కోర్టు హాలులోనే బిగ్గరగా రోదించారు. "దోషులకు ప్రతిచోటా ఊరట లభిస్తోంది. హక్కులు వాళ్లకు మాత్రమే ఉంటాయా? మాకు ఉండవా? న్యాయం కోసం ఇంకా ఎన్నేళ్లు ఎదురు చూడాలి" అని ఆక్రోశించారు. దీంతో జడ్జి సతీశ్ కుమార్ స్పందిస్తూ... "మీపట్ల పూర్తి సానుభూతి ఉంది. మీ ఆవేదన అర్థం చేసుకోగలను. కానీ, వీళ్లకు కూడా హక్కులుంటాయి. నేను చట్టానికి కట్టుబడి ఉండాలి" అని తెలిపారు.

## ఇంజనీరింగ్ కాలేజీల్లో మూడో దఫా తనిఖీలు

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో బుధవారం ఆకస్మిక తనిఖీలు ప్రారంభమయ్యాయి. గురువారం కూడా తనిఖీలు కొనసాగనున్నాయి. ఇందుకోసం 16 బృందాలు కాలేజీలకు తరలివెళ్లాయి. తొలిదశలో భాగంగా నవంబరు 27-28 తేదీల్లో 20 కళాశాలల్లో 14 టీములు ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా, రెండో విడతలో భాగంగా ఈ నెల 12న 25 కాలేజీల్లో, 13న మరో 25 కాలేజీల్లో మొత్తం 17 బృందాల ద్వారా తనిఖీలు చేపట్టారు. మూడో విడతలో భాగంగా బుధ, గురువారాల్లో మరో 50 ఇంజనీరింగ్ కాలేజీల్లో తనిఖీలు నిర్వహించేందుకు వీలుగా ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ 16 టీములను నియమించింది. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) నిబంధనల మేరకు కళాశాలలు పనిచేస్తున్నాయో, లేదా ఏమైనా ఉల్లంఘనలు ఉన్నాయో పరిశీలించేందుకు కమిషన్ చర్యలు తీసుకుంటోంది.

## గుంటూరు కలెక్టర్‌పై డీఓపీటీకి ఫిర్యాదు

గుంటూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): 'ఈ సంవత్సరం క్రైస్తవ బిడ్డలకు చాలా సంతోషకరమైనది' అని వ్యాఖ్యానించిన గుంటూరు జిల్లా కలెక్టర్ ఐ.శామ్యూల్ ఆనంద్‌కుమార్‌పై కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ ట్రైనింగ్(డీఓపీటీ)కి లీగల్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం 'ఎల్‌ఆర్‌పీఎఫ్' ఫిర్యాదు చేసింది. స్థానిక సీతమ్మ కాలనీలోని బైబిల్ కళాశాలలో ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ... 'నా కుటుంబంలోనే కాకుండా జిల్లాలో ఉన్న క్రైస్తవ కుటుంబాల్లో ఈ సంవత్సరం క్రిస్మస్ చాలా ఆనందదాయకంగా ఉంటుందని తెలియజేస్తున్నా' అని వ్యాఖ్యానించారు. జిల్లా కలెక్టర్ హోదాలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సీసీఎస్(కాండక్ట్) రూల్స్ 1964ను ఉల్లంఘించడమేనని ఆ ఫిర్యాదులో ఎల్‌ఆర్‌పీఎఫ్ పేర్కొంది.

## జనవరి 17 నుంచి రైతు భరోసా కేంద్రాలు

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పంట దిగుబడులు, రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో రాష్ట్రంలో మూడు దశల్లో 11,158 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 17 నుంచి రైతుభరోసా కేంద్రాలు ప్రారంభంకానున్నాయి. జనవరిలో 3,300, ఫిబ్రవరిలో 5వేలు, ఏప్రిల్ నాటికి మిగిలిన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించనున్నారు. అలాగే రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాలను అందించడంలో ఈ కేంద్రాలు కీలకం కానున్నాయి. రైతులు తమకు కావాల్సిన ఇన్‌పుట్స్‌కు ఆర్డర్ ఇవ్వడానికి రైతుభరోసా కేంద్రాల్లో డిజిటల్ కియోస్క్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### ఈ-పంట నమోదు, బీమా కూడా..

రైతుభరోసా కేంద్రాల ఏర్పాటుపై బుధవారం సీఎం జగన్మోహన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 'రైతు భరోసా కేంద్రాల నుంచే ఈ-పంట నమోదు, పంటలకు, పశువులకు బీమా సదుపాయం కల్పించాలి. కౌలుదారుల సాగు ఒప్పందాల ప్రక్రియ కూడా నిర్వహించాలి. పంట ఉత్పత్తులకు ప్రభుత్వ మద్దతు ధరల వివరాలను ప్రదర్శించాలి. పంటల సాగు విధానాలపై డిజిటల్ సమాచారాన్ని ఉంచాలి. వాతావరణ సమాచార కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారాన్ని అందించాలి.' అని ఆదేశించారు.

## నిరూపిస్తే రాజకీయ సన్యాసం: ప్రత్తిపాటి

గుంటూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజధానిలో తనకు సెంటు భూమి ఉన్నట్లు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తానని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సవాల్ విసిరారు. ఆయన బుధవారమిక్కడ విలేకరులతో మాట్లాడారు. 'నాకు బినామీలు ఉన్నట్లు అసెంబ్లీ సాక్షిగా ఆరోపించారు. అభివృద్ధి చేతగాక దక్షిణాఫ్రికా లాంటి వెనుకబడిన దేశాలను ఆదర్శంగా చూపుతున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో అమరావతికి అనుకూలమని అసెంబ్లీలో చెప్పింది జగన్ కాదా? ఆయన మాట తప్పారు, మడమ తిప్పారు' అని విరుచుకుపడ్డారు. కాగా.. రాజధానిలో తనకు భూములున్నమాట వాస్తవమేనని టీడీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చెప్పారు. అయితే రాజధానిపై కేబినెట్ తీర్మానం తర్వాతే భూములు కొన్నానని బుధవారమిక్కడ స్పష్టం చేశారు. నిజంగా సీఎం జగన్‌కు అమరావతిని అభివృద్ధి చేసే ఆలోచన ఉంటే తన భూమిని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని జీవీ తెలిపారు.

# మళ్లీ మళ్లీ మార్చడమా?

- 'రాజధాని'పై ఉద్యోగుల్లో ఆందోళన
- నాడు ఇక్కట్ల మధ్యే అమరావతికి...
- ఇప్పుడిప్పుడే కుదురుకుంటున్న కొందరు
- ఇంకా హైదరాబాద్‌లోనే అత్యధికుల కుటుంబాలు
- విశాఖకు మార్చితే పరిస్థితి ఏమిటి?
- అన్నీ సర్దుకుని అక్కడికి పోవాల్సిందేనా!
- ప్రభుత్వ ఉద్యోగుల ప్రశ్నలు
- సంఘాల నేతలు మౌనం వీడాలని డిమాండ్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

"రాష్ట్రానికి 3 రాజధానులు ఉంటే తప్పేంటి? విశాఖలో పరిపాలనా రాజధాని ఉండొచ్చు. కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేయవచ్చు. అమరావతిలో చట్టసభలను కొనసాగించవచ్చు" అంటూ సీఎం జగన్ చేసిన ప్రకటన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో గుబులు రేపుతోంది. 'ఉండొచ్చు' అనే మాటే నిజమైతే.. మళ్లీ తట్టాబుట్టా సర్దుకోవాల్సిందేనా? అనేది కొందరి ఆందోళన! 'కుటుంబ సభ్యులను చూసేది రెండు మూడు వారాలకోసారేనా!' అనేది అవసరాల దృష్ట్యా ఇప్పటికీ కుటుంబాలను హైదరాబాద్‌లో పెట్టినవారి ఆవేదన! హైదరాబాద్ పదేళ్లు ఉమ్మడి రాజధాని అయినప్పటికీ... సొంత గడ్డ నుంచే పాలన సాగాలనే ఉద్దేశంతో నాడు చంద్రబాబు కార్యాలయాలన్నింటినీ అమరావతికి తీసుకొచ్చారు. సచివాలయంతోపాటు అన్ని ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలు (హెచ్‌వోడీ)లు 2016, 2017లో తరలి వచ్చేశాయి. పిల్లల చదువులు, సొంత ఇళ్లు, ఇతర అవసరాల రీత్యా హైదరాబాద్ విడిచి వచ్చేందుకు ఉద్యోగులు అయిష్టత చూపించారు. దీంతో... 'అమరావతి నుంచి పని చేయండి. మీకేం కావాలో చెప్పండి' అంటూ చంద్రబాబు వారికి అనేక వసతులు కల్పించారు. సచివాలయం, హెచ్‌వోడీల సిబ్బందికి వారానికి ఐదు రోజుల పనిదినాలు నిర్ణయించారు. కుటుంబాలను వదిలి పెట్టి ఒంటరిగా వచ్చిన వారికి విజయవాడలో ఉచితంగా వసతి కల్పించారు. హైదరాబాద్-విజయవాడ మధ్య రాకపోకలు సులువుగా ఉండేందుకు కేంద్రాన్ని ఒప్పించి కొత్త రైలు వేయించారు. ఉద్యోగులు కూడా... ఇబ్బందులున్నప్పటికీ.. అమరావతికి వచ్చి పని చేస్తామంటూ సంసిద్ధత వ్యక్తం చేశారు.

### అంతా కుదురుకున్నాక...

'రాజధాని ఇక్కడే. ఉద్యోగాలూ ఇక్కడే. ఎన్నాళ్లని హైదరాబాద్ చుట్టూ తిరుగుతాం!' అనుకుని చాలామంది ఉద్యోగులు విజయవాడ, గుంటూరులో స్థిరపడిపోయారు. కొందరు సొంత ఇల్లు కూడా కొనుక్కున్నారు. పిల్లల చదువులు, జీవిత భాగస్వామి ఉద్యోగం.. వంటి కారణాలున్నవారు మాత్రం కుటుంబాలను అక్కడే ఉంచి వారం వారం హైదరాబాద్‌కు వెళ్లి వస్తున్నారు. ఇప్పుడు రాజధాని విశాఖపట్నం మారితే మళ్లీ ఇబ్బందులు తప్పవని ఉద్యోగులు పేర్కొంటున్నారు. 'ఇక్కడ కొన్న ఇల్లు వదిలేసి మళ్లీ విశాఖ వెళ్లాలి. మళ్లీ అద్దె ఇల్లు తీసుకోవాలి. ప్రతి వారం హైదరాబాద్‌కు వెళ్లి కుటుంబాన్ని చూసుకుంటున్న వారు ఎందరో ఉన్నారు. విశాఖ నుంచి హైదరాబాద్‌కు అలా వెళ్లి రావడం సులభం కాదు. సీఎం ప్రకటన ఆందోళన కలిగిస్తోంది' అని వాపోతున్నారు.

### ఉద్యోగ నేతలు మాట్లాడరే...

'మూడు రాజధానులు ఉండొచ్చు' అన్న ముఖ్యమంత్రి ప్రకటనపై సర్వత్రా చర్చ జరుగుతోంది. తక్షణ, ప్రత్యక్ష ప్రభావం పడే ఉద్యోగుల్లో దీనిపై మరింత ఆందోళన వ్యక్తమవుతోంది. అయినప్పటికీ... ఉద్యోగ సంఘాల నేతలు ఈ అంశంపై స్పందించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు దీనిపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఒకప్పుడు ఉద్యోగులకు చిన్న ఇబ్బంది కలిగించే ప్రకటన వచ్చినా ప్రభుత్వంపై విరుచుకుపడే ఉద్యోగ సంఘాలు ఇప్పుడెందుకు మౌనంగా ఉన్నాయని ప్రశ్నిస్తున్నారు. గతంలో ఉద్యోగ సంఘాల నేతలు తమ డిమాండ్లు, అభ్యర్థనలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేవారు. ఉద్యోగుల విషయంలో 'మితి మీరిన ఫ్రెండ్లీ'గా ఉన్నారనే విమర్శలు వచ్చినా... చంద్రబాబు పట్టించుకోకుండా వీలైనంత వరకు వారి డిమాండ్లను పరిష్కరిస్తూ వచ్చారు. ఇప్పుడు ఉద్యోగ సంఘాల తీరు పూర్తిగా మారిపోయిందని, తమ సమస్యలను సూటిగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లలేకపోతున్నారని విమర్శలు వస్తున్నాయి.

### మళ్లీ మళ్లీ మార్చేస్తారా!?

"ప్రభుత్వం రోజుకో ప్రకటన చేసి ప్రజలు, ఉద్యోగుల్లో అనిశ్చితి సృష్టించడం సరికాదు. రాజధాని ప్రారంభమై, అమరావతిలో కుదురుకున్న తర్వాత ఇప్పుడు డిస్టర్బ్ చేయడమేమిటి? రాజధాని నిర్ణయం ఒక సారే జరుగుతుంది. సీఎం మారినప్పుడల్లా రాజధాని మార్చడం ఎక్కడైనా ఉందా? వచ్చే ఎన్నికల్లో మరో ప్రభుత్వం అధికారంలోకొస్తే మళ్లీ రాజధాని మార్చేస్తారా? మళ్లీ మేం తట్టాబుట్టా సర్దుకుని వచ్చేయాలా?"

- ఉద్యోగుల ప్రశ్న

## బాబు తాన.. పవన్ తందాన!

- మంత్రి అవంతి శ్రీనివాస్ ధ్వజం

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు తాన అంటే జనసేన అధినేత పవన్ కల్యాణ్ తందాన అంటున్నారని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. చంద్రబాబు ట్రాప్‌లో పడొద్దని పవన్‌కు సూచించారు. బుధవారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజధానిపై సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం ఏ వర్గానికో, ప్రాంతానికో వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం కాదని, దీనిపై అమరావతిలోని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. అమరావతి శాసన నిర్వాహక రాజధానిగా ఉంటుందని చెప్పారు. విశాఖలో ఎగ్జిక్యూటివ్ రాజధాని పెట్టాలనుకోవడం మంచి నిర్ణయమన్నారు. రాజధాని రాకముందే విశాఖలో తనకు భూములు ఉన్నాయన్నారు. గతంలో చంద్రబాబు రైతుల వద్ద భూములు బలవంతంగా లాక్కున్నారని పవన్ ఆందోళన చేశారని, ఇప్పుడు మరోలా మాట్లాడుతూ బాబు తాన అంటే తందాన అంటున్నారన్నారు. గంటా లాంటి అవకాశవాదులు తమ పార్టీలోకి రావాలనుకుంటున్నారన్నారు.

## వచ్చేవారం జీఎన్ రావు నివేదిక?

- '3 రాజధానుల' ప్రకటనతో పెరిగిన ఆసక్తి

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ సమానంగా అభివృద్ధి చెందేందుకు తోడ్పడే సలహాలు, సూచనలు ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జీఎన్ రావు కమిటీ తన నివేదికను వచ్చే వారంలో సమర్పించనున్నట్లు తెలిసింది. రాష్ట్ర రాజధానిగా అమరావతి ఇకపై కూడా కొనసాగనున్నదా? లేదా? అనే అంశాన్ని ఈ కమిటీ ఇచ్చే నివేదిక ప్రభావితం చేయొచ్చునన్న ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా తొలి నుంచీ పలువురు ఈ నివేదికపై ఆసక్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో మన రాష్ట్రానికి 3 రాజధానులు ఉండొచ్చునని సీఎం జగన్ మంగళవారం అసెంబ్లీలో చేసిన ప్రకటన తీవ్ర చర్చనీయాంశమైంది. జీఎన్ రావు కమిటీ నివేదిక కూడా ఇదే సూచించవచ్చునని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇదిలావుండగా, అమరావతిలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులను నిశితంగా పరిశీలించి, వాటిని ప్రస్తుతావసరాల మేరకు అవసరమైతే కుదించడం లేదా ప్రత్యామ్నాయాలను సూచించడమో చేయాలన్న ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు రాజధానికి వచ్చిన రూర్కీ ఐఐటీ నిపుణుల తొలివిడత పర్యటన బుధవారంతో పూర్తయింది. తమ పర్యటనలో భాగంగా మంగళవారం అమరావతిలో పర్యటించి, అక్కడి వివిధ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఈ నిపుణులు... ఏపీసీఆర్డీయే, ఏడీసీ ఉన్నతాధికారులతోనూ భేటీ అయ్యారు.

## రాజధాని ప్రకటన వచ్చాకే పదెకరాలు కొన్నాను

- 15 ఏళ్ల క్రితం ఆరెకరాలు కొన్నా.. మంత్రి బుగ్గన ఆరోపణలు అబద్ధం
- లోకేశ్‌తో వ్యాపార లావాదేవీల్లేవు.. వేమూరి రవికుమార్ స్పష్టీకరణ

అమరావతి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా రాజధాని ప్రకటనకు ముందు తాను భూములు కొన్నట్లు నిరూపిస్తే.. ఆ భూములను ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రభుత్వానికి అప్పగించేందుకు తనకు అభ్యంతరం లేదని ఏపీఎన్ఆర్‌టీ మాజీ అధ్యక్షుడు వేమూరి రవికుమార్ ఉద్ఘాటించారు. 'రాజధాని అమరావతి ప్రాంతంలో నేను 500 ఎకరాలు కొనుగోలు చేసి రూ.650 కోట్ల లబ్ధి పొందానని కొందరు గత మూడేళ్లుగా ప్రచారం చేస్తున్నారు. నిన్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ.. నేను నారా లోకేశ్‌కు సన్నిహితుడినని.. వ్యాపార భాగస్వామినని అన్నారు. 25.68 ఎకరాలు కొనుగోలు చేసి ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డానని చెప్పారు. ఆయన ఆరోపణలన్నీ పూర్తి అబద్ధం. అమరావతి ప్రాంతంలో ఏప్రిల్ 2004, 2005ల్లో 6.30 ఎకరాలు కొనుగోలు చేశాను. రాజధాని ప్రకటన వచ్చాక 9.86 ఎకరాలు కొన్నాను. ఈ 16.16 ఎకరాల్లో ఆరు ఎకరాలు రాజధాని పరిధికి అవతల ఉంది. ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా రాజధాని ప్రకటనకు ముందు నేను భూములు కొనుగోలు చేశానని నిరూపిస్తే.. ఆ భూములను ప్రభుత్వానికి అప్పగించేందుకు అభ్యంతరం లేదు..' అని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ భూమి కాకుండా తనకు 10 శాతం కంటే తక్కువ భాగస్వామ్యం ఉన్న కంపెనీలు కొనుగోలు చేసిన వాటిని కూడా కలిపి మొత్తం 25.68 ఎకరాలు తన పేరుతో ఉన్నట్లు బుగ్గన చెప్పారని.. పైగా ఆయా కంపెనీలు కొనుగోలు చేసిన భూములు కూడా రాజధాని ప్రకటనతర్వాతే తప్ప.. ప్రకటనకు ముందు కాదన్నారు.

## నాకు 40 ఎకరాలా?.. ఈ శతాబ్దపు జోక్: రావెల

విజయవాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో తనకు 40 ఎకరాల భూమి ఉందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటనను మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు ఖండించారు. దీనిని ఈ శతాబ్దపు జోక్‌గా అభివర్ణించారు. మైత్రి ఇన్‌ఫ్రా అనే సంస్థకు, తనకు సంబంధం ఉందని నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొంటానని.. నిరూపించలేకపోతే బుగ్గన రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు బీజేపీ అండగా ఉంటుందని రావెల చెప్పారు.

## డెయిరీ ప్లాంటు కోసం కొన్నాం..

- బుగ్గన ఆరోపణలపై హెరిటేజ్ స్పందన

అమరావతి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): డెయిరీ ప్లాంటు పెట్టడం కోసం తమ సంస్థ గుంటూరు.. విజయవాడ నగరాల మధ్య భూమి కొనుగోలుచేసిందని.. అంతే తప్ప రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం కాదని హెరిటేజ్ సంస్థ స్పష్టం చేసింది. రాజధాని ప్రాంతంలో హెరిటేజ్ అక్రమంగా భూమి కొనుగోలు చేసిందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన ఆరోపణపై ఆ కంపెనీ అధ్యక్షుడు ఎం.సాంబశివరావు బుధవారం స్పందించారు. తాము కొన్న భూమి రాజధాని ప్రాంతంలో లేదని, దానికి 20 కి.మీ. దూరంలో ఉందని ఓ ప్రకటనలో తెలిపారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో తెలియక ముందే ఈ ప్రాంతంలో భూమి కొనుగోలుకు తమ సంస్థ నిర్ణయం తీసుకుందని, రాజధాని ఎక్కడో తేలక ముందే భూమిని కొనుగోలుచేసిందని వెల్లడించారు. 'గుంటూరు జిల్లాలో రేపల్లెలో మా సంస్థకు ఒక డెయిరీ ప్లాంటు ఉంది. వ్యాపార విస్తరణలో భాగంగా 2014లో అనంతపురం, గుంటూరు, నెల్లూరు, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల్లో భూములు కొన్నాం. గుంటూరు... విజయవాడ చుట్టుపక్కల మరో ప్లాంటు పెట్టడానికి 2013లోనే భూమి కోసం అన్వేషణ మొదలు పెట్టాం. గుంటూరు చుట్టుపక్కల కొనుగోలు చేయాలని 2014 మార్చి 21న జరిగిన బోర్డు డైరక్టర్ల సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం. అప్పటికి అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ పూర్తి కాలేదు. ఎవరు గెలుస్తారో కూడా తెలియదు. మా వ్యాపార అవసరాల కోసం గుంటూరుకు సమీపంలో తాడికొండ మండలం కంతేరు గ్రామ పరిధిలో మొత్తం ముగ్గురు భూ యజమానుల నుంచి సుమారుగా 14 ఎకరాల భూమిని జూలై, ఆగస్టు నెలల్లో కొనుగోలు చేశాం. రాజధాని ఎక్కడో ఆ తర్వాత డిసెంబరులో ప్రకటన వచ్చింది. మేం కొన్న 14 ఎకరాల్లో నాలుగున్నర ఎకరాల విషయంలో కొంత వివాదం వచ్చింది. మేం ఎల్ఇపీఎల్ సంస్థ నుంచి కొనుగోలు చేశాం. కొందరు వ్యక్తులు దానిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వివాదం ఉన్నట్లు గుర్తించి ఆ కొనుగోలును రద్దు చేసుకున్నాం' అని వివరించారు. తాము రాజధానిలో అక్రమంగా భూమి కొనుగోలు చేశామన్న ఆరోపణ సరికాదని, తమ కొనుగోలుకు, ప్రభుత్వానికి ఏ సంబంధం లేదని స్పష్టం చేశారు. గత 27 ఏళ్లుగా తమ సంస్థ కొన్ని విలువలకు కట్టుబడి పనిచేస్తోందని, ఆధారం లేని ఆరోపణలు చేయడం తగదని తెలిపారు.



కుల్దీప్‌కు విరాట్ అభినందన

## భారత్ నుంచి ఒకే ఒక్కడు

ఈ మ్యాచ్‌లో హ్యాట్రిక్ వికెట్లు పడగొట్టి స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో రెండుసార్లు హ్యాట్రిక్ సాధించిన తొలి భారత ఆటగాడిగా 25 ఏళ్ల కుల్దీప్ చరిత్ర సృష్టించాడు. రెండేళ్ల క్రితం (2017) కోల్‌కతా వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన వన్డేలో కుల్దీప్ తొలి హ్యాట్రిక్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ఓవరాల్‌గా రెండు సందర్భాల్లో హ్యాట్రిక్ తీసిన ఆటగాడిగా వసీం అక్రమ్, సక్లయిన్ ముస్తాక్ (పాకిస్థాన్), చమిందా వాస్ (శ్రీలంక), ట్రెంట్ బౌల్ట్ (న్యూజిలాండ్)తో కలిసి కుల్దీప్ రెండోస్థానంలో నిలిచాడు. ఇక.. క్రికెట్ చరిత్రలోనే అత్యధికంగా మూడుసార్లు హ్యాట్రిక్ తీసిన బౌలర్‌గా శ్రీలంక వెటరన్ పేసర్ లసిత్ మలింగ నెంబర్‌వన్ స్థానంలో ఉన్నాడు. గతంలో భారత్ నుంచి చేతన్ శర్మ, కపిల్ దేవ్, మహ్మద్ షమి ఒక్కో సందర్భంలో హ్యాట్రిక్ పడగొట్టారు.

## కోహ్లీ @400

నాలుగు వందల అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన ఎనిమిదో భారత ఆటగాడిగా విరాట్ కోహ్లీ నిలిచాడు. సచిన్ (664), ధోనీ (538), ద్రావిడ్ (509), అజరుద్దీన్ (433), గంగూలీ (424), కుంబ్లే (403), యువరాజ్ (402).. కోహ్లీ కంటే ముందున్నారు. ఓవరాల్‌గా ఈ మైలురాయిని చేరిన 33వ ఆటగాడు విరాట్.

## 7

ఈ ఏడాది వన్డేల్లో రోహిత్ చేసిన సెంచరీల సంఖ్య. టెస్టుల్లో మూడు సెంచరీలతో కలిపి ఈ ఏడాది అతను పది శతకాలు బాదాడు.

ఏమి బ్యాటింగ్, ఏమీ బౌలింగ్.. సిక్సర్ల సునామీ, బౌండరీల తుఫాన్! టాప్, మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ ఆకాశమే హద్దుగా చెలరేగి భారీ స్కోరు అందిస్తే.. ఆపై బౌలర్లు తమ పనిని నిర్విఘ్నంగా పూర్తిచేశారు. ఫలితంగా వెస్టిండీస్‌తో రెండో వన్డేలో టీమిండియా అద్భుత విజయం అందుకుంది. కసిగా ఆడాల్సిన మ్యాచ్‌లో మనోళ్ల ప్రదర్శన నభూతో.. అన్నట్టుగా ఉంటుంది కాబోలు. ముంబైలో జరిగిన కీలకమైన ఆఖరి టీ20లో మాదిరే ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టారు. ఆ మ్యాచ్‌లోలాగే రోహిత్, కేఎల్ రాహుల్ విజృంభించారు. ఆపైన రిషభ్ పంత్, శ్రేయాస్ అయ్యర్ విండీస్ బౌలింగ్‌ను తుత్తునియలు చేశారు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ హ్యాట్రిక్‌తో మెరిశాడు. మొత్తంగా కోహ్లీసేన సమష్టి ఆటతీరు కోట్లాదిమంది అభిమానులకు జీవితకాల అనుభూతిని మిగిల్చింది.

# కసిదీరా కొట్టారు

రోహిత్, రాహుల్ సెంచరీలు



శ్రేయాస్ అయ్యర్ (53)



రోహిత్ శర్మ (159)



కేఎల్ రాహుల్ (102)

- చెలరేగిన అయ్యర్, పంత్
- కుల్దీప్ రికార్డు హ్యాట్రిక్
- రెండో వన్డేలో వెస్టిండీస్‌పై టీమిండియా ఘన విజయం

## సచిన్ తర్వాత హిట్‌మ్యాన్

ఒక ఏడాది వన్డేల్లో అత్యధిక శతకాలు సాధించిన ఆటగాడిగా సౌరవ్ గంగూలీ (భారత్), డేవిడ్ వార్నర్ (ఆస్ట్రేలియా) సరసన రోహిత్ నిలిచాడు. హిట్‌మ్యాన్ వన్డే కెరీర్‌లో ఇది 28వ సెంచరీ కాగా.. ఈ ఏడాది అతనికిది ఏడోది. 2000లో గంగూలీ, 2016లో వార్నర్ ఒక కేలండర్ ఇయర్‌లో ఏడేసి శతకాలు బాదారు. అయితే, ఈ జాబితాలో సచిన్ టెండూల్కర్ టాప్‌లో ఉన్నాడు. 1998లో మాస్టర్ ఏకంగా 9 సెంచరీలతో అదరగొట్టాడు.



సచిన్ (1998లో 9 సెంచరీలు) | వార్నర్ (2016లో 7 సెంచరీలు) | రోహిత్ (2019లో 7 సెంచరీలు) | గంగూలీ (2000లో 7 సెంచరీలు)

## 1

ఈ ఏడాది ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాట్స్‌మన్‌గా రోహిత్ (159). 2013 నుంచి ప్రతీ ఏడాది భారత్ తరపున టాప్ స్కోరు శర్మదే.!

## 2

వెస్టిండీస్‌పై భారత్‌కు ఇది రెండో అత్యధిక స్కోరు. ఓవరాల్‌గా వన్డేల్లో టీమిండియా అత్యధిక స్కోర్లలో వైజాగ్‌లో సాధించిన 387 పరుగులది తొమ్మిదో స్థానం.

## 4

రోహిత్-రాహుల్ తొలి వికెట్‌కు 227 పరుగుల భాగస్వామ్యం.. భారత్ తరపున నాలుగో అత్యధికం. ఎక్కువ బంతులు (222) ఆడిన టీమిండియా జోడీల్లో మూడో స్థానం.

## ఆ బాధ్యత నాపై ఉంది: రోహిత్

మేం ఈ మ్యాచ్ నెగ్గడం ఎంతో అవసరం. రాహుల్ అద్భుతంగా ఆడడంతో నాకు కొంత వెసులుబాటు లభించింది. అతడిలో ఆత్మవిశ్వాసం పెరుగుతోంది. సీనియర్‌గా వీలైనన్ని పరుగులు చేయాల్సిన బాధ్యత నాపై ఉంది.

**విశాఖపట్నం (స్పోర్ట్స్):** సీన్ రివర్స్ అయింది. గత మ్యాచ్‌లో భీకరంగా కనిపించిన కరీబియన్లు బీరువులయ్యారు. భారత ఆల్‌రౌండ్ షోకు చేతులెత్తేశారు. ఫలితంగా ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో బుధవారం జరిగిన రెండో వన్డేలో భారత్ 107 రన్స్‌తో ఘన విజయం సాధించింది. మరోసారి టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లకు 387 పరుగుల భారీ స్కోరు చేసింది. రోహిత్ శర్మ (138 బంతుల్లో 17 ఫోర్లు, 5 సిక్సర్లతో 159), కేఎల్ రాహుల్ (104 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 102) సెంచరీలతో కదం తొక్కారు. ఆపై శ్రేయాస్ అయ్యర్ (32 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 53), రిషభ్ పంత్ (16 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 39) వాయు వేగంతో ఆడారు. అనంతరం వెస్టిండీస్ 43.3 ఓవర్లలో 280 పరుగులకు ఆలౌటైంది. షాయ్ హోప్ (85 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 78), నికొలస్ పూరన్ (47 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 75) హాఫ్ సెంచరీలతో రాణించారు. కీమో పాల్ (42 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సలతో 46) పర్లేదనిపించాడు. కుల్దీప్ యాదవ్ (3/52) హ్యాట్రిక్ సాధించగా, షమి (3/39) మూడు, జడేజా (2/74) రెండు వికెట్లు తీశారు. రోహిత్ శర్మ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్ నిర్ణయాత్మక వన్డే ఆదివారం కటక్‌లో జరగనుంది.

**ఆశలు రేపిన పూరన్, హోప్..:** లక్ష్యం ఓవర్‌కు 7.76. గత మ్యాచ్‌లో వెస్టిండీస్ బ్యాట్స్‌మెన్ హిట్టింగ్ చూస్తే ఆ జట్టుకూ అవకాశాలున్నాయనిపించింది. దానికితోడు ఈ స్టేడియం ఫ్లాట్‌పిచ్‌పై గత ఏడాది 321 రన్స్ ఛేదనలో అమోఘంగా ఆడిన కరీబియన్లు టీమిండియాతో మ్యాచ్‌ను టై చేశారు. రాహుల్ క్యాచ్ మిస్ చేయడంతో తొలి ఓవర్‌లో హోప్, రనౌట్ చాన్స్ మిస్సవడంతో రెండో ఓవర్లో లూయిస్ బతికిపోయారు. వీరిద్దరు ఓవర్‌కో ఫోర్ కొడుతూ ఇన్నింగ్స్‌ను నిదానంగా ముందుకు తీసుకెళ్లారు. కానీ 11వ ఓవర్లో లూయిస్ (35 బంతుల్లో 5 ఫోర్లతో 30)ను అవుట్ చేసిన శార్దూల్ ఠాకూర్ భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. మరో రెండు ఓవర్ల తర్వాత అయ్యర్ అద్భుత ఫీల్డింగ్‌కు 'హిట్' మయెర్ రనౌట్ అయ్యాడు. చేజ్ (4)ను జడేజా క్లీన్‌బౌల్డ్ చేయడంతో 86/3తో వెస్టిండీస్ కష్టాల్లో పడింది. కానీ హోప్, పూరన్ ఇన్నింగ్స్ చక్కదిద్దే బాధ్యతను చేపట్టారు. ఈ క్రమంలో హోప్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా..పూరన్ సైతం భారీ షాట్లతో చెలరేగి అర్ధసెంచరీ మార్క్ చేరాడు.

**షమి హ్యాట్రిక్ మిస్..:** హోప్-పూరన్ జోడీ 106 పరుగులు జోడించి ప్రమాదకరంగా మారుతుండగా..పూరన్‌ను అవుట్ చేసి షమి భారత శిబిరంలో సంతోషం నింపాడు. అదే ఊపుతో రెండో బంతికి పొలార్డ్‌ను కూడా పెవిలియన్‌కు చేర్చి హ్యాట్రిక్‌పై నిలిచాడు. కానీ మూడో బంతిని హోల్డర్ అడ్డుకొని హ్యాట్రిక్‌ను నిలువరించాడు.

**కుల్దీప్ హ్యాట్రిక్:** 33వ ఓవర్ చివరి మూడు బంతులకు హోప్, హోల్డర్, జోసెఫ్‌లను అవుట్ చేసిన కుల్దీప్ హ్యాట్రిక్‌తో చరిత్ర సృష్టించాడు. అప్పటికి విండీస్ 210/8తో నిలవగా..కీమో పాల్, పియర్ (18 బంతుల్లో 3 ఫోర్లతో 21) తొమ్మిదో వికెట్‌కు 50 పరుగులు చేసి వెస్టిండీస్ పరాజయాన్ని కొంతసేపు నిలువరించారు.

**తొలుత రాహుల్...ఆపై రోహిత్..:** ఎప్పటి మాదిరే రాహుల్ మొదట జోరు ప్రదర్శించగా..ఆరంభంలో నెమ్మదిగా ఇన్నింగ్స్ ఆరంభించిన రోహిత్ క్రమంగా తన విశ్వరూపం ప్రదర్శించాడు. పియర్ బౌలింగ్‌లో పుల్‌షాట్‌తో సిక్సర్ కొట్టిన రాహుల్..మరో సింగిల్ తీసి హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అప్పటికింకా రోహిత్ నలభైల్లో ఉన్నాడు. అయితే పేసర్ కీమో పాల్ బౌలింగ్‌లో అద్భుత ఫోర్‌తో రోహిత్ కూడా 43వ అర్ధసెంచరీ పూరించాడు. అక్కడినుంచి రోహిత్ గేరుమార్చి స్పీడందుకున్నాడు. 34వ ఓవర్లో రోహిత్ సెంచరీకి చేరుకోగా అనంతరం జోసెఫ్ బౌలింగ్‌లో బౌండరీతో రాహుల్ కూడా శతకం పూర్తి చేశాడు. వెంటనే జోసెఫ్ బౌలింగ్‌లో చేజ్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. అలా 37వ ఓవర్లో 227 పరుగుల తర్వాతగానీ వెస్టిండీస్‌కు ఊరట లభించలేదు.

**కోహ్లీ గోల్డెన్ డక్...:** అప్పటికే రోహిత్, రాహుల్ పరుగుల వర్షంలో తడిసిముద్దయిన విశాఖ అభిమానుల హర్షధ్వానాల నడుమ గ్రౌండ్‌లోకి వచ్చిన కోహ్లీని నెమ్మదైన షార్ట్‌బాల్‌తో పొలార్డ్ బోల్తా కొట్టించాడు. దాంతో ఎదుర్కొన్న తొలి బంతికే నిష్క్రమించి... విరాట్ గోల్డెన్ డకౌటయ్యాడు. అటు రోహిత్..44వ ఓవర్లో కాట్రెల్ బౌలింగ్‌లో నిష్క్రమించాడు.



విరాట్ 0(1) | పొలార్డ్ 0(1)

**పంత్, శ్రేయాస్ విధ్వంసం..:** రోహిత్ నిష్క్రమణతో హమ్మయ్య.. అని వెస్టిండీస్ ఊపిరిపీల్చుకుంటుండగానే మొదలైంది.. పంత్, శ్రేయాస్ అయ్యర్‌ల విధ్వంసం. కాట్రెల్ వేసిన 46వ ఓవర్లో పంత్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. 6,4,6,4,4తో 24 పరుగులు రాబట్టడంతో ఫ్యాన్స్ అరుపులతో స్టేడియం దద్దరిల్లింది. మరోవైపు తానేమీ తక్కువకాదంటూ ఆఫ్ స్పిన్నర్ చేజ్ వేసిన 47వ ఓవర్లో 6,6,4,6,6తో అయ్యర్ చెలరేగాడు. దాంతో ఆ ఓవర్లో మొత్తం 31 రన్స్ వచ్చాయి. ఇంకో భారీ షాట్ కొట్టే యత్నంలో 48వ ఓవర్లో పంత్ అవుటయ్యాడు. 4వ వికెట్‌కు 4 ఓవర్లలోనే 73 పరుగులు జోడించడం చూస్తే కరీబియన్లపై వారు ఏస్థాయిలో విరుచుకుపడ్డారో అర్థమవుతుంది. ఇక హాఫ్ సెంచరీ పూర్తి చేసిన అయ్యర్ 49వ ఓవర్లో పెవిలియన్‌కు చేరాడు. ఆఖరి ఓవర్లో కేదార్ జాదవ్ (10 బంతుల్లో 3 ఫోర్లతో 16 నాటౌట్) బ్యాట్ ఝుళిపించాడు.

## 31

భారత వన్డే చరిత్రలో ఒక ఓవర్‌లో అత్యధికంగా వచ్చిన పరుగులు. రోస్టన్ చేజ్ వేసిన ఇన్నింగ్స్ 47వ ఓవర్‌లో శ్రేయాస్ అయ్యర్ ఫోర్, నాలుగు సిక్స్‌లతో విజృంభించడంతో ఏకంగా 31 పరుగులొచ్చాయి. ఒక ఓవర్‌లో అత్యధికంగా 28 పరుగులు సాధించిన భారత తొలి ఆటగాడిగా అయ్యర్ రికార్డులకెక్కాడు. తొలి బంతికి నోబాల్‌బైస్‌గా 2 పరుగులు రాగా.. తర్వాతి బంతికి పంత్ ఓ పరుగు చేశాడు. ఆ తర్వాత 2, 3 బంతులను సిక్సర్లు బాదిన అయ్యర్.. నాలుగో బంతిని బౌండరీకి తరలించాడు. 5, 6 బంతులను మళ్లీ సిక్సర్లుగా మలిచాడు. 1999లో న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో భారత్ ఒక ఓవర్‌లో అత్యధికంగా 28 పరుగులు పిండుకొంది. అప్పుడు సచిన్ టెండూల్కర్ బ్యాట్‌ను ఝుళిపించాడు.

### స్కోరు బోర్డు

**భారత్:** రోహిత్ (సి) హోప్ (బి) కాట్రెల్ 159, రాహుల్ (సి) రోస్టన్ చేజ్ (బి) జోసెఫ్ 102, కోహ్లీ (సి) రోస్టన్ చేజ్ (బి) పొలార్డ్ 0, శ్రేయాస్ అయ్యర్ (సి) హోప్ (బి) కాట్రెల్ 53, రిషభ్ పంత్ (సి) పూరన్ (బి) కీమో పాల్ 39, కేదార్ (నాటౌట్) 16, జడేజా (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 50 ఓవర్లలో 387/5; వికెట్ల పతనం:** 1-227, 2-232, 3-292, 4-365, 5-373; **బౌలింగ్:** కాట్రెల్ 9-0-83-2, హోల్డర్ 9-0-45-0, కేరీ పియర్ 9-0-62-0, కీమో పాల్ 7-0-57-1, జోసెఫ్ 9-1-68-1, రోస్టన్ చేజ్ 5-0-48-0, పొలార్డ్ 2-0-20-1.

**వెస్టిండీస్:** ఎవిన్ లూయిస్ (సి) శ్రేయాస్ (బి) శార్దూల్ 30, షాయ్ హోప్ (సి) కోహ్లీ (బి) కుల్దీప్ 78, హెట్‌మయెర్ (రనౌట్) 4, రోస్టన్ చేజ్ (బి) జడేజా 4, నికోలస్ పూరన్ (సి) కుల్దీప్ (బి) షమి 75, పొలార్డ్ (సి) పంత్ (బి) షమి 0, హోల్డర్ (స్టంప్డ్) పంత్ (బి) కుల్దీప్ 11, కీమో పాల్ (బి) షమి 46, జోసెఫ్ (సి) కేదార్ (బి) కుల్దీప్ 0, పియర్ (సి) కోహ్లీ (బి) జడేజా 21, కాట్రెల్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 43.3 ఓవర్లలో 280 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-61, 2-73, 3-86, 4-192, 5-192, 6-210, 7-210, 8-210, 9-260; **బౌలింగ్:** చాహర్ 7-1-44-0, శార్దూల్ 8-0-55-1, షమి 7.3-0-39-3, జడేజా 10-0-74-2, కుల్దీప్ 10-0-52-3, శ్రేయాస్ 1-0-13-0.

## టీ10 లీగ్‌పై ఐసీసీ విచారణ

**దుబాయ్:** కతార్‌లో జరిగిన టీ10 లీగ్‌పై ఐసీసీ విచారణ చేపట్టనుంది. అవినీతి మరకలున్న అనేక మంది ఆ లీగ్ సమయంలో కనిపించడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఏడాది క్రితం ఈ లీగ్‌కు ఐసీసీ అనుమతినిచ్చింది. అయితే, టోర్నీ ఆరంభానికి ముందు ఫ్రాంచైజీ యజమానులు, నిర్వాహకుల తీరు డేంజర్ బెల్స్ మోగించిందని ఐసీసీ అవినీతి నిరోధక విభాగం జీఎం అలెక్స్ మార్షల్ చెప్పాడు. దీంతో సమాచారం రాబట్టేందుకు తమ వాళ్లను రంగంలోకి దించామని తెలిపాడు. ఈనెల 6 నుంచి 17 వరకు కతార్ టీ10 లీగ్ జరిగింది. మొత్తం ఆరు జట్లు ఇందులో పాల్గొన్నాయి.



## ఆసీస్, విండీస్ ప్లేయర్లు హాట్‌కేక్‌లు!

యువ స్టార్స్‌కు జాక్‌పాట్ చాన్స్

ఐపీఎల్-2020 వేలం నేడు

**కోల్‌కతా:** శీతాకాలంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వేలం హాట్‌హాట్‌గా జరగనుంది. గురువారమిక్కడ ఐపీఎల్-2020 ఆటగాళ్ల వేలాన్ని నిర్వహించనున్నారు. వెస్టిండీస్, ఆస్ట్రేలియా స్టార్ ప్లేయర్లపైనే అందరి దృష్టి నెలకొంది. అయితే యువ ఆటగాళ్లు జాక్‌పాట్ కొట్టే అవకాశాలున్నాయి. వచ్చే ఏడాది టీ20 వరల్డ్‌కప్ ఉన్న నేపథ్యంలో ఈ ఐపీఎల్‌కు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. లీగ్‌లో వేలానికి రానున్న వారిలో పిన్న వయస్కుడైన అఫ్ఘానిస్థాన్ స్పిన్నర్ నూర్ అహ్మద్ (14 ఏళ్ల 350 రోజులు) హాట్‌కేక్‌గా అమ్ముడయ్యే చాన్సుంది. లెఫ్టామ్ చైనామన్ స్పిన్నర్ అయిన నూర్ కనీస ధర రూ. 30 లక్షలు. భారత యువ స్టార్లలో యశస్వి జైస్వాల్, ప్రియం గార్గ్‌తో పాటు తమిళనాడు లెఫ్టామ్ స్పిన్నర్ సాయి కిశోర్, బెంగాల్ పేసర్ ఇషాన్ పోరెల్ కోసం డిమాండ్ ఏర్పడింది. వీరి కనీస ధర రూ. 20 లక్షలు కాగా.. ఫ్రాంచైజీలు వీరిని దక్కించుకోవడానికి ఎంత వెచ్చిస్తాయో చూడాలి. బెంగళూరు విడుదల చేసిన విండీస్ బిగ్ హిట్టర్ హెట్‌మయెర్‌తోపాటు మీడియం పేసర్ కెస్రిక్ విలియమ్స్‌పై కూడా ఫ్రాంచైజీలు కన్నేశాయి.

### కమిన్స్‌కు భారీ ధర..!

ఆస్ట్రేలియా ఆటగాళ్లు కమిన్స్, హాజెల్‌వుడ్, క్రిస్ లిన్, మిచెల్ మార్ష్, మ్యాక్స్‌వెల్‌తోపాటు స్టెయిన్ (దక్షిణాఫ్రికా), మాథ్యూస్ (శ్రీలంక) రూ. 2 కోట్ల కనీస ధర జాబితాలో ఉన్నారు. రెండేళ్ల విరామం తర్వాత మళ్లీ లీగ్ ఆడడానికి మొగ్గుచూపిన కమిన్స్‌పై ఫ్రాంచైజీలు కాసులు కురిపించే చాన్సుంది. బెంగళూరు జట్టు స్టార్లతో కళకళలాడుతున్నా.. టాప్ క్లాస్ పేసర్, బెస్ట్ ఫినిషర్ లేని లోటు వారిని వెంటాడుతోంది. దీంతో లోపాలను సరిదిద్దే ఆటగాడి కోసం ఆ ఫ్రాంచైజీ తగిన వ్యూహంతో వేలానికి రానుంది. ఇక కోల్‌కతా... ఊతప్ప, పియూష్ చావ్లా, యూసుఫ్ పఠాన్‌లను వదులుకొంది. టెస్ట్ స్పెషలిస్టులు పుజారా, విహారి కూడా అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

332 : వేలంలో పాల్గొంటున్న మొత్తం క్రికెటర్లు
134 : వేలంలో పాల్గొనే క్యాప్‌డ్ ప్లేయర్లు
198 : అన్‌క్యాప్‌డ్ ఆటగాళ్లు
186 : వేలంలో భారత ప్లేయర్లు
146 : వేలంలో విదేశీ క్రికెటర్లు
73 : వేలంలో కావల్సిన ఆటగాళ్లు. ఇందులో 29మంది విదేశీ క్రికెటర్లు ఉంటారు.

## ఆదుకున్న రికీ జోడీ

ఆంధ్ర 249/6

ఢిల్లీతో రంజీ

**ఒంగోలు (కార్పొరేషన్):** మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ రికీ భుయ్ (70 నాటౌట్), కరణ్ షిండే (48) బాధ్యతాయుతంగా ఆడడంతో ఢిల్లీతో మ్యాచ్‌లో ఆంధ్రకు స్వల్ప ఆధిక్యం లభించింది. రంజీ ట్రోఫీలో భాగంగా ఒంగోలు శర్మ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్ బుధవారం ఆట ముగిసేసరికి ఆతిథ్య జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 87 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 16/2తో రెండో రోజు బ్యాటింగ్ కొనసాగించిన ఆంధ్ర..మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ రికీ భుయ్ అజేయ అర్ధ శతకంతో 34 పరుగుల స్వల్ప ఆధిక్యం సంపాదించింది. ఒక దశలో జట్టు స్కోరు 115 పరుగులకు సగం (5) వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన ఆంధ్రను రికీ భుయ్ - కరణ్ షిండే (48) జోడీ బాధ్యతాయుత బ్యాటింగ్‌తో గట్టెక్కించింది. రికీ జంట ఐదో వికెట్‌కు 122 పరుగులు సాధించింది. మనీష్ (42), హనుమ విహారి (38) రాణించారు. క్రీజులో రికీ భుయ్‌తో పాటు గిరినాథ్ రెడ్డి (11) ఉన్నారు. ఢిల్లీ బౌలర్లలో నవదీప్ సైనీ మూడు, పవన్ సుయల్ 2 వికెట్లు పడగొట్టారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీ 215 పరుగులకు ఆలౌటైంది.



రికీ భుయ్ (70)

### సఫారీ బ్యాటింగ్ సలహాదారుగా కలిస్

**జొహాన్నెస్‌బర్గ్:** దక్షిణాఫ్రికా దిగ్గజ ఆల్‌రౌండర్ జాక్వస్ కలిస్ ఆ దేశ జాతీయ జట్టు బ్యాటింగ్ సలహాదారుగా నియమితుడయ్యాడు. 'మా జట్టు బ్యాటింగ్ సలహాదారుగా ఎంపికైన కలిస్‌కు అభినందనలు. ఈరోజే అతను జట్టుతో కలుస్తాడు' అని క్రికెట్ సౌతాఫ్రికా ట్విటర్ ద్వారా ప్రకటించింది.



### 'టాప్'లోకి బెంగళూరు

**గువాహటి:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు ఎఫ్‌సీ జట్టు మళ్లీ పుంజుకుంది. గత ఓటముల నుంచి కోలుకున్న బెంగళూరు తాజాగా నార్త్‌ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సీ జట్టుపై గెలిచింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో బెంగళూరు 2-0 గోల్స్ తేడాతో నార్త్‌ఈస్ట్‌ను చిత్తుచేసింది. మ్యాచ్‌లో నమోదైన రెండు గోల్స్‌ను బెంగళూరు కెప్టెన్ సునీల్ ఛెత్రి (68వ), ఆల్బర్ట్ సెర్రాన్ (80వ) సాధించారు. ఈ గెలుపుతో బెంగళూరు పాయింట్ల పట్టికలో మళ్లీ అగ్రస్థానానికి చేరుకుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

epaper.andhrajyothy.com